RNI NO. TELTEL/2021/81092 Published from Jagtial Email: prajamantalu@gmail.com

# ప్రజా మంటలు

తెలంగాణ జాతీయ దినపత్రిక

సంపుటి (Volume) : 3 పేజీలు - 8

సంచిక (Issue) : 329 వెల - రూ 5:00

ఎడిటర్: సిహెచ్.వి. ప్రభాకర్ రావు prajamantalu.com

బుధవారం 19, ఏప్రిల్ 2023

Published From Jagithyal, Circulated to Jagtial, Jangaon,Jayashankar Bhoopalpally, Jogulamba Gadwal, Kamareddy, Karimnagar, Khammam, Komaram Bheem Asifabad, Mahabubabad, Mahabubnagar, Mancherial, Medak, Medchal, Nagarkurnool, Nalgonda, Nirmal, Nizamabad, Peddapalli, Rajanna Sircilla,Rangareddy, Sangareddy, Siddipet, Suryapet, Vikarabad, Wanaparthy, Warangal (Rural), Warangal (Urban), Yadadri Bhuvanagiri,

## తెలంగాణ పల్లెలు సత్తా చాటాయి: కెటిఆర్



హైదరాబాద్, ఏప్రిల్18, (ప్రజా మంటలు) : జాతీయ పంచాయతీ అవార్డుల్లో తెలంగాణ మరో సారి సత్తా చాటింది. ప్రజోపయోగ కార్యక్రమాల అమలులో దేశంలోని ఇతర రాష్ట్రాల కన్నా తెలంగాణ ముందంజలో ఉన్నట్టు మరోసారి వెల్లడైంది. వివిధ విభాగాల్లో కేంద్రం ప్రకటించిన మొత్తం 46 అవార్డుల్లో తెలంగాణ 13 దక్కించు కొని మొదటిస్థానంలో నిలి చిన సంగతి తెలిసిందే. మొత్తం 46 అవార్డుల్లో తెలంగాణ 13 అవార్డులను దక్కించు కోవడంపై రాష్ట్ర ఐటీ, పురపాలక శాఖ మంత్రి కేటీఆర్ హర్షం వ్యక్తం చేశారు. ముఖ్య మంత్రి కేసీఆర్ విజన్ వల్లే పల్లె ప్రగతి విజయవంతమైందన్నారు. జాతీయ స్థాయిలో తెలంగాణ పల్లెలు సత్తా చాటడం ఎంతో ఆనందంగా ఉన్నారు. 46 అవార్డుల్లో 13 అవార్డులు సొంతం చేసు కోవడం.. తెలంగాణ ప్రభుత్వ పాలనకు నిదర్శనమని పేర్కొన్నారు.

# తొమ్మిదేళ్ల కెసిఆర్ పాలనలో ఎన్నో అద్భుతాలు

- చెప్పడానికి వందల పథకాలు..కార్యక్రమాలు
- బిజెపి చెప్పకోవడానికి ఒక్కటైనా ఉందా
- కుట్రలు,కుతంత్రాలు తప్ప మరోటి తెలియని బిజెపి
- రాష్ట్రంలో మళ్లీ బిఆర్ఎస్‌దే హ్యాట్రిక్ విజయం
- చౌటుప్పల్ ఆత్మీయ సమ్మేళనంలో మంత్రి హరీష్ రావు
- దేశం యావత్తూ తెలంగాణ వైపు చూస్తోందన్న జగదీశ్ రెడ్డి



యాదాద్రిభువనగిరి,ఏప్రిల్18,(ప్రజామంటలు): తొమ్మిదేళ్లలో తెలంగాణలో సిఎం కెసిఆర్ చేసిన పనులు చెప్ప డానికి వంద ఉన్నాయని..అదే బిజెపి ఏంచేసిందో ఒక్కటైనా చెప్పగలదా అని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి హరీశ రావు సవాల్ చేశారు. ఎమ్మెల్యేలను కొనుడు..ప్రభుత్వాలను పడగొట్టుడు, గుడ్డుమీద ఈకలు పీకుడు తప్ప మరో మంచిపని బిజెపి చేసిందా అని ప్రశ్నించారు. కేంద్రంలో అధికారం చెలాయి స్తున్న బీజేపీ అన్ని రంగాల్లో తెలంగాణపై వివక్ష చూపుతున్న దని మంత్రి హరీశ్‌రావు మండిపడ్డారు. చౌటుప్పల్‌లో విద్యుత్ శాఖ మంత్రి జగదీశ్‌రెడ్డి, ఎంపీ లింగయ్యయాదవ్, ఎమ్మెల్యే ప్రభాకర్‌రెడ్డి, ఇతర నాయకులతో కలిసి హరీశ్‌రావు బిఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీజేపీ కుట్రల పార్టీ అని విమర్శించారు. బిఆర్ఎస్ పార్టీ ప్రజల కోసం సంక్షేమ పథకాలను అమలు చేస్తుంటే.. బీజేపీ అధికారం కోసం పన్నాగాలు పన్నుతోందని, బిఆర్ఎస్‌వి పథకాలైతే, బిజెపివి పన్నాగాలని మండిపడ్డారు. బీజేపీ పన్నాగాలను ప్రజలు తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. అభివృద్ధి విషయంలో దేశంలో తెలంగాణతో పోటీపడే రాష్ట్రం ఏదైనా ఉందా అని మంత్రి హరీశ్‌రావు ప్రశ్నించారు. తెలంగాణలో రూ.2 వేల పెన్షన్ ఇస్తుంటే.. డబుల్ ఇంజిన్ సర్కారు ఉన్న గుజరాత్‌లో మాత్రం కేవలం రూ.600 మాత్రమే ఇస్తున్నారని ఎద్దేవా చేశారు. భారతీయ జనతాపార్టీ విద్యార్థుల జీవితాలతో ఆటలాడు కుంటున్నదని విమర్శించారు. రాష్ట్రంలో బీజేపీ ఎన్ని కుట్రలు చేసినా మూడోసారి కూడా బిఆర్ఎస్ పార్టీదే అధికారమని మంత్రి ధీమా వ్యక్తం చేశారు. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో గనకల్చర్.. బీఆర్ఎస్ పాలనలో ఉన్న రాష్ట్రంలో అగ్రికల్చర్ ప్రధానమైనవిగా

మిగతా... 2లో

## కెసిఆర్ పాలనలో వైద్యరంగం బలోపేతం

- తెలంగాణపై కేంద్ర ప్రభుత్వం వివక్ష
- ఎయిమ్స్‌లో నాలుగుళ్ల తరవాత మోడీ శంకుస్థాపన
- ఒక్క ఎయిమ్స్‌కే బిజెపి గొప్పలకు పోతోంది
- జిల్లాల్లో ప్రభుత్వాసుపత్రుల బలోపేతం
- క్యాన్సర్ రోగులకు ఉచితంగా కీమో థెరఫీ
- చౌటుప్పల్‌లో వంద పడకల ఆస్పత్రి నిర్మాణానికి శంకుస్థాపన
- కేంద్రం తీరుపై మండిపడ్డ మంత్రి హరీష్ రావు

యాదాద్రి భువనగిరి,ఏప్రిల్18, (ప్రజా మంటలు): తెలంగాణపై కేంద్ర ప్రభుత్వం వివక్ష చూపుతోందని మంత్రి హరీశ్ రావు అన్నారు. 2018లో యాదాద్రి జిల్లాకు ఎయిమ్స్‌ను కేటాయిస్తే నాలుగేళ్ల తర్వాత మోదీ వచ్చి శంకుస్థాపన చేశారని మంత్రి హరీశ్ రావు తెలిపారు. ఒక్క ఎయిమ్స్ కేటాయించినందుకే బీజేపీ నేతలు గొప్పలు చెప్పుకుంటున్నారని విమర్శించారు. చేతలు తక్కువ.. ప్రచారం ఎక్కువ అన్నట్లుగా బీజేపీ పరిస్థితి ఉందని ఎద్దేవా చేశారు. కేంద్రం ప్రారంభించిన ఎయిమ్స్‌లో ఇప్పటివరకు ఎలాంటి అభివృద్ధి లేదని విమర్శించారు. చౌటుప్పల్‌లో 100 పడకల

మిగతా... 2లో





## విభిన్న సంస్కృతుల సమ్మేళనం హైదరాబాద్

- ఇది తమ సొంత ఇల్లుగా భావిస్తున్న ప్రజలు
- సిటీకో యూనిట్ ప్రారంభోత్సవంలో కెటిఆర్

హైదరాబాద్,ఏప్రిల్18, (ప్రజా మంటలు) : హైదరాబాద్ నగరం విభిన్న సంస్కృతుల సమ్మేళనం అని.. దేశం లోని ప్రజలు అంతా తమ ఇంట్లో ఉన్నట్లుగా ఇక్కడ భావిస్తున్నారని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి కేటీఆర్ స్పష్టం చేశారు. గత తొమ్మిదేండ్లలో సాంకేతిక రంగంలో ఉద్యోగుల సంఖ్య 3.25 లక్షల నుండి 10 లక్షలకు పెరిగిందని తెలిపారు. హైదరాబాద్ నాలెడ్జ్ సిటీలో గ్లోబల్ ఆల్టర్నేటివ్ ఇన్వెస్ట్‌మెంట్ అసెట్స్ సర్వీస్ సిటీకో కొత్త యూనిట్‌ను మంత్రి కేటీఆర్ మంగళ వారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి కేటీఆర్ మాట్లాడుతూ.. హైదరాబాద్ అన్ని సంస్కృతులను స్వాగతిస్తుంది. అర్థంలేని మాటలకు, ద్వేషం, హింసకు ఇక్కడ చోటు లేదు. ఇక్కడలా అండ్ ఆర్డర్ కఠినంగా ఉంటుంది. మరీ ముఖ్యంగా విద్య, అకడమిక్, ఇన్నోవేషన్, పర్యావరణ వ్యవస్థలు పగడ్బందీగా ఉన్నాయని మంత్రి కేటీఆర్ తెలిపారు. ఇమేజ్ టవర్స్, యానిమేషన్, గేమింగ్, మల్టీమీడియా కోసం ఇక్కడ ఒక కేంద్రం నిర్మించబడుతోందని మంత్రి పేర్కొన్నారు. ఇది 18 ఎకరాల్లో విస్తరించి ఉండగా.. ప్రపంచంలోనే అతిపెద్ద ఇన్నోవేషన్ క్యాంపస్ అవుతుంది. దీనికి హైదరాబాద్‌ను ఎంపిక చేసుకుని సిటీకో తెలివైన పని

మిగతా... 2లో

## సిట్ విచారణతో న్యాయం జరగదు

- ప్రభుత్వ పెద్దలను కాపాడేందుకే సిట్
- పేపర్ లీక్ పాపం ముమ్మాటికీ ప్రభుత్వానిదే
- టిపిసిసి చీఫ్ రేవంత్ విమర్శలు



హైదరాబాద్, ఏప్రిల్ 18, (ప్రజామంటలు): టీఎస్‌పీఎస్సీ కేసు విచారణ రాష్ట్ర అధికారులు చేపడితే కేసులో నిజానిజాలు నిగ్గు తేలవని టీపీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డి అన్నారు. ఇప్పటి వరకు సిట్ ద్వారా ఏ కేసు కూడా తేలలేదని గుర్తు చేశారు. కేవలం కాలయాపనతో నిజాలు అణిచివేసే కుట్ర జరుగుతోందన్నారు. మంగళవారం మీడియాతో మాట్లాడుతూ... ప్రభుత్వంలో పెద్దలను కాపాడుకునేందుకే ప్రభుత్వం సిట్‌ను ఉపయోగించుకుందన్నారు. టీఎస్పీఎస్సీ పేపర్ లీక్ పాపం ముమ్మాటికీ సర్కారుదేనని రేవంత్ రెడ్డి ఆరోపించారు. ఈ కేసును సీబీఐతో విచారణ చేయించాల్సిందేనని పట్టుబట్టారు. ప్రభుత్వ పెద్దలను కాపాడేందుకే సిట్ వేశారన్న ఆయన.. పేపర్ లీక్‌లో అసలు నిందితులు తప్పించుకుంటు న్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రతీ ఏటా 2 కోట్ల ఉద్యోగాలు ఇస్తానన్న మోదీ నిరుద్యోగులను మోసం చేశారని మండిపడ్డారు. 22 కోట్ల 6 లక్షల దరఖాస్తులు వస్తే 7,22,311 ఉద్యోగాలు ఇచ్చామని పార్లమెంట్‌లో ప్రధాని సమాధానం ఇచ్చారని.. అంటే పార్లమెంటు సాక్షిగా నిరుద్యోగులను మోసం చేసినట్లు ప్రధాని అంగీకరించారన్నారు. తెలం గాణలో అధికారంలోకి వస్తే ఒకే రోజులో 2లక్షల ఉద్యోగాలు ఇస్తామని బండి సంజయ్ చెబుతున్నారని.. బండి మాటలు వింటే నవ్వాలో ఏడవాలో అర్థం కావడం లేదని వ్యాఖ్యలు చేశారు. హైదరాబాద్ వరదల సమయంలో బండి పోతే బండి ఇస్తామన్నారు... ఆ తరువాత ఇన్సూరెన్స్ ఉంది కదా అన్నారన్నారు. అసలు ఏ శాఖలో ఎన్ని ఉద్యోగ ఖాళీలు ఉన్నాయో బండికి తెలుసా? అని రేవంత్ ప్రశ్నించారు. ఇంటికో ఉద్యోగం అని కేసీఆర్, ఒకే రోజు 2 లక్షల ఉద్యోగాలని బండి ప్రజలను మోసం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజాక్షేత్రం నుంచి పార్లమెంట్ వరకు నిరుద్యోగుల కోసం కొట్లాడింది కాంగ్రెస్ అని చెప్పుకొచ్చారు. బండి సంజయ్ నిరుద్యోగ మార్చ్ మోదీ ఇంటి దగ్గర చేయాలని హితవుపలికారు. ఈ నెల 21న నల్గొండలో మాహాత్మా గాంధీ యూనివర్సిటీలో నిరుద్యోగ నిరసన చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ నెల 24న ఖమ్మం జిల్లాలో, 26న ఆదిలాబాద్‌లో నిరసన కార్యక్రమాలు చేపడతామని వెల్లడించారు. మే 4 లేదా 5న సరూర్‌నగర్‌లో నిరుద్యోగుల సమస్యలపై భారీ సభ నిర్వహిస్తామన్నారు.

ఎల్బీ నగర్‌లోని శ్రీకాంతాచారి విగ్రహానికి నివాళులు అర్పించి.. సభా ప్రాంగణానికి ర్యాలీగా వెళతామని అన్నారు. ఈ సభకు ప్రియాంక గాంధీ

మిగతా... 2లో



## సిఎండికి కృతజ్ఞతలు తెలిపిన అకౌంట్స్ ఆఫీసర్స్

హైదరాబాద్,ఏప్రిల్18, (ప్రజామంటలు): ముఖ్యమంత్రి కేసీఆర్, విద్యుత్ శాఖ మంత్రి జగదీశ్ రెడ్డికి తెలంగాణ విద్యుత్ అకౌంట్స్ ఆఫీసర్స్ అసోసియేషన్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపింది. తెలంగాణ రాష్ట్రంలోని విద్యుత్ ఉద్యోగులకు గౌరవ ప్రదమైన వేతన సవరణ చేసినందుకు గాను విద్యుత్ అకౌంట్స్ ఆఫీసర్స్ అసోసియేషన్ తరపున ఆ సంఘం నాయకులు ట్రాన్స్‌కో, జెన్‌కో సీఎండీ దేవులపల్లి ప్రభాకర్ రావును ఆయన కార్యాలయంలో కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా విద్యుత్ అకౌంట్స్ ఆఫీసర్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి అంజయ్య మాట్లాడుతూ.. విద్యుత్

మిగతా... 2లో

## ముంబైలో తొలి యాపిల్ స్టోర్

### స్వయంగా స్టోర్ తలుపులు తెరిచిన సీఈఓ టిమ్ కుక్

ముంబై,ఏప్రిల్18, (ప్రజా మంటలు) : భారత్‌లో యాపిల్ తొలి రిటైల్ స్టోర్ ప్రారంభమైంది. దేశ ఆర్థిక రాజధాని ముంబైలోని బాంద్రా కుర్ల కాంప్లెక్స్‌లో 'యాపిల్ బీకేసీ' పేరిట ఈ స్టోర్‌ను ప్రారంభించారు. యాపిల్ సీఈఓ టిమ్ కుక్ స్వయంగా స్టోర్ తలుపులు తెరిచి కస్టమర్లను ఆహ్వానించారు. ఈ స్టోర్‌లో యాపిల్ ఉత్పత్తులన్నింటినీ కొనుగోలు చేయొచ్చు. ఇండియాలో తన బిజినెస్ కార్యాకలాపాలను శరవేగంగా విస్తరించే ప్రణాళికలో భాగంగా యాపిల్.. రిటైల్ స్టోర్లను అందుబాటులోకి తీసుకువస్తోంది. ఈ నెల 20న ఢిల్లీలో రెండో యాపిల్ స్టోర్‌ను తెరిచేందుకు అన్ని ఏర్పాట్లు చేసుకుంది. 'యాపిల్ సాకేత్' పేరుతో ఢిల్లీలో రెండో యాపిల్ రిటైల్ స్టోర్ తెరవనుంది. ఇక ముంబైలో యాపిల్ రిటైల్ స్టోర్ అందుబాటులోకి రావడంతో స్టోర్‌ను చూడటానికి, అందులోని ఉత్పత్తులను కొనగోలు చేసేందుకు యాపిల్ అభిమానులు 'యాపిల్ బీకేసీ' స్టోర్ ముందు బారులు తీరారు. అయితే, ఓ అభిమాన మాత్రం ఏకంగా టిమ్



కుక్‌నే సర్‌ప్రైజ్ చేశాడు. 1984లో అందుబాటులోకి తెచ్చి మొదటి యాపిల్ కంప్యూటర్ వెర్షన్

మిగతా... 2లో

## నామినేషన్ దాఖలు చేసిన డికె శివకుమార్

- ఆస్తుల విలువ రూ.1,214 కోట్లుగా వెల్లడి

బెంగళూరు, ఏప్రిల్ 18, (ప్రజా మంటలు) : కర్ణాటక కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు డీకే శివకుమార్ తన ఆస్తుల వివరాలు వెల్లడించారు. అసెంబ్లీ ఎన్నికల కోసం కనకపుర నియోజకవర్గం నుంచి నామినేషన్ దాఖలు చేసిన డీకే.. ఎన్నికల అఫిడవిట్‌లో తనకు ఆస్తుల విలువ రూ.1,214 కోట్లుగా పేర్కొన్నారు. దాంతో కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ తరపున పోటీపడుతున్న



అభ్యర్థులందరిలో ఆయనే టాప్ ప్లేస్‌లో నిలిచారు. కాగా, 2018 అసెంబ్లీ ఎన్నికలప్పుడు సమర్పించిన అఫిడవిట్‌లో డీకే తన ఆస్తుల విలువను రూ.721.56

మిగతా... 2లో



## అల్లర్లతో అట్టుడుకుతున్న సూడాన్

### కర్నాటకకు చెందిన 31మంది మృతి

బెంగళూరు,ఏప్రిల్18, (ప్రజా మంటలు) : ఆఫ్రికా దేశం సుడాన్ అల్లర్లతో అట్టుడుకుతోంది. ఆర్మీ, శక్తివంత మైన పారామిలిటరీ బలగాల మధ్య మూడు రోజు లుగా ఘర్షణలు కొనసాగుతున్నాయి. ఈ ఘర్షణల్లో ఇప్పటి వరకు సుమారు 200 మంది ప్రాణాలు కోల్పోయినట్లు అధికారులు తెలిపారు. 1800 మందికిపైగా ప్రజలు ఆసుపత్రి పాలయ్యారు. కాగా, ఈ ఘర్షణ వాతావరణంలో పలువురు భారతీయులు ఆ దేశంలో చిక్కుకుపోవడం

మిగతా... 2లో

## కృష్ణా పరివాహకంలో మంత్రి నిరంజన్ భూకబ్జా

- భూముల ఆక్రమణలతో మూడు ఫామ్‌హౌజ్‌ల నిర్మాణం
- ఈటెలకో న్యాయం..నిరంజన్‌కో న్యాయమా
- తన ఆరోపణలపై నిగ్గు తేల్చాలన్న రఘునందన్

హైదరాబాద్,ఏప్రిల్18, (ప్రజా మంటలు) : రాష్ట్రంలో అధికార పార్టీ నేతల భూకబ్జాలకు హద్దూ అదుపు లేకుండా పోతోందని బీజేపీ ఎమ్మెల్యే రఘునందన్ రావు అన్నారు.



ప్రభుత్వ భూములను, ప్రాజెక్టులకు కేటాయించిన భూములను బీఆర్ఎస్ నేతలు అక్రమంగా ఆక్రమించారని ఆరోపించారు. ప్రాజెక్టులకు కేటాయించిన భూములను

మిగతా... 2లో



## నిరంతర విద్యుత్ ఘనత సిఎం కెసిఆర్‌దే

- ఢిల్లీలో పాగా వేయాలంటే బిఆర్ఎస్ గెలవాలి
- మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి

నిజామాబాద్,మార్చి18, (ప్రజామంటలు): తెలంగాణలో నిరంతరంగా 24 గంటల పాటు నాణ్యమైన విద్యుత్‌ను అందిస్తోంది సిఎం కెసిఆర్ మాత్రమేనని మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి అన్నారు. సుర్రుమంటున్న ఎండల్లోల సైతం విద్యుత్ సరఫరకు ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తోందన్నారు. పక్కన ఎన్నికలు జరుగుతున్న కర్నాటకలో 24గంటల

మిగతా... 2లో

## ప్రజానాడి





# విభిన్న సంస్కృతుల సమ్మేళనం హైదరాబాద్

**మొదటిపేజీ తరువాయి..**

చేసిందన్నారు. సిటీకో మనీలాలో 3500 మంది ఉండగా, టోరంటో కేంద్రంలో 2500 మందే ఉన్నారు. హైదరాబాద్‌లో అమెజాన్ అతిపెద్ద క్యాంపస్, మైక్రోసాఫ్ట్, మెటా, యాపిల్, గూగుల్, ఉబెర్, మైక్రోన్, క్వాల్‌కామ్ వంటి సంస్థల రెండవ అతిపెద్ద క్యాంపస్‌కు నిలయంగా హైదరాబాద్ మారిందన్నారు. ఈ క్రమంలో సిటీకోకు చెందిన ప్రపంచం లోనే రెండో అతిపెద్ద క్యాంపస్ హైదరాబాద్‌లో ఉండాలని, దానిని సాకారం చేద్దాం అని కేటీఆర్ చెప్పారు.

# సిట్ విచారణతో న్యాయం జరగదు

**మొదటిపేజీ తరువాయి..**

ముఖ్య అతిథిగా పాల్గొంటారని టీపీసీసీచీఫ్ పేర్కొన్నారు. ఇది కాంగ్రెస్ పార్టీ కోసం కాదని.. నిరుద్యోగుల కోసం చేస్తున్న పోరాట మని స్పష్టం చేశారు. అన్ని నిరుద్యోగ సంఘాలు మద్దతు తెలపాల్సిందిగా కోరారు. మే 9 నుంచి హాత్ సే హాత్ జోడో యాత్ర రెండో విడత కార్యక్రమం ఉంటుందని.. జోగులాంబ జిల్లా నుంచి యాత్ర ప్రారంభమవుతుందని రేవంత్ రెడ్డి ప్రకటించారు. అన్ని కార్యక్రమాలకు 50లక్షల విద్యార్థులు ఓ సామాజిక బాధ్యతగా పాల్గొనాలని కోరారు. అన్ని నిరుద్యోగ, విద్యార్థి సంఘాలు ఈ నిరసన దీక్షలో భాగస్వామ్యం కావాలని చెప్పారు. మీ వంతు సహకారాన్ని అందించాలని రేవంత్ రెడ్డి అన్నారు. బీజేపీ నేతలు ఢిల్లీలోని ప్రధాని మోడీ ఇంటి ముందు ధర్నా చేయాలని రేవంత్ రెడ్డి డిమాండ్ చేశారు. ప్రస్తుతమున్న ప్రభుత్వం ఇంటికో ఉద్యోగం కాదు.. ఊరికో ఉద్యోగం కూడా ఇవ్వలేదన్న ఆయన.. ఏటా కోటి ఉద్యాగాలిస్తమన్న ప్రధాని సైతం మోసం చేశారని ఆరోపించారు. నిరుద్యోగుల తరపున కాంగ్రెస్ నిరంతరం పోరాటం చేస్తోందని చెప్పారు.

## నామినేషన్ దాఖలు చేసిన డికె శివకుమార్

**మొదటిపేజీ తరువాయి..**

కోట్లుగా పేర్కొన్నారు. అంటే అప్పటికీ, ఇప్పటికీ ఆయన ఆస్తుల విలువ 68 శాతం పెరిగింది. ఇక తాజా అఫిడవిట్‌లో తెలిపిన రూ. 1,214 కోట్ల ఆస్తుల్లో.. స్థిరాస్తుల విలువ రూ. 970.01 కోట్లుగా డీకే వెల్లడించారు. చరాస్తులు రూ. 244.93 కోట్లుగా తెలిపారు. అదేవిధంగా తనకు ఉన్న అప్పుల వివరాలను కూడా డీకే ఎన్నికల అఫిడవిట్‌లో వెల్లడించారు. లోన్‌లు, ఇతర రుణాలు కలిపి ఆయనకు మొత్తం రూ. 244.93 కోట్ల అప్పులు ఉన్నట్లు తెలిపారు. అదేవిధంగా మరో రూ. 227.20 కోట్ల వివాదాస్పద రుణాలు కూడా ఉన్నట్లు డీకే పేర్కొన్నారు. కాగా, కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ వచ్చే నెల 10న జరగనుంది. వచ్చే నెల 13న ఫలితాలను వెల్లడించనున్నారు.

## అల్లర్లతో అట్టుడుకుతున్న సూడాన్

**మొదటిపేజీ తరువాయి..**

ఇప్పుడు ఆందోళన కలిగిస్తోంది. కర్ణాటక రాష్ట్రానికి చెందిన సుమారు 31 మంది సుడాన్‌లో చిక్కుకున్నట్లు అధికారులు వెల్లడించారు. చిక్కుకున్న వారి కోసం విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ కు



సమాచారం అందించినట్లు కర్ణాటక రాష్ట్ర విపత్తు నిర్వహణ అథారిటీ తెలిపింది. ఈ మేరకు రెస్క్యూ ప్రక్రియను వేగవంతం చేయడానికి సుడాన్‌లోని భారత రాయబార కార్యాలయంతో సంప్రదింపులు జరుపుతున్నట్లు పేర్కొంది. 'కర్ణాటకకు చెందిన 31 మంది వ్యక్తులు సుడాన్‌లో చిక్కుకుపోయారని మాకు సమాచారం వచ్చింది. ఈ విషయాన్ని మేము విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖకు తెలియజేశాం. సుడాన్‌లోని భారత రాయబార కార్యాలయం సూచనలను పాటించాల్సిందిగా ఆ బృందాన్ని కోరాం. చిక్కుకుపోయిన వారు ఎక్కడున్నారో అక్కడే ఉండాలి, బయటికి వెళ్లకూడదని హెచ్చరించాం' అని కర్ణాటక రాష్ట్ర విపత్తు నిర్వహణ అథారిటీ కమిషనర్ డాక్టర్ మనోజ్ రాజన్ తెలిపారు. మరోవైపు సుడాన్‌లో చిక్కుకుపోయిన వారిని రక్షించాలని కాంగ్రెస్ నేత , కర్ణాటక మాజీ ముఖ్యమంత్రి సిద్ధరామయ్య కేంద్రానికి విజ్ఞప్తి చేశారు. హోం శాఖ, విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ జోక్యం చేసుకుని తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. బాధితులు సురక్షితంగా తిరిగి భారత్ చేరుకునేలా చూడాలన్నారు. 'కర్ణాటకకు చెందిన హక్కీ పిక్కీ తెగకు చెందిన 31 మంది సుడాన్‌లో చిక్కుకుపోయినట్లు సమాచారం. వారిని తిరిగి స్వదేశానికి తీసుకురావడానికి ప్రభుత్వం ఇంకా చర్యలు ప్రారంభించలేదు. ప్రభుత్వం తక్షణమే దౌత్యపరమైన చర్చలు ప్రారంభించి వారు సురక్షితంగా భారత్‌కు తిరిగి వచ్చేలా చూడాలని నేను కోరుతున్నా' అంటూ సిద్ధరామయ్య ట్విట్టర్ ద్వారా కేంద్రానికి, రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

## సిఎండికి కృతజ్ఞతలు తెలిపిన అకౌంట్స్ ఆఫీసర్స్

**మొదటిపేజీ తరువాయి..**

ఉద్యోగులకు గౌరవ ప్రద మైన వేతన సవరణ చేసినందుకు సీఎం కేసీఆర్, మంత్రి జగదీశ్ రెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. అలాగే, విద్యుత్ సంస్థల పరిరక్షణకై విద్యుత్ సంస్థల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా జరిగిన ఉద్యోగుల పోరాటానికి బాసటగా నిలిచి, విద్యుత్ రంగ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా అసెంబ్లీ తీర్మానం చేసి పంపి విద్యుత్ రంగాన్ని కంటికి రెప్పలా కాపాడుతున్న ముఖ్యమంత్రి కేసీఆర్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.సీఎండీ శ్రీ ప్రభాకర్ రావును కలిసిన వారిలో సంఘం ప్రధాన కార్యదర్శి అంజయ్యతో పాటు సంఘం అధ్యక్షులు అశోక్, షరీఫ్, కొరడాల వెంకటేశ్వర్లు, మహేందర్, శ్రీనివాస్ మహిళ కార్యదర్శి అనురాధ, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

# కెసిఆర్ పాలనలో వైద్యరంగం బలోపేతం

**మొదటిపేజీ తరువాయి..**

ఆస్పత్రి నిర్మాణానికి శంకుస్థాపన చేసిన అనంతరం మంత్రి హరీశ్ రావు మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం గత ఏడాది 8 వైద్య కళశాలలు ప్రారంభించిందని గుర్తు చేశారు. ఎయిమ్స్ నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం 200 ఎకరాల భూమిని కేటాయించిందని పేర్కొన్నారు. వైద్య రంగంలో తెలంగాణ అద్భుతాలు సృష్టిస్తోందని మంత్రి హరీశ్ రావు అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పనితీరును నీతిఆయోగ్ కూడా ప్రశంసించిందని తెలిపారు. ప్రభుత్వ వైద్యంపై ప్రజల్లో నమ్మకం పెరిగిం దన్నారు. ఫ్లోరైడ్ బాధితులకు ఉచితంగా డయాలసిస్ సేవలు అందిస్తున్నామని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 102 డయాలసిస్ సెంటర్లను ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. మిషన్ భగీరథ ద్వారా ఫ్లోరైడ్‌ను తరిమేసిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కుతుందని ప్రశంసించారు. ఈ నెలలోనే న్యూట్రీషియన్ కిట్ పథకాన్ని ప్రారంభించబోతున్నామని తెలిపారు. సూర్యాపేట, నల్లగొండలో నర్సింగ్ కాలేజ్, పారా మెడికల్ కాలేజీ మంజూరు చేశామన్నారు. బీఆర్ఎస్ పాలనలో వైద్య విద్య బలోపేతమైందని మంత్రి హరీశ్ రావు పునరుద్ఘాటించారు. క్యాన్సర్ రోగుల కోసం కీమోథెరపీ సేవలు ప్రారంభించబోతున్నామని చెప్పారు. ఎల్బీనగర్‌లో సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిని ప్రారంభించబోతున్నామని తెలిపారు. సీఎం కేసీఆర్ నాయకత్వంలో ఒక్క ఏడాదిలో 10వేల పడకలు అందుబాటులోకి రాబోతున్నాయని తెలిపారు. వరంగల్ హెల్త్ సిటీ పనులు వేగంగా జరుగుతున్నాయని అన్నారు. డిసెంబర్ నాటికి వరంగల్ హెల్త్ సిటీ అందుబాటులోకి వస్తుందని తెలిపారు. దేశానికే తెలంగాణ మోడల్‌గా ఉందని పేర్కొన్నారు. తెలంగాణ ప్రభుత్వం విద్య, వైద్యానికి పెద్దపీట వేస్తోందని.. ఇదే కాంగ్రెస్ పాలనకు బీఆర్ఎస్ పాలనకు తేడా అని స్పష్టం చేశారు. చౌటుప్పల్‌లో 100 పడకల ఆస్పత్రి నిర్మాణానికి మంగళవారం వైద్యారోగ్యశాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు, జిల్లా మంత్రి జగదీశ్‌రెడ్డి, ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. 36 కోట్లతో ఈ ఆస్పత్రిని నిర్మిస్తున్నామని చెప్పారు. మునుగోడు ఉప ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు చౌటుప్పల్ ఆస్పత్రితో పాటు నియోజకవర్గంలోని 4 పీహెచ్‌సీలను అప్‌గ్రేడ్ చేస్తున్నామని తెలిపారు.చౌటుప్పల్‌లో 30 పడకల సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని 100 పడకల ఆస్పత్రిగా మార్చడం ద్వారా సమీప ప్రాంతాల్లో ప్రజలకు నయాపైసా ఖర్చు లేకుండా అన్ని రకాల వైద్యసేవలు అందనున్నాయి. ఈ దవాఖానలో ప్రతి నిత్యం సుమారు 300 మందికిపైగా ఓపీ సేవలు పొందుతున్నారు. నెలకు 50 వరకు ప్రసవాలు కూడా జరుగుతున్నాయి. అంతేకాకుండా 65వ జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదాల్లో గాయపడిన వారు సైతం ఇక్కడేకు వస్తుంటారు. అన్ని రకాల వైద్యసేవలు అందుబాటులో లేక రోగులు ప్రైవేటు దవాఖానలకు వెళ్లి ఆర్థికంగా ఇబ్బందుల పాలవుతున్నారు. వీటి దృష్ట్యా మునుగోడు ఉప ఎన్నిక ప్రచార సమయంలో చండూర్ బహిరంగ సభలో ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి నియోజకవర్గంలో 100 పడకల దవాఖాన కావాలని సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లారు. ఆయన అభ్యర్థన మేరకు వంద పడకలకు హామీ ఇచ్చారు. ఈ హామీ మేరకు 100 పడకల ఆస్పత్రిని మంజూరు చేశారు. దవాఖానలో 100 పడకలు వస్తే పేదలకు నయాపైసా ఖర్చుల లేకుండా 24గంటల వైద్య సేవలు అందనున్నాయి. చౌటుప్పల్‌తో పాటు సంస్థాన్‌నారాయణపురం, వలిగొండ, భూదాన్‌పోచంపల్లి, చిట్యాల, మునుగోడు, చండూరు, మర్రిగూడ, నాంపల్లి తదితర మండలాల ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందుబాటులోకి రానున్నా యి. ప్రస్తుతం ఇక్కడ 5గురు వైద్యులు సుమా రు 30 మంది సిబ్బంది పనిచేస్తున్నారు. వంద పడకల దవాఖానగా మారితే అన్ని రకాల శస్త్ర చికిత్సలు చేయనున్నారు. జనరల్ సర్జన్‌తోపాటు ఎముకల, చిన్న పిల్లల, చెవు, ముక్కు, గొంతు, గైనకాలజి, అనస్తీషియా ప్రత్యేక విభాగాల వైద్యులు సేవలు అందుబాటులోకి రానున్నాయి. 20 మంది పైగా వైద్యులు ఇక్కడకు రానున్నారు. 100 మందికి పైగా ఇతర సిబ్బంది కూడా పనిచేయనున్నారు. ప్రత్యేక బ్లడ్ బ్యాంక్, ఐసీయూ కూడా ఏర్పాటు కానుంది. తద్వారా వివిధ రకాల రోగాలకు శస్త్ర చికిత్స చేయనున్నారు. 65వ జాతీయ రహదారిపై రోడ్డు ప్రమాదాలు ఎక్కువ చోటుచేసుకోవడంతో క్షతగ్రాతులకు ప్రథమ చికిత్స చేసి హైదరాబాద్‌కు తరలిస్తున్నారు. ఈ క్రమంలో ప్రైవేటు దవాఖానకు వెళ్లి అప్పుల్లో కూరుకుపోతున్నారు. అంతేకాకుండా గాయపడిన వారి బంధువులు ఇతర ప్రాంతాల్లో ఉండటంతో వారు ఇక్కడ రావడం ఆలస్యం అవుతున్నది. దాంతో ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన వారికి తక్షణమై ఐసీయూ,శస్త్ర చికిత్సలు అందుబాటులో లేకపోవడంతో మృత్యువాత పడిన సంఘటనలు అనేకం ఉన్నాయి.

# నిరంతర విద్యుత్ ఘనత సిఎం కెసిఆర్‌దే

**మొదటిపేజీ తరువాయి..**

కరెంట్ ఎందుకు ఇవ్వడం లేదో అక్కడి ప్రజలు అధికార బిజెపిని నిలదీయాల న్నారు. అప్పుడే తెలంగాణ ప్రాంత ప్రాముఖ్యం తెలుస్తుంద న్నారు. సంక్షేమ కార్యక్రమాలను, రైతు కార్యక్రమాలను అమలు చేస్తున్నది కూడా తెలంగాణ ప్రభుత్వం మాత్రమే నన్నారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా సీఎం కేసీఆర్ సంక్షేమ అభివృద్ధి పథకాలు అమలు చేస్తున్నారని అన్నారు. రైతులకు ఎకరానికి రూ. 10 వేల పెట్టుబడి, సీఎం కేసీఆర్‌ది ప్రజలందరికీ పార దర్శకంగా నిలిచే రామరాజ్య పాలన అని అన్నారు. రైతులు ఏవిధంగా మరణించినా రూ. 5 లక్షల బీమా అందిస్తోంది కేసీఆరే నన్నారు. మిషన్ కాకతీయలో చెరువులను అభివృద్ధి పరచారన్నారు. చెరువులకు నీళ్లు కావాల్నా.. రైతుబీమా కావాలన్నా.. కెసిఆర్ కారణమని తెలిసిపోయిందన్నారు. ప్రపంచంలో ఎక్కడా లేని విధంగా ఓవైపు సంక్షమ పథకాలను అమలు చేస్తూనే అభివృద్ధిలోనూ అగ్రగామిగా రాష్ట్రాన్ని నిలుపుతున్నారన్నారు. ప్రజలు వచ్చే ఎన్నికల్లో మరోమారు కారుగుర్తుపై ఓటు వేసి కెసిఆర్‌ను మరోమారు సిఎం చేయాలన్నారు. ఇకపోతే అన్ని వర్గాల వారికి చేయూత నందిస్తున్న సీఎం కేసీఆర్ ముదిరాజ్ కులస్తుల ఆత్మగౌరవం పెంచారని అన్నారు. దేశంలోనే అభివృద్ధి పరంగా సీఎం కేసీఆర్ తెలంగాణ రాష్ట్రాన్ని నంబర్‌వన్ స్థానంలో నిలిపి ఉత్తమ సీఎంగా గుర్తింపు పొందారన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక వృద్ధులకు వెయ్యి, వికలాంగులకు రూ. 2000 పింఛన్లు అందిస్తున్న ఘనత సీఎం కేసీఆర్‌కు దక్కుతుందన్నారు. తెలంగాణలో మరింత అభివృద్ధి జరుగాలంటే బిఆర్ఎస్ పార్టీని గెలిపించుకోవాలని ఆయన కోరారు. రైతు సంక్షేమం కోసం సీఎం కేసీఆర్ ఎన్నో అభివృద్ధి, సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని మెదక్ ఎంపి కొత్త ప్రభాకర్ రెడ్డి అన్నారు. దేశంలో ఏ రాష్ట్రంలో లేని పథకాలు అమలు చేస్తుందన్నారు. బిఆర్ఎస్ ప్రభుత్వం గ్రామాల అభివృద్ధికి ఎంతో కృషి చేస్తుందన్నారు. గొల్ల కుర్మల అభివృద్ధికి సీఎం కేసీఆర్ గొర్రె లు పంపిణీ చేశారన్నారు. అన్ని వర్గల సంక్షేమం కోసం టీఆర్ఎస్ ప్రభుత్వం కృషి చేసిందన్నారు. ప్రతి నియోజకవర్గంలో లక్ష ఎకరాలకు సాగు నీరు సరఫరా చేసేందుకు సీఎం కేసీఆర్ సిద్దంగా ఉన్నారని వివరించారు. తాను కష్టపడి గత నాలుగేళ్లలో అనేక కార్యక్రమాలు చేశానని అన్నారు. ఎన్నికల్లో సీఎం కేసీఆర్ హామీ ఇవ్వకుండే గిరిజన తండాలను గ్రామ పంచాయతీలుగా ఏర్పాటు చేశారన్నారు.

సీఎం కేసీఆర్ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేసి బంగారు తెలంగాణ సాధన కోసం కృషి చేశారన్నారు. గోదావరి నీటిని కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా మల్లన్న సాగర్,కొండపోచమ్మ సాగర్‌లను అద్భుతంగా నిర్మించిందని అన్నారు.

# కృష్ణా పరివాహకంలో మంత్రి నిరంజన్ భూకబ్జా

**మొదటిపేజీ తరువాయి..**

ఆక్రమించి వ్యవసాయ శాఖ మంత్రి 3 ఫాంహౌజ్‌లు కట్టుకున్నారని ఆరోపించారు. కృష్ణానది పరివాహక ప్రాంతంలో ప్రభుత్వ భూమిని కబ్జాచేసి ఫాంహౌజ్ కట్టారని వెల్లడించారు. వనపర్తి జిల్లా చందూరు మండలంలో 160 ఎకరాల్లో వ్యవసాయశాఖ మంత్రి ఫాంహౌజ్ నిర్మించారని తెలిపారు. 80 ఎకరాలు రిజిస్ట్రేషన్ చేసుకుని 160 ఎకరాలకు కాంపౌండ్ వాల్ కట్టుకున్నారని ఆరోపించారు. కృష్ణానది లోపలి నుంచి 6 మీటర్ల ఎత్తులో గోడ కూడా కట్టారని తెలిపారు. వీటిపై సీఎం కేసీఆర్ వెంటనే చర్యలు తీసుకోవాలన్నారు. ఈటెల రాజేందర్‌కు ఓ న్యాయం..నిరంజన్ రెడ్డికి మరో న్యాయమా అని ప్రశ్నించారు.

ఒక సెంటు భూమి కూడా కబ్జా చేయలేదని వెంకటేశ్వరస్వామి గుడిలో వ్యవసాయశాఖ మంత్రి ప్రమాణం చేయాలని రఘునందన రావు డిమాండ్ చేశారు. ఈటలను బర్తరఫ్ చేసినట్లు.. వ్యవసాయశాఖ మంత్రిని సస్పెండ్ చేయాలన్నారు. కేసీఆర్ (క్యాబినెట్‌లో బీసీ, దళిత నేతలకు ఒక న్యాయం.. అగ్రవర్ణాలకు మరొక న్యాయమా?అని ఆయన ప్రశ్నించారు. ఎస్టీ నిధులతో వ్యవసాయశాఖ మంత్రి ఫాంహౌస్‌కు రోడ్డు నిర్మించారని ఆరోపించారు. తాండాల్లో రోడ్ల అభివృద్ధికి ఖర్చు చేయాల్సిన ఎస్టీ నిధులను మంత్రి ఫాంహౌస్ కోసం వినియోగించటం దుర్మార్గమని మండిపడ్డారు. దుబ్బాకలో తండాలకు రోడ్లు కావాలని మంత్రి సత్యవతి రాథోడ్ కు విజ్ఞప్తి చేసినా నిధులు మంజూరు చేయలేదని.. కానీ వ్యవసాయ శాఖ మంత్రి ఫాంహౌజ్ రోడ్డుకు ఎస్టీ సబ్ ప్లాన్ నిధులు మంజూరు చేశారని ఆరోపించారు. ఎకరం కొని పక్కన మరొక ఎకరాన్ని వ్యవసాయశాఖ మంత్రి కబ్జా చేశారని ఆరోపించారు. తల్లిదండ్రుల నుంచి తనకు 16ఎకరాలు సక్రమించినట్లు వ్యవసాయ శాఖ మంత్రి తన ఎన్నికల అఫడవిట్‌లో పేర్కొన్నారని గుర్తుచేశారు. ఇనాం భూములు, ప్రభుత్వ భూముల్లో వ్యవసాయశాఖ మంత్రి రెండు ఫాంహౌస్‌లు కట్టారని అన్నారు. తనయుడైనా.. తనయ అయినా శిక్ష తప్పదని సీఎం కేసీఆర్ చెప్పిన మాటలు ఎటు పోయాయని రఘునందన్ ప్రశ్నించారు. మంత్రి ఫాంహౌజ్ కట్టుకున్న మండలంలో21అక్టోబర్ 2021న తహసీల్దార్ కార్యాలయం తగలబడిందని రఘునందన్ రావు వెల్లడించారు.తహసీల్దార్ ఆఫీస్ తగలబడ్తే పోలీసులు ఇంత వరక చార్జ్ షీట్ వేయలేదన్నారు. కార్యాలయం తగలబడితే పాత రికార్డులేవీ ఉండవు కాబట్టి మంత్రి యథేచ్ఛగా ప్రభుత్వ భూములను ఆక్రమించారని వెల్లడించారు. ఆర్డీఎస్ ప్రాజెక్ట్ కోసం తీసుకున్న భూమిలో మంత్రి ఫాంహౌజ్ కట్టారని ఆరోపించారు. అసైన్డ్ భూముల్లో నిర్మాణాలు కట్టిండని ఈటలను మంత్రి పదవి నుంచి తీసేసిన్రు..అంతకు ముందు ఓ ఎస్సీ మంత్రిని కేబినెట్ నుంచి తొలగించారు.. ఎస్సీ, బీసీలకు ఒక న్యాయం, అగ్రనాయకులకు ఒక న్యాయమా? కేసీఆర్ అంటూ రఘునందన్ రావు ప్రశ్నించారు. దమ్ముంటే తాను చేసిన ఆరోపణలను తప్పని రుజువు చేయాలని సవాల్ విసిరారు. ప్రాజెక్టులకు కేటాయించిన భూములను కబ్జా చేస్తున్న నేతలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఒక సెంటు భూమి కూడా కబ్జా చేయలేదని వెంకటేశ్వర స్వామి గుడిలో వ్యవసాయశాఖ మంత్రి ప్రమాణం చేయాలని సవాల్ విసిరారు.

# తొమ్మిదేళ్ల కెసిఆర్ పాలనలో ఎన్నో అద్భుతాలు

**మొదటిపేజీ తరువాయి..**


ఉన్నాయని మంత్రి ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో రైతుల సంపద పెంచిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. సీఎం కేసీఆర్ తీసుకొచ్చిన రైతు సంక్షేమ పథాకాలవల్లే తెలంగాణలో భూముల విలువ పెరిగిందన్నారు. రాష్ట్రంలో బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చిన తర్వాత ఎరువలు కొట్లాట ఎక్కడైనా ఉందా అన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే రైతులు ఎరువుల కోసం మళ్లీ లైన్‌లలో నిలబడాల్సిన పరిస్థితి వస్తుందని మంత్రి పేర్కొన్నారు.నలభై ఏండ్లు పాలించిన కాంగ్రెస్ పార్టీ ప్రజల కోసం రైతుబంధు, కల్యాణలక్ష్మి లాంటి పథకాలను ఎందుకు తీసుకురాలేదన్నారు. ఆనాడు ఏమిచేయలేక పోయిన నేతలు మళ్లీ మేమొస్తామంటున్నారని అన్నారు. మునుగోడులో కూసుకుంట్లను గెలిపించినట్లుగానే మరో మారు రాష్ట్రంలో బిఆర్ఎస్ గెలిపించే బాధ్యత మీదేనని అన్నారు. మునుగోడు ఉపఎన్నికల్లో తమ పార్టీఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తామని మంత్రి హరీష్ రావు అన్నారు. టీఆర్ఎస్ కు మొదటి విజయం సిద్దిపేట అయితే.. బీఆర్ఎస్‌కు తొలి విజయం మునుగోడు గడ్డకే దక్కిందని తెలిపారు. తెలంగాణలో మళ్లీ బీఆర్ఎస్ అధికారంలోకి వస్తుందని, హ్యాట్రిక్ కొట్టడం ఖాయమని స్పష్టం చేశారు.

కేసీఆర్ పాలనలో రైతుకు విలువ పెరిగిదని అన్న హరీష్... దాంతోనే భూముల విలువ పెరిగిందని తెలిపారు. ఇక్కడ నీళ్లు ఇవ్వడంతో పాటు రైతుబంధు, రైతుబీమా ద్వారా రైతులకు భరోసా కల్పించామని అన్నారు. ప్రపంచమే అబ్బుర పడేలా యాదాద్రి ఆలయ నిర్మాణం జరిగిందన్నారు. తెలంగాణలో ఇస్తున్నట్లు డబుల్ఇంజన్ సర్కార్ ఉన్న రాష్ట్రాల్లో తాగునీరు, పెన్షన్లు ఎందుకు ఇవ్వడం లేదని హరీష్ ప్రశ్నించారు. పదో తరగతి పేపర్ లీకేజీని పట్టుకుని బీజేపీ రాజకీయం చేస్తోందని హరీష్ విమర్శించారు. పథకాలు, సంక్షేమం బీఆర్ఎస్ పార్టీవి అయితే, కుట్రలు, కుతంత్రాలు బీజేపీ పార్టీ అని తెలిపారు. మంత్రి జగదీశ్‌రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ గడ్డమీద బీజేపీ కుట్రలు సాగవని వ్యాఖ్యానించారు. ఈ సందర్భంగా జగదీశ్‌రెడ్డి బీజేపీ, కాంగ్రెస్ పార్టీలపై విమర్శలు గుప్పించారు. తెలంగాణ సంక్షేమం, అభివృద్ధి యావత్ భారతానికి పాకిందని, దేశంలోని ఇతర రాష్ట్రాల ప్రజలు కూడా తెలంగాణ వైపు చూస్తున్నారని చెప్పారు. గుజరాత్ సహా బీజేపీ పాలిత రాష్ట్రాల్లో ఇక్కడి పథకాలకు డిమాండ్ పెరిగిందని మంత్రి పేర్కొన్నారు. ఆయా రాష్ట్రాల ప్రజలు తిరుగుబాటుకు సన్నద్ధమౌతున్నారని, హస్తిన పీఠం కదులుతుందన్న భయం బీజేపీకి పట్టుకుందని మంత్రి ఎద్దేవా చేశారు. ముఖ్యమంత్రి కేసీఆర్ అంటేనే ఢిల్లీ బాస్‌లకు వణుకు అని వ్యాఖ్యానించారు. మోదీ సొంత రాష్ట్రంలో దారిద్య్రం పెరిగిందన్నారు. ఆ రాష్ట్రంలో 35 శాతానికి పైగా జనం అర్థాకలితో అలమటిస్తున్నారన్నారు. గుజరాత్ ప్రజలది తాగునీరు కొనుక్కునే దుస్థితిలో ఉన్నారని మండిపడ్డారు. గుజరాత్‌లో ప్రజలకు విద్యుత్ సరఫరా కూడా ఆరు గంటలేనని ఎద్దేవా చేశారు.

గుజరాత్‌లో ఆసరా పింఛన్ అందేది రూ. 600 మాత్రమేనని మంత్రి తెలిపారు. అక్కడ మోటార్లకు మీటర్లు పెట్టి ముక్కుపిండి బిల్లుల వసూలు చేస్తున్నారని చెప్పారు. ఉచిత విద్యుత్ మాకెందుకు ఇవ్వడం లేదనే చర్చ దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల్లో మొదలైందని, ఇంటింటికి మంచినీరు మాకెందుకు ఇవ్వడం లేదని ప్రజలు డిమాండ్ చేస్తున్నారని మంత్రి తెలిపారు. కళ్యాణలక్ష్మి/షాది ముబారక్, కేసీఆర్ కిట్, అమ్మవడి పథకాలు మాకెందుకు లేవని జనం ప్రశ్నిస్తున్నారని, దాంతో బీజేపీ నేతల్లో కలవరం మొదలైందని, ఒదుకే ఇక్కడ అభివృద్ధిని అడ్డు కునేందుకు మోకాలొడ్డుతున్నారని, సంక్షేమ పథకాలకు అవరోధాలు సృష్టిస్తున్నారని, వాటన్నింటినీ అధిగమించే సత్తా ముఖ్యమంత్రి కేసీఆర్‌కు ఉందని మంత్రి చెప్పారు.

బీఆర్ఎస్ పార్టీని మరింత బలోపేతం చేసే దిశగా కార్యకర్తలు ముందుకు సాగాలాని ఆయన పిలుపు నిచ్చారు. స్వరాష్ట్రం సాధించుకున్న తర్వాతనే రాష్ట్రంలో ప్రతి ఒక్కరికీ లాభం చేకూరిందన్నారు. గులాబీ జెండా నీడలోనే అభివృద్ధి, సంక్షేమం సాగుతున్నాయని చెప్పారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో లబ్ది పొందిన మొదటి జిల్లా ఉమ్మడి నల్లగొండ జిల్లా అని, అందుకే నల్లగొండ జిల్లా ఎప్పటికీ ముఖ్యమంత్రి కేసీఆర్‌కు అండగా ఉంటుందని మంత్రి పేర్కొన్నారు. ఉమ్మడి జిల్లాలోని 12 కు 12 అసెంబ్లీ స్థానాల్లో గులాబీ జెండాలు ఎగరడం పెద్ద రికార్డు అన్నారు. నెహ్రూ హయాంలో కాంగ్రెస్ పార్టీకి కూడా ఇంతటి గౌరవం దక్కలేదన్నారు. చంద్రబాబు హయాంలోనూ పచ్చ పార్టీకి సింగిల్ డిజిటే వచ్చిందని చెప్పారు.గులాబీ పార్టీ అధికారంలోకి వచ్చాకే జిల్లా సస్యశ్యామలం అయ్యిందని, 47 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తున్నదని మంత్రి తెలిపారు.

ఉచిత విద్యుత్‌తో ఉమ్మడి నల్లగొండ జిల్లా రైతన్న కండ్లలో బీఆర్ఎస్ వెలుగులు నింపిందని మంత్రి పేర్కొన్నారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో మరో పార్టీకి తావు లేదని,ఆత్మీయ సమ్మేళనాలు గులాబీ శ్రేణుల బాంధవ్యాలను పెంపొందిస్తున్నాయని చెప్పారు. కాంగ్రెస్ హయాంలో ఎండా కాలం వస్తే రాష్ట్రంలో కరెంటు కోతలే ఉండేవని మంత్రి జగదీశ్‌రెడ్డి ఎద్దేవా చేశారు. ప్రజలను ఓటు అడిగే హక్కు బీఆర్ఎస్ నేతలకే ఉన్నదని చెప్పారు. నాడు సాగర్ జలాలను ఆంధ్రాకు తరలిస్తుంటే కాంగ్రెస్ నేతలు ప్రశ్నించారా..? అంటూ మంత్రి నిలదీశారు. తెలంగాణ ప్రయోజనాలను పక్కనపెట్టి ఇక్కడి కాంగ్రెస్ నేతలు పదవుల కోసం వెంపర్లాడారని విమర్శించారు.



# ముంబైలో తొలి యాపిల్ స్టోర్

**మొదటిపేజీ తరువాయి..**

మాకింతోష్ కంప్యూటర్‌ను తీసుకువచ్చాడు. అది చూసిన యాపిల్ బాస్ ఆ కస్టమర్‌ను అప్యాయంగా హత్తుకున్నారు. అభిమాని తెచ్చిన ఆ కంప్యూటర్‌ను చూస్తూ 'వావ్' అంటూ సంభ్రమాశ్చర్యాలకు గురయ్యారు. నేను తొలిసారి 1984 యాపిల్ కంప్యూటర్ కొనుగోలు చేశాను. అప్పటి నుంచి యాపిల్ ఉత్పత్తులనే వాడుతున్నాను. ఇదిగో దీని డిస్కోస్టోరేజ్ కెపాసిటీ 2 మెగాబైట్స్. బ్లాక్ అండ్ వైట్ కలర్ వేరియంట్స్‌లో ఉంది. ఇప్పుడు ఇదే కంప్యూటర్‌ను యాపిల్ 4కే, 8కే రిజల్యూషన్ డిస్‌ప్లేలను తయారు చేస్తోంది' అని ఆ అభిమాని చెప్పుకొచ్చారు. ఇక యాపిల్ ఫ్యాన్ తన వెంట తీసుకొచ్చిన యాపిల్ పాత కంప్యూటర్‌ను టిమ్ కుక్‌కు చూపించడం.. ఆ కంప్యూటర్‌ను చూసి ఆయన ఆశ్చర్యం వ్యక్తం చేసిన వీడియో, ఫొటోలు ప్రస్తుతం నెట్టింట వైరల్ అవుతున్నాయి. దీంతో సినిమా, క్రికెట్ స్టార్లకే కాదు ఎలక్ట్రానిక్స్ వస్తువులకు ఫ్యాన్స్ ఉంటారని నెటిజన్లు కామెంట్స్ చేస్తున్నారు.

# పేపర్ లీక్ జరిగి నెలయినా చర్యలేవీ..?

### దున్నపోతుమీద వాన పడ్డట్లుగా ఉంది

### కెసిఆర్ తీరుపై మండిపడ్డ వైఎస్ షర్మిల

హైదరాబాద్,ఏప్రిల్18,(ప్రజా మంటలు) : గతంలో నిరుద్యోగులు ఆత్మ హత్యలకు పాల్పడినా.. ఇప్పుడు పేపర్ లీకేజీలతో నిరుద్యోగుల కష్టార్జితం నీటిపాలైనా.. దొర గారికి దున్నపోతు మీద వానపడ్డట్టే ఉందని సీఎం కెసిఆర్‌ను ఉద్దేశించిన వైఎస్ షర్మిల మండిపడ్డారు.అంగట్లో సరుకులు అమ్ముతున్నట్లు క్వశ్చన్ పేపర్లు అమ్మకానికి పెట్టినా ఈ సర్కారుకు సిగ్గురాదని విమర్శించారు. పబ్లిక్ సర్వీస్ కమిషన్ స్కాం జరిగి, నెలన్నర దాటుతున్నా.. ఇప్పటివరకు ఒక్క రివ్యూ లేదు, మీటింగు లేదని మండి పడ్డారు. నిరుద్యోగుల పక్షాన గళమెత్తితే పిరికిపందలా, అధికారమదంతో పోలీసులను పంపించడం, హౌజ్ అరెస్ట్ చేయించడం.. ఇది మాత్రం చేతనైందని విమర్శించారు. స్కాంపై ఎలాంటి చర్యలు లేకుండానే పరీక్షలు నిర్వహించి, మళ్లీ క్వశ్చన్ పేపర్లు అమ్మి, నిరుద్యోగులకు ఉద్యోగాలు రాకుండా చేయాలన్నదే కేసీఆర్ లక్ష్యంగా ఉన్నట్లుందన్నారు. వెంటనే బోర్డును ప్రక్షాళన చేయాలని తమ పార్టీ డిమాండ్ చేస్తుందన్నారు. నిరుద్యోగుల మీద కేసీఆర్‌కు చిత్తశుద్ధి ఉంటే ఈ ఘటనపై సిబిఐ విచారణ జరిపించి, ఎంతటి దోషులనైనా కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

# త్వరలో సరికొత్త ఏసీ బస్సులు

### టీఎస్ఆర్టీసీ సంస్థ ఎండీ వీసీ సజ్జనార్

హైదరాబాద్,ఏప్రిల్18, (ప్రజా మంటలు): టీఎస్ఆర్టీసీ త్వరలో సరికొత్త ఏసీ బస్సులను ప్రవేశపెట్టనుంది. ఎలక్ట్రిక్ ఏసీ బస్సులు అందుబాటులోకి రానున్నాయి. ఒలెక్ట్రా గ్రీన్‌టెక్ లిమిటెడ్ రూపొందిస్తున్న ఈ బస్సుల్లో అత్యాధునిక వసతులు, భద్రతా చర్యలు ఉంటాయి.దూర ప్రయాణాలు చేసే వారికోసం టీఎస్ఆర్టీసీ సరికొత్త ఎలక్ట్రిక్ ఏసీ బస్సులను మే నెలలో ప్రారంభించేందుకు రంగం సిద్ధచేసింది. పర్యావరణహితమైన చర్యల్లో భాగంగా ఇదొక కీలకమైన అడుగని సంస్థ ఎండీ వీసీ సజ్జనార్ తెలిపారు. కాలుష్య నియంత్రణతో పాటు ప్రయాణీకులకు మెరుగైన, సౌకర్యవంతమైన ప్రయాణ అనుభూతిని కలిగించేందుకు ఈ బస్సులు దోహదపడతాయని ఆయన అన్నారు. పర్యావరణహితమైన చర్యల్లో భాగంగా టీఎస్ఆర్టీసీ 550 ఎలక్ట్రిక్ బస్సులకు ఒలెక్ట్రా గ్రీన్‌టెక్ లిమిటెడ్ కు ఆర్డర్ ఇచ్చింది. వీటిలో 500 బస్సులను హైదరాబాద్ నగరంలో, 50 బస్సులను విజయవాడ మార్గంలో తిప్పనున్నారు. వీటితో పాటు అశోక్ లేలాండ్, జీబీఎం సంస్థల నుంచి మరో 1000 ఎలక్ట్రిక్ బస్సులు అందుబాటులోకి రానున్నాయని సజ్జనార్ తెలిపారు. గ్రాస్ కాస్ట్ కాంట్రాక్ట్ పద్ధతిలో విడతల వారీగా ఈ బస్సులను ఆయా సంస్థలు టీఎస్ఆర్టీసీకి అందజేయనున్నాయి. 2 మీటర్ల పొడవు గల ఎలక్ట్రిక్ ఏసీ బస్సుల్లో 41 సీట్ల సామర్థ్యం ఉంటుంది. ఈ బస్సులకు ఒక్కసారి ఛార్జింగ్ చేస్తే 325 కిలోమీటర్ల కంటే ఎక్కువ దూరం ప్రయాణించవచ్చు.

బస్సులో ప్రతి సీటు వద్ద మొబైల్ చార్జింగ్ సౌకర్యంతో పాటు రీడింగ్ ల్యాంప్‌లను ఏర్పాటు చేశారు. వెహికల్ ట్రాకింగ్ సిస్టంతో పాటు ప్రతి సీటు వద్ద పానిక్ బటన్ సదుపాయం కల్పించారు. వీటిని టీఎస్ఆర్టీసీ కంట్రోల్ రూమ్‌కు అనుసంధానం చేస్తారు. ప్రతి బస్సులో మూడు సీసీటీవీ కెమెరాలను ఏర్పాటు చేసి ఒక నెల రికార్డింగ్ బ్యాకప్ ఉంచుతారు.బస్సుకు ముందు వెనుకా ఎల్ఈడీ బోర్డులుంటాయి. వాటిలో గమ్యస్థానాల వివరాలు కనిపిస్తాయి.

## రోడ్డుకు అడ్డంగా పడి ఉన్న చెట్టును తొలగించిన పోలీసు సిబ్బంది

**భీమదేవరపల్లి ఏప్రిల్ 18 (ప్రజామంటలు):** మండలంలోని ములుకనూర్-కొత్తకొండ రహదారిలో ముత్తారం గ్రామ సమీపంలో ఇటీవల వీచిన గాలులకు పెద్ద చెట్టు




పడిపోయింది. ఆ రహదారిలో వాహనాల రాకపోకలకు ఆటంకంగా పడి ఉన్న చెట్టును స్థానిక పోలీస్ సిబ్బంది మల్లెల నాగేశ్వరరావు వారి సిబ్బంది శ్రీనివాస్, గ్రామ ఉపసర్పంచ్ యుగంధర్ రెడ్డి సహకారంతో జెసిబి తీసుకువచ్చి చెట్టును తొలగించారు. రాకపోకలకు అంతరాయం లేకుండా చెట్లను తొలగించడంతో మండల ప్రజలు అభినందించారు.

## మల్లంపల్లి గ్రామానికి సబ్ స్టేషన్ మంజూరు

### కృతజ్ఞతలు తెలిపిన ఎంపిటిసి వి. శ్రీనివాస్

**అక్కన్నపేట్ ఏప్రిల్ 18 (ప్రజామంటలు ):** అక్కన్నపేట్ మండలం మల్లంపల్లి గ్రామంలో రెండు కోట్ల యాభై లక్షల రూపాయలతో 33/11 కేవి సబ్ స్టేషన్ ఏర్పాటుకు సహకరించిందన హనుమకొండలో హుస్నాబాద్ ఎమ్మెల్యే వొడితల సతీష్




కుమార్ ను వారి నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి ధన్యవాదములు తెలిపిన మల్లంపల్లి ఎంపిటిసి వేముల శ్రీనివాస్, సింగల్ విండో డైరెక్టర్ మేక నారాయణ నాబార్డ్ అధ్యక్షులు బత్తిని బిక్షపతి కో ఆప్షన్ మెంబర్ కోల లింగన్న బిఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షులు ఐలపాక శ్రీను ఆనంద సురేష్ఈ సందర్భంగా ఎంపిటిసి వేముల శ్రీనివాస్ మాట్లాడుతూ.... మల్లంపల్లి మరియు మల్లంపల్లి రెవెన్యూ గ్రామాలైన మోత్కులపల్లి పెద్దతండ టేకుల తండా గ్రామాలకు ప్రజా అవసరాల మరియు రైతాంగానికి కరెంటు ఇబ్బందులు లేకుండా భవిష్యత్ కాలానికి అనుగుణంగా ఉపయోగపడుతుందని తెలిపారు.

## అనంతోజు రామాచారి వర్ధంతి

### ఆసుపత్రిలో పండ్లు పంపిణి

**జనగామ ఏప్రిల్ 18 (ప్రజామంటలు):** జనగామ జిల్లా పాలకుర్తిలో అనంతోజు రామాచారి వర్ధంతి సందర్భంగా కుమారుడు అనంతోజు యోగానంద చారి, కుటుంబ సభ్యులు కలిసి ఫేత్ క్రైస్ట్ టెంపుల్ ఐసీసీ వై డబ్ల్యూ మినిస్ట్రీస్ మినిస్ట్రీస్



డైరెక్టర్ , ఐప్వా రాష్ట్ర కమిటీ సభ్యురాలు రక్షిత అనంతోజు ఆధ్వర్యంలో ప్రభుత్వ ఆసుపత్రిలో పండ్లు పంపిణి చేశారు. డాక్టర్స్ తో కలిసి పండ్లు పంపిణి చేసిన కార్యక్రమంలో డాక్టర్ ఉమా, డాక్టర్స్ బృందము, హాస్పిటల్స్ సిబ్బంది పాల్గొన్నారు. ప్రసవించిన బాలింతలకు, రోగులందరికి పండ్లు పంపిణీ చేశారు.

## రంజాన్ గిఫ్ట్... మైనార్టీలకు సర్కారు కానుక

### బీఆర్ఎస్ విద్యార్థి విభాగం అధ్యక్షుడు యం.ఏ. ఆరీఫ్

**జగిత్యాల ఏప్రిల్ 18 (ప్రజామంటలు):** పవిత్ర రంజాన్ మాసాన్ని పురస్కరించుకొని ముఖ్యమంత్రి కేసీఆర్ సర్కార్ ఏటా మైనార్టీలకు అందించే కానుకే 'రంజాన్ గిఫ్ట్' అని బిఆరెస్ విద్యార్థి విభాగం పట్టణ అధ్యక్షుడు యం.ఏ. ఆరీఫ్, కౌన్సిలర్ పద్మ



సింగరావు, పేర్కొన్నారు. రంజాన్ సందర్భంగా మంగళవారం ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ ఆదేశాల మేరకు జగిత్యాల పట్టణంలోని జామ్ జామ్ మజీద్, జామాబాగ్ మజీద్ లో ముస్లింలకు రంజాన్ గిఫ్ట్ పంపిణీ చేసిన అనంతరం పట్టణ విద్యార్థి విభాగం అధ్యక్షుడు ఆరీఫ్ మాట్లాడుతూ.... ఏటా రంజాన్ గిఫ్ట్ అందించడం ఆనందంగా ఉందని, కేసీఆర్ సర్కార్ అన్ని మతాల సంక్షేమానికి పెద్దపీట వేస్తోందని అన్నారు. రంజాన్ పండుగను ప్రతి కుటుంబమూ ఘనంగా జరుపుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బిఆరెస్ సీనియర్ నాయకులు అమీన్ భాయ్, ఆర్ఐ కాశీం, రిజ్వాన్, బాబా, తదితరులు పాల్గొన్నారు.

## అన్నివర్గాలకు అండగా బీఆర్ఎస్ ప్రభుత్వం

● **మున్సిపల్ చైర్మన్ గోలి శ్రీనివాస్.**

**జగిత్యాల ఏప్రిల్ 18 (ప్రజామంటలు):** రాష్ట్ర ప్రభుత్వం అన్ని వర్గాలను సమదృష్టితో చూస్తూ వారికి అండగా నిలుస్తోందని జగిత్యాల బల్దియా చైర్మన్ గోలి శ్రీనివాస్ అన్నారు. ముస్లిం సోదరులు ఎంతో పవిత్రంగా జరుపుకొనే రంజాన్ కు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మైనారిటీ ప్రజలకు ఏర్పాటు చేసిన రంజాన్ తోఫా దుస్తులు మక్బర, చౌక్ మజీద్ లలో అందజేసిన బల్దియా చైర్మన్ గోలి శ్రీనివాస్. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ....జగిత్యాల పట్టణంలోని అన్ని మజీద్ లకు రంజాన్ మాసం ప్రారంభమైన సందర్భంగా రెండు చెత్త బుట్టలు, బ్లీచింగ్ పౌడర్ను ఇప్పటికే పంపిణీ చేయడమైనదని తెలిపారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత అన్ని పండుగలను ప్రజలు సంతోషంగా జరుపుకోవాలనే ముఖ్యమంత్రి కె. చంద్రశేఖర్ రావు మరియు జగిత్యాల ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్ ల ఆదేశాల మేరకు పురపాలక సంఘం పరంగా అన్ని రకాల ఏర్పాట్లు చేస్తుందని చెప్పారు. ప్రతి సంవత్సరం రంజాన్ కు ముస్లిం సోదరులు ఎలాంటి అసౌకర్యానికి గురికాకుండా అన్ని ఏర్పాట్లు చేస్తున్న విషయాన్ని గుర్తుచేశారు. ఈ సంవత్సరం కూడా రంజాన్ పండుగ ఏర్పాట్లకు 12.50 లక్షలతో అన్ని ఏర్పాట్లను చేయడం జరుగుతుందని పేర్కొన్నారు. ఎటువంటి ఆటంకాలు లేకుండా నీటి సరఫరా జరిగే విధంగా చర్యలు తీసుకోవాలని వాటర్ వర్క్స్ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు బొడ్ల జగదీష్,





కూతురు రాజేష్, ఆర్.ఐ. కజీం, సదర్లు, మైనారిటీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

### కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ

## సద్వినియోగం చేసుకునేలా వైద్య సిబ్బంది చర్యలు తీసుకోవాలి

● **కలెక్టర్ సిహెచ్. శివలింగయ్య**

**జనగామ ఏప్రిల్ 18 (ప్రజామంటలు):** జనగామ మండలం పసరమడ్ల, నర్మెట మండలం హన్మతపురం గ్రామాల్లో జరుగుతున్న కంటి వెలుగుల క్యాంపులను జిల్లా కలెక్టర్ సిహెచ్ .శివలింగయ్య తనిఖీ చేశారు, ఈ సందర్భంగా మాట్లాడుతూ.... తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా ఏర్పాటుచేసిన కంటి వెలుగు కార్యక్రమం జిల్లాలో ప్రతి ఒక్కరూ సద్వినియోగపరుచుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు, అందుకు ప్రతి ఇంటికి వెళ్లి వైద్య పరీక్షలకు రాని వారి వివరాలను సేకరించి వైద్య పరీక్షలు నిర్వహించుకోనెల, ఏఎన్ఎం, ఆశ, మల్టీ పర్పస్ హెల్త్ వర్కర్స్, పూర్తిస్థాయి ప్రచారం నిర్వహించాలని కంటి వెలుగు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన సూచించారు. అనంతరం మండల పరిషత్ ఉన్నత పాఠశాలను తనిఖీ చేశారు పిల్లల భోజన వసతి, సిబ్బంది హాజరు వివరాలు సంబంధిత ప్రధానోపాధ్యాయుని అడిగి తెలుసుకున్నారు విధుల పట్ల నిర్లక్ష్యంగా ఉన్న సిబ్బందిని మందలించారు. హన్మతపురం గ్రామంలో బృహత్ పల్లె ప్రకృతి వనాన్ని సందర్శించి డిమాండ్కు అనుగుణంగా మొక్కలను పెంచాలని పూల, పండ్ల మొక్కలను సంరక్షించాలని అన్నారు. బృహత్ పల్లె ప్రకృతి వనం స్థలాన్ని పెంచాలని సూచించారు. ఈ



కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా. రవీందర్ గౌడ్, డా. ఆశా జ్యోతి, డా. శ్రావణి, మెడికల్ ఆఫీసర్ ఝాన్సీ, ఉన్నారు.

## అనుమతులకు లోబడని నిర్మాణాల కూల్చివేత

**జనగామ ఏప్రిల్ 18 (ప్రజామంటలు):** ప్రభుత్వ నిబంధనల ప్రకారం భవన నిర్మాణాల అనుమతులు తీసుకొని అనుమతులకు లోబడని నిర్మాణాలు కట్టడాలను మంగళవారం కూల్చివేశారు. జనగామ పట్టణంలో ని సూర్యాపేట రోడ్డు గార్లకుంట, సిద్దిపేట రోడ్డు కోర్టు వెనకాల, కూల్చివేతలు చేపట్టారు. ప్రభుత్వ ఆసుపత్రి ముందు నిర్మాణంలో ఉన్న భవనాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా టాస్క్ ఫోర్స్ కన్వీనర్ సిహెచ్. మధుమోహన్ మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనల ప్రకారం భవన నిర్మాణాలు అనుమతులు తీసుకొని అనుమతులకు లోబడకుండా ఇష్టాను సారంగా నిర్మాణాలు చేపడితే చట్ట పరంగా చర్యలు తీసుకొని కూల్చి వేతలు చేస్తామన్నారు. ప్రభుత్వం నుండి అనుమతి పొందిన పత్రాలను విధిగా ప్రదర్శిం చాలన్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలని ఇప్పటికే పత్రికలు సామాజిక మాధ్యమాల ద్వారా ప్రజల్లో అవగాహన కల్పించామని ఆయన చెప్పారు. కూల్చివేతల్లో జిల్లా టాస్ ఫోర్స్ కన్వీనర్, సిహెచ్. మధుమోహన్,



జిల్లా కమిటీ సభ్యులు, ఏసిపి దేవేందర్ రెడ్డి,టౌన్ ప్లానింగ్ అధికారి వీరస్వామి, అగ్నిమాపక అధికారి మధుకర్, ఆర్ అండ్ బి డిఈ అశోక్ కుమార్, సంబంధిత శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

### కరెన్సీ నోట్లపై అంబేద్కర్ ఫోటో ముద్రణకు

## కేసీఆర్ అసెంబ్లీలో తీర్మానం చేయాలి

**జనగామ ఏప్రిల్ 18 (ప్రజామంటలు):** రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా స్ఫూర్తి ప్రదాత భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ ఫోటోను కరెన్సీ నోట్లపై ముద్రించాలని అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి లేఖ రాయాలని తమ ఎంపీలు పార్లమెంట్లో మాట్లాడాలని తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి కే చంద్రశేఖర రావు ని కరెన్సీ పై అంబేద్కర్ ఫోటో సాధన సమితి జాతీయ అధ్యక్షులు డాక్టర్ జేరిపోతుల పరశురామ్ కోరారు. జనగామ చౌరస్తా అంబేద్కర్ విగ్రహం వద్ద 138వ జ్ఞానమాల, జ్ఞాన దర్శనం చేసుకొని అంబేద్కర్ కి పూలమాల వేసి ఈ సందర్భంగా డాక్టర్ జేరిపోతుల పరశురామ్ మాట్లాడుతూ తెలంగాణ ముఖ్యమంత్రి కె. చంద్రశేఖర రావు 132వ జయంతి సందర్భంగా 125 అడుగుల అంబేద్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించడం ఈ సమాజం హర్షించదగ్గ విషయమని అన్నారు. ప్రకాష్ అంబేద్కర్ ని పిలిచి ఆ నిండు సభలో మాట్లాడిన మాటలకు కట్టుబడి ఉండాలని అన్నారు. ప్రకాష్ అంబేద్కర్ మాట మీద ఏమాత్రం గౌరవం ఉన్నా, కరెన్సీ నోట్లపై అంబేద్కర్ ఫోటో ముద్రించాలని అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్ర ప్రభుత్వానికి లేఖ వ్రాయాలని, పార్లమెంటు సభ్యులు పార్లమెంట్లో మాట్లాడాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కరెన్సీ పై అంబేద్కర్ ఫోటో



సాధన సమితి జిల్లా అధ్యక్షులు పులి శేఖర్, వేముల నర్సింగ్, తిప్పారపు ప్రసాద్, చింతల కనకరాజు, మిద్దపాక రాజు, తాళ్ల పెళ్లి ఎల్లేష్, తోకల శీను, పులి నందు రామకృష్ణ పాల్గొన్నారు.

## కరెంట్ షాక్ తగిలి వ్యక్తి మృతి

**మల్లాపూర్ ఏప్రిల్ 18 (ప్రజామంటలు):** సాతారం గ్రామానికి చెందిన బొడ్డు పెద్ద గంగారెడ్డి పెరిక 60 సంవత్సరాలు వయసు అనునదదు తన సొంత వ్యవసాయ భూముల్లో మోటారు వేయడానికి స్టార్టర్ బాక్స్ వద్దకు వెళ్ళగా ప్రమాదవశాత్తు కరెంట్ షాక్ తగిలి అక్కడికక్కడే చనిపోయినాడని బంధువులు తెలిపారు.



### వండర్ బుక్ ఆఫ్ రికార్డులో చోటు సాధించుకున్న

## పూటూరి అశోక్ బాబు దంపతులు

**జగిత్యాల ఏప్రిల్ 18 (ప్రజామంటలు):** పొలాస సహస్ర లింగాల దేవాలయంలో మాస శివరాత్రి పర్వదినం పురస్కరించుకొని జిల్లా కేంద్రానికి చెందిన పూటూరి అశోక్ బాబు, రమాదేవి దంపతులు





సహస్ర లింగాలకు ఏకకాలంలో అన్నపూజ ప్రత్యేక కార్యక్రమం చేపట్టారు. వేలాది మంది భక్తులు వివిధ ప్రాంతాల నుండి సహస్రలింగాల దేవాలయం చేరుకుని, సహస్ర లింగాల దాతలు, ఏక సమయంలో అన్నపూజా కార్యక్రమం చేశారు. ఈ విషయం గుర్తించిన వండర్ బుక్ ఆఫ్ రికార్డ్ కోఆర్డినేటర్ ఏ. గంగాధర్ వండర్ బుక్ ఆఫ్ రికార్డు అవార్డును అశోక్ బాబు రమాదేవి దంపతులకు అందజేశారు. 3000 మందికి అన్నదానం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో సహస్ర లింగాల దేవాలయం ఫౌండర్ నలుమాస్ గంగాధర్, ఆలయ ట్రస్టు సభ్యులు, సామాజిక కార్యకర్త తవుటు రామచంద్రం, తదితరులు పాల్గొన్నారు.

### డెలివరీ సమయంలో

## వికటించిన వైద్యం

### ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఘటన

### కలెక్టర్ యాస్మిన్ భాష సీరియస్...

**జగిత్యాల ఏప్రిల్ 18 (ప్రజా మంటలు):** గత వారం రోజుల క్రితం వేములవాడ పట్టణంలో స్కానింగ్ చేయించుకోగా బట్టను గుర్తించిన ప్రైవేటు వైద్యులు. గత 16 నెలల క్రితం జగిత్యాల పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో కొడిమ్యాల మం. నమిలికొండ గ్రామానికి చెందిన నవ్య శ్రీ అనే మహిళ డెలివరీ అయింది డెలివరీ సమయంలో సర్జరీ చేసిన వైద్యులు ఆమె బట్టను మర్చిపోయారు. కాగా సంవత్సరం తర్వాత నవ్యశ్రీ కి తీవ్రమైన కడుపు నొప్పి రావడంతో వేములవాడ లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో వారం రోజుల క్రితం చెకప్ చేయించుకోగా స్కానింగ్ లో కడుపులో బట్ట ఉన్నట్లు వెంటనే ఆసుపత్రిలో సర్జరీ చేసి బట్టని తొలగించారు. కడుపులో కాటన్



క్లాత్ మర్చిపోవడంతో ఇన్ఫెక్షన్ కు గురైన మహిళ ఘటనపై జగిత్యాల కలెక్టర్ యాస్మిన్ భాష సీరియస్ అయ్యారు. ఇలాంటి ఘటన జరగడం బా ధాకరమని.. పూర్తి స్థాయిలో ఎంక్వయిరీ చేసి బాధ్యులపై చర్యలు తీసుకుంటామని ప్రకటించారు.

### కార్పొరేట్, ప్రైవేటు విద్యా సంస్థలలో

## ఫీజుల నియంత్రణ చట్టం అమలు చేయాలి

**జనగామ ఏప్రిల్ 18 (ప్రజామంటలు):** భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) ఆధ్వర్యంలో స్థానిక ప్రైవేట్ డిగ్రీ కళాశాలలో




మంగళవారం సమావేశం ఎర్పాటు చేశారు. ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు దడిగ సందీప్ పాల్గొని మాట్లాడుతూ.... పెండింగ్లో ఉన్న స్కాలర్ షేప్, ఫీజు రీయింబర్స్మెంట్ విడుదల చేయాలి. ప్రవేట్ కార్పొరేట్ విద్యా సంస్థలు లలో ఫీజుల నియంత్రణ చట్టం అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు దూళిపాళ్ల రంజిత్ రెడ్డి, మోహన్, గణేష్, అరవింద్, భరత్ పాల్గొన్నారు.

### ఎమ్మెల్యే కుటుంబ సభ్యులను

## పరామర్శించిన ఎమ్మెల్సీ టి. జీవన్ రెడ్డి

**జగిత్యాల ఏప్రిల్ 18 (ప్రజామంటలు):** మాజీ జెడ్పీ చైర్మన్, మాజీ మంత్రి, కరీంనగర్ మాజీ ఎంపి చొక్కారావు పెద్ద కూతురు, జగిత్యాల



ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్ సతీమణి రాధిక తల్లి చెన్నాడి విజయ అనారోగ్యంతో ఆదివారం మరణించగా ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్ ను, వారి కుటుంబ సభ్యులను పరామర్శించిన ఎమ్మెల్సీ టి. జీవన్ రెడ్డి, ఎంపీపీ రాజేంద్ర ప్రసాద్, పట్టణ బిఆర్ఎస్ పార్టీ కార్యదర్శి బోయిన్ పల్లి ప్రశాంత్ రావు, వెంకటేశ్వరరావు, జుంబర్తి శంకర్ తదితరులు.

# ఎన్నికల వ్యూహంలో కెసిఆర్...

రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో అనురించాల్సిన వ్యూహాలను బయట పెట్టకున్నా..కెసిఆర్ తన అనుచరులతో వ్యూహాలు పన్నుతూనే ఉన్నారు. ఓ వైపు బిఆర్ఎస్ విస్తరణతో పాటు..మరోవైపు అసెంబ్లీ ఎన్నికల పోరులో గెలుపు లక్ష్యంగా పావులు కదుపుతున్నారు. ఇదే క్రమంలోపార్టీ శ్రేణులను ఆత్మీయ సమ్మేళనాలతో బిజీగా ఉంచుతున్నారు. ఎండలను లెక్క చేయకుండా మంత్రులు, ఎమ్మెల్యేలు ఆత్మీయ సమ్మేళనాలతో రోజూ ప్రచారం చేస్తున్నారు. బిఆర్ఎస్ అమలు చేస్తున్న అనేక సంక్షేమ,అభివృద్ది పథకాలను మరోమారు హైలెట్ చేసేందుకు కార్యాచరణ సిద్ధం చేస్తున్నారు. ఇదే క్రమంలో మోడీ ప్రభుత్వ వైఫల్యాలు..హామీల వైఫల్యం పైనా ప్రధానంగా దృష్టి సారించబోతున్నారు. మరో ఆరు నెలల్లో ఎన్నికలు జరగబోతున్నాయి. ఈ ఎన్నిక ల్లోనూ కెసిఆర్ పాపులర్ పథకాలు మరోమారు ప్రచారాంశం కానున్నాయి. మోడీపై రాజకీయ విమర్శలతో పాటు పథకాల పనితీరు ముందుకు రానున్నాయి. ప్రధానంగా 24 గంటలు కరంట్ అందిస్తున్న తీరును ఆయన బాగా ముందుకు తేనున్నారు. ఎండాకాలంలో ఊరూరా కరెంట్ వస్తున్న విషయాన్ని బాగా ఫోకస్ చేయనున్నారు. ఇప్పటికే ట్రాన్స్‌కో కూడా ఎక్కడా లోటుపాట్లు లేకుండా విద్యుత్ సరఫరాలో ముందున్నది. ప్రధానంగా ఈ నాలుగేళ్లలో విద్యుత్ సమస్యను అధిగమించాం. అది కొని ఇస్తున్నారా..లేక మరో రకంగా ఇస్తున్నారా అన్నది అప్రస్తుతం. ఎందుకంటే కరెంట్ వెతలతో నానా కష్టాలు పడ్డ సామాన్య లకు, రైతులకు, పారిశ్రామికవేత్తలకు కరెంట్ లేదు..రాదు అన్న ఆలోచన లేకుండా చేసిన ఘనత కెసిఆర్‌దే. ఎవరిని అడిగినా ఈ విషయంలో మొహమాటం లేకుండా చెబుతారు.తెలంగాణ ఏర్పడ్డ తరవాత గత 9 ఏళ్ల కాలం పరిశీలిస్తే సిఎం కెసిఆర్ కీలక నిర్ణయాలు తీసుకుని ప్రజా సంక్షేమానికి పెద్దపీట వేశారనే చెప్పాలి. ఇలాంటి నిర్ణయాలతో తెలంగాణ పురోగమనంలో కీలక అడుగులు పడ్డాయి. ప్రధానంగా జిల్లాల విభజన, కొత్త జిల్లాల ఏర్పాటు చారిత్రక ఘట్టంగా పేర్కొనాలి. పాలనా వికేంద్రీకరణలో ఇదో మైలురాయి. స్వాతంత్ర్యం వచ్చాక ఇంతటి కీలక నిర్ణయాలు తీసుకున్న దాఖలాలు లేవు. 10 జిల్లాలు ఉన్న తెలంగాణను పాలనా వికేంద్రీ కరణలో భాగంగా 33 జిల్లాలో చేశారు. దేశంలో ఇంతటి అరుదైన నిర్ణయం తెలంగాణలో మాత్రమే జరిగింది. ప్రధానంగా కెసిఆర్ ఇప్పుడు రైతుల ఎజెండాను భుజానికి ఎత్తుకున్నారు. రైతుబంధుతో పాపులర్ అయిన కెసిఆర్ ఇప్పుడు వారినే నమ్ముకున్నారు. అలాగే వివిధ పథకాల



ద్వారా లబ్ది పొందిన వారినే ఓటు బ్యాంక్ గా గ్రహించారు. ఇందులో భాగంగానే భారతదేశంలోనే గొప్ప రైతులు, ధనవంతులైన రైతులు, ధనవంతు లైన యాదవులు ఎక్కడ ఉన్నారంటే.. తెలంగాణ రాష్ట్రంలోనే అని చెప్పుకోవాలన్నారు. ఇదే విషయాన్ని ఆయన పదేపదే చెబుతున్నారు. దళితులు, గిరిజనుల అభివృద్ధికి ఎన్నో కార్యక్రమాలు జరుగుతున్నా యన్నారు. దళితబంధు దేశవ్యాప్తంగా అమలు చేస్తామని చెబుతున్నారు. దేశంలోనే అతి ఎక్కువ సమయం లో ఆర్థికప్రగతి సాధించాం.. అతికొద్ది సమయంలోనే ఇవన్నీ సాధించుకున్నాం. మిషన్ భగీరథ.. కాళేశ్వరం ప్రాజెక్ట్.. డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల నిర్మాణం.. ఇవన్నీ కూడా కెసిఆర్ కలల ప్రాజెక్టులు. నీళ్లు,నిధులు నియామ కాలు అన్న స్లోగన్‌తో ఉద్యమాన్ని గమ్యం చేరేలా చేసి...అధికారం చేపట్టిన తరవాత ఇలాంటి పథకాలను ప్రజల్లోకి తీసుకుని వెళ్లారు. ప్రస్తుతం అమలవుతున్న వాటిలో మిషన్ భగీరథ, మిషన్ కాకతీయ ముఖ్య మైనవి. ఇకపోతే డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లలో కూడా తెలంగాణ ఓ వెలుగు వెలుగనుంది. దేశానికి ఈ పథకం ఆదర్శంగా మారింది. ఇప్పుడు పెద్ద ఎత్తున డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల నిర్మాణం సాగుతోంది. రెండు పడక గదుల ఇళ్లు ఇప్పుడు రాష్ట్ర వ్యాప్తంగా లక్షలాది మందిలో కొత్త ఆశలు చిగురింపజేశాయి.

దాదాపు అన్ని నియోజక వర్గాల్లో డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల నిర్మాణం శరవేగంగా సాగుతున్నాయి. ఉద్యోగాల భర్తీ పక్రియనూ సర్కారు వేగవంతం చేసింది. సాగునీటి ప్రాజెక్టులు, మిషన్ భగీరథ, మిషన్ కాకతీయ ఇలా చెప్పుకుంటూ పోతే తెలంగాణలో గతంలో మునుపెన్నడూ జరగని పనులు జరిగాయని చెప్పుకోవాలి. ఇంటింటికీ స్వచ్ఛమైన మంచినీటిని అందజేసే మిషన్ భగీరథ, చెరువులను పునరుద్ధరించి వాటిలో పుష్కలంగా నీళ్లు ఉండేటట్టు చూసే మిషన్ కాకతీయ, రెండు పడక గదుల ఇళ్లు, 36లక్షల మందికి ఆసరా పథకం కింద పెన్షన్లు అందజేత వంటి వినూత్న కార్యక్రమాలను ప్రభుత్వం సమర్థంగా చేపట్టింది. కల్యాణ లక్ష్మి, షాదీముబారక్ లాంటివి పేదలకు వరంగా నిలిచాయి. అన్నింటికి మించి హరితహారం కార్యక్రమం తెలంగాణకు పెద్ద అసెట్ అయ్యింది. నాలుగేళ్లుగా మొక్కల పెంపకం పెద్ద ఉద్యమంగా సాగుతోంది. నిరంతర విద్యుత్,నీటి సరఫరా, ఎరువులు విత్తనాలు అందచేత, పెట్టుబడి సాయం కింద ఎకరాకు 8వేలు అందచేసే కార్యక్రమం, రైతులకు బీమా పథకం..ఇవన్నీ కూడా అద్భుతాలు గానే చూడాలి. కెజి టూ పిజిలో భాగంగా గురుకులాల ఏర్పాటు కూడా ఓ విప్లవాత్మకమైన మలుపుగా చెప్పుకోవాలి. పేదలకు ఉచిత విద్యను అందించే క్రమంలో ఇదో అపురూపమైన ఘట్టంగా చెప్పుకోవాలి. చేపట్టిన పనిని చివరి వరకు వదలకుండా చేసే మొడి ధైర్యం కెసిఆర్‌ది. తను చేపట్టిన పని విజయవంతంగా పూర్తి చేయడమే తప్ప వెనుదిరిగి చూడని దృఢచిత్తం కెసిఆర్‌కే సొంతం. అందుకే వ్చే పార్లమెంట్ ఎన్నికల్లో ఢిల్లీలో పాగా వేస్తా మని అంటున్నారు. తెలంగాణలో ఇప్పుడు బిజెపి, కాంగ్రెస్ బలంగా ఢీకొనబోతున్నాయి. ఈ క్రమంలో ఏ మేరకు పథకాలను మళ్లీ ప్రజలకు వివరిస్తారో..ఎలా మచ్చిక చేసుకుంటారా అన్న ప్రణాళికలు సిద్ధం అవు తున్నాయి. ఇక్కడ అసెంబ్లీలో గెలవాలి... ఢిల్లీలో పాగా వేయాలన్న లక్ష్యంతో ముందుకు సాగబోతు న్నారు.




## సాహితీ ప్రేమికులకు ప్రత్యేకం


"ప్రజా మంటలు" తెలంగాణ జాతీయ దినపత్రికలో ప్రతి రోజు ఒక కథను ప్రచురిస్తున్నాం. ముఖ్యంగా బాలల కథలకే ప్రాధాన్యత ఇస్తున్నవిషయాన్ని గమనించి ఉంటారు. ఇందులో ప్రచురించిన కథలలో, ఎంపిక చేసిన వాటిని "యూ ట్యూబ్"లో కూడా పెట్టగలము. కథకులు ఈ విషయాన్ని గమనించి, సంభాషణలు చిన్నవిగా, వర్ణన తక్కువగా, సూటిగా విషయాన్ని చెప్పే కథలను పంపండి. రచయితలు తమ కథలను mantalukathalu@gmail.comకు పంపవచ్చు...

-ఎడిటర్

## ఉత్తాకులు...

ఒకానొకప్పుడు ఒక గురుకులంలో ఒక గురువు ఉండేవాడు. అతని దగ్గర ముగ్గురు శిష్యులు విద్యాభ్యాసం చేసేవారు. కొంతకాలానికి విద్యాభ్యాసం ముగిసింది. గురువుగారు గురుదక్షిణ అడగలేదు .





అయినప్పటికీ,తమకు శ్రద్ధగా చాలా విద్యాబుద్ధులు నేర్పిన గురువుగారికి తప్పకుండా గురుదక్షిణ ఇవ్వాలని శిష్యులు భావించారు.వెంటనే గురువు దగ్గరికి వెళ్లి ఏమి కావాలో చెప్పమని ఒత్తిడి చేశారు. అప్పుడు గురువుగారు చిరునవ్వుతో తలా ఒక బస్తా రాలిపోయిన చెట్ల ఆకులను ఏరుకొని రమ్మన్నాడు. ఏమాత్రం విలువ లేని చెట్ల ఆకుల్ని గురువుగారు ఎందుకు అడిగారో అర్థం కాక శిష్యులు ఆశ్చర్యపోయారు.

గురువుగారి కోరిక తీర్చడానికి కాళి బస్తా సంచి తీసుకొని బయలుదేరారు. వారు ముందుగా ఒక రైతు మామిడి తోటలోకి వెళ్లారు. రాలిపోయిన ఆకులను కావాలని అడిగారు. అప్పుడు ఆ రైతు "నేను ఇవ్వలేను. వాటిని మా తోటకు ఎరువుగా వాడుతాను". అని అన్నాడు.

ఆ తర్వాత వాళ్లకు ఒక పెద్ద మఱ్ఱి చెట్టు కనిపించింది. ఆ చెట్టు కింద బోలెడు రాలిపడిన ఆకులు కనిపించాయి. వెంటనే వాటిని బస్తాల్లోకి ఏరుకోవడం కోసం సిద్ధపడుతుండగా, ఆ చెట్టు యజమాని వచ్చి" లేదు... లేదు... ఈ ఆకుల్ని ఇవ్వను. వీటిని నానబెట్టి విస్తార్లు కుట్టి అమ్ముకుంటాను. కాబట్టి మీకు ఇవ్వలేను" అని కరా ఖండిగా ముఖం మీదే చెప్పాడు. దీంతో చేసేది లేక శిష్యులు వేరే చోటికి వెళ్లారు.

రాలిపోయిన ఆకుల కోసం వెతుకుతుండగా వడ్లోల దాతి కాడ ఓ పెద్ద వేప చెట్టు కనిపించింది. గబగబా అంటూ అక్కడికి వెళ్లారు. వేపాకు అంతటినీ ఒకచోటకు చీపురుతో ఊడుస్తుండగా ఆ చెట్టు యజమాని వచ్చి " ఎవరు ఊడ్చేది? మాకు అక్కర్లేదనుకున్నారా.. ఆ వేపాకుతో దోమల మందు తయారు చేస్తాం. అంతే గాకుండా వాటితో కంపోస్ట్ ఎరువు చేసి అమ్ముతాం. మాకే మస్తుగా ఆకులు అక్కర ఉంది. నేను ఇవ్వను పో "అంటూ అక్కడి నుండి వెళ్లగొట్టాడు. చేసేది లేక బిక్క మొఖం వేసుకొని గురువు దగ్గరకు తిరిగి వచ్చారు శిష్యులు.

ముగ్గురు శిష్యులు కాలీ బస్తాలతో తిరిగి వచ్చి తాము చేసిన ప్రయత్నాలను గురువుగారికి పూస గుచ్చినట్లు చెప్పారు. రాలిపోయిన ఆకులను తేలేకపోయినందుకు క్షమించమని కోరారు. వెంటనే గురువుగారు " రాలిపోయిన ఆకులకే అంత విలువ ఉంటే మన జీవితాలకు ఎంత విలువ ఉందో! అని తెలుసుకోవడానికే నేను చిన్న పరీక్ష పెట్టాను. భవిష్యత్తులో జీవితం విలువ తెలుసుకోవడమే మీరు నాకు ఇచ్చే గురుదక్షిణ కాగలదు " అని హితబోధ చేప్పి, సుఖ సంతోషాలతో వర్ధిల్లమని శిష్యుల్ని ఆశీర్వదించి పంపాడు . గురువు చెప్పిన మాటల్ని చక్కగా ఆచరించి గురువుకు, తల్లిదండ్రులకు మంచి పేరు తెచ్చారు శిష్యులు.

-కోమటిరెడ్డి బుచ్చిరెడ్డి

9441561655

## నమస్కారం మన సంస్కారం (ఆధ్యాత్మిక చింతన)



నమస్కారం మన సంస్కారం. జ్ఞాన భండారం మనిషి మస్తిష్కం. కరుణ కురిపించేవి కళ్లు,మంచి బోధనలు చేసేది నోరు, సేవలు చేసేవి చేతులు, రక్షణ కల్పించేవి బాహువులు, అక్కున చేర్చుకునేది హృదయం. శక్తిని, యుక్తిని, అనురక్తిని ఇచ్చేవి ఇతర అవయవాలు. వీటన్నింటి మూలాలు పాదాల్లో కేంద్రీకృతమై ఉంటాయని వైజ్ఞానిక శాస్త్రం చెబుతోంది. ఆ పాదాలు ఎల్లవేళలా భూమితో అనుసంధానమై ఉంటాయి. అన్ని శక్తులకు ఆలవాలమైన భూమి నుంచి నిత్యం వెలువడే సానుకూల తరంగాలు పాదాల్లోనే నిబిడీ కృతమై ఉంటాయి. అంటే పాదాలు మనిషిలోని అన్ని శక్తులకూ ఆలంబనలు. అందుకే పాదాలకు నమస్కరిస్తే మూర్తీభవించిన అన్ని లక్షణాలకూ ఏకకాలంలో నమస్కారం చేసినట్టే. అథర్వణ వేదంలో పాదనమస్కార విధులు, ప్రయోజనాల వివరణ ఉందన్నది వేదవేత్తలు చెబుతున్న మాట. పెద్దలు మనకంటే ఎక్కువ కాలం ఈ భూమిపై జీవించారు. ఎక్కువ జ్ఞానాన్ని, అనుభవాన్ని గడించారు. అనేక శక్తులను కూడగట్టుకున్నారు. కాబట్టి, వారి పాదాలకు గౌరవసూచకంగా నమస్కరిస్తే, వారి మార్గాన్ని అనుసరిస్తున్నా మనే సంకేతాన్ని వారికి ఇచ్చినట్లు అవుతుందిఅది నిరహంకార తత్వానికి నిదర్శనం.

## అలుపెరుగని పోరాట యోధుడు గౌతు లచ్చన్న

### ఏప్రిల్ 19...సర్దార్ గౌతు లచ్చన్న వర్ధంతి

భారత దేశంలో సర్దార్ లుగా పేరొందిన ప్రముఖులలో ఒకరు సర్దార్ వల్లభభాయి పటేల్. మరొకరు సర్దార్ గౌతు లచ్చన్న. ఒకరిది దేశస్థాయిలో, మరొకరిది రాష్ట్ర స్థాయిలో రాణించారు. సర్దార్ అంటే సేనాని.



స్వాతంత్ర్యోద్యమ పోరాట వీరునిగా ఎన్నో ఉద్యమాలు నడిపిన కురువృద్ధుడు సర్దార్ గౌతు లచ్చన్న. జమీందారీ వర్గాల వ్యతిరేక పోరాట వీరునిగా ప్రజాహృదయాలలో లచ్చన్న స్థానం చెక్కు చెదరనిది.

గౌతు లచ్చన్న (ఆగష్టు 16, 1909 - ఏప్రిల్ 19, 2006) సాహసానికి, కార్యదక్షతకు మెచ్చి ప్రజలిచ్చిన కితాబే సర్దార్. సర్దార్ గౌతు లచ్చన్న, వి.వి.గిరి, నేతాజి సుభాష్ చంద్రబోస్, జయంతి ధర్మతేజ, మొదలగు అనేకమంది జాతీయ నాయకులతో కలిసి భారత దేశ స్వాతంత్ర్య పోరాటాలలో పాల్గొని, అనేక పర్యాయాలు జైలుకు వెళ్ళారు. ప్రకాశం పంతులు, బెజవాడ గోపాల రెడ్డి మంత్రివర్గంలో మంత్రి పదవి నిర్వహించిన లచ్చన్న, మద్యపాన నిషేధం విషయంలో ప్రకాశం పంతులుతో విభేదించి, అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టి, ప్రకాశం ప్రభుత్వ పతనానికి కారణభూతుడయ్యారు. చిన్న రాష్ట్రాల ఏర్పాటుకు మద్దతు ప్రకటించారు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర సాధనకు నాటి ఉద్యమ నేత మర్రి చెన్నారెడ్డితో చేతులు కలిపారు. తెలంగాణా రాష్ట్ర అవసరాన్ని, ఔచిత్యాన్ని వివరిస్తూ పుస్తకం వ్రాశాడు. ఇందిరాగాంధి అత్యవసర పరిస్థితి విధించినప్పుడు వ్యతిరేకించి, స్వేచ్ఛ కోసం పోరాడారు. చౌదరి చరణ్ సింగ్, జయప్రకాష్ నారాయణ, మసాని లతో కలిసి పనిచేశారు. తెలుగులో మంచి ఉపన్యాసకుడుగా, రాజాజి ఉపన్యాసాల అనువాదకుడిగా, చరిత్ర ముద్ర వేయించుకున్న బడుగువర్గ పోరాట యోధుడు లచ్చన్న. సర్దార్ గౌతు లచ్చన్న. ఉత్తర కోస్తా కళింగసీమలో ఉద్దానం ప్రాంతాన (నాటి గంజాం జిల్లా) సోంపేట తాలూకాలో బారువా అనే గ్రామంలో 1909 ఆగష్టు 16 వ తేదీన ఒక సాధారణ బీద గౌడ కుటుంబములో గౌతు చిట్టయ్య, రాజమ్మ దంపతులకు జన్మించారు.

బారువాలో గల ప్రాథమిక పాఠశాలలో 1916లో చేరి, పాఠశాలలో 8 వ తరగతి వరకు చదివి, ప్రక్కనే ఉన్న మందసా రాజావారి హైస్కూల్లో 9 వ తరగతిలో చేరి, పరీక్ష తప్పాడు. శ్రీకాకుళంలో ఉన్నత పాఠశాలలో చేర్పించగా, అక్కడ జగన్నాధం పంతులుగారి ఇంటిలో ఉండి చదువు సాగించారు. ఆ స్కూల్లో డ్రిల్ మాష్టారు నేమాని నరసింహమూర్తి శిక్షణలో జాతీయ భావాల్ని అలవర్చుకున్నారు. లచ్చన్నకు ఆనాటికి 21 సవంత్సరాలు. 1929-30 విద్యా సంవత్సరం మెట్రిక్యులేషన్ చదువుతుండగానే 21వ ఏట గాంధీజీ పిలుపువిని విద్యకు స్వస్తి చెప్పి స్వాతంత్ర్యోద్యమంలో దూకారు. 1930 లో మహాత్మాగాంధీ ఉప్పు సత్యాగ్రహానికి పిలుపినిచ్చారు. దీనికి ప్రభావితుడైన లచ్చన్న బారువా సమీపంలో ఉన్న సముద్రపు నీరుతో ఉప్పు తయారుచేసి ఆ డబ్బుతో ఆ ఉద్యమాన్ని నడిపారు. విదేశీ వస్తు బహిష్కరణోద్యమంలో పాల్గొని అందరూ చూస్తుండగానే తన విలువైన దుస్తులను అగ్నికి అహుతి చేశారు. ఉప్పు సత్యాగ్రహంలో పాల్గొంటున్నప్పుడు లచ్చన్నను అరెస్టు చేసి టెక్కలి, నరసన్నపేట సబ్ జైళ్లల్లో నలభై రోజులు ఉంచారు. కోర్టు తీర్పు మేరకు మరో నెల రోజుల శిక్షను అతను బరంపురం జైల్లో అనుభవించవలసి వచ్చింది.

1932 వ సంవత్సరంలో శాసనోల్లంఘన ఉద్యమంలో పాల్గొంటున్న లచ్చన్నను రాజమండ్రి జైల్లో ఐదు మాసాలు ఉంచారు. అంటరానితనం నిర్మూలన. అంటరానితనం మీద కత్తి ఝుళిపించాడు లచ్చన్న. అతను నడిపిన హరిజన సేవా సంఘాలు, చేపట్టిన హరిజన రక్షణ యాత్రలు ప్రజలను బాగా ప్రభావితం చేశాయి. బారువా గ్రామ వీధుల్లో యువజనులను వెంట వేసుకొని భజన గీతాలు పాడుతూ వెళుతుంటే గ్రామమంతా దద్దరిల్లుతున్నట్లు కనిపించేది. సవర్ణులలో ఆశ్చర్యం, హరిజనులలో ఆశలు రేకెత్తించేవి. రాత్రి పాఠశాలలు నిర్వహించి బడుగు వర్గాల విద్యాభివృద్ధికి అతనెంతో కృషి చేశాడు. హరిజనులకు దేవాలయాలలో ప్రవేశం కలిగించారు. లచ్చన్న చేసిన ఆర్థిక సహాయంతో కుశాగ్రబుద్ధులైన ఎందరో హరిజన విద్యార్థులు ఉన్నత స్థానాలనలంకరించారు. ఆచార్య గోగినేని రంగాతో లచ్చన్న స్నేహం రాష్ట్ర రాజకీయాలలో ఒక నూతన శకాన్ని ఆరంభించింది. మహాత్మాగాంధీ, పండిట్ నెహ్రూ గురు శిష్య సంబంధం లాంటిదే రంగా- లచ్చన్నల సంబంధం. 1935లో రాష్ట్రంలో కాంగ్రెస్ సోషలిస్టు పార్టీ శాఖ ఏర్పడినప్పుడు దానికి అతను సభ్యుడుగా ఎన్నికయ్యాడు. ఆ రోజుల్లో రైతు సంఘాలు కాంగ్రెస్ పార్టీలోని అంగాలే. 1939లో త్రిపురలో జరిగిన అఖిలభారత కాంగ్రెస్ మహాసభ, కిసాన్ సభలను ఆంధ్రలోని పలాసాలో జరపాలని తీర్మానించారు. రాహుల్ సాంకృత్యాయన్ ఈ సభలకు అధ్యక్షత వహించారు. ఈ సభలు జయప్రదం కావడానికి ప్రధానకారకుడు లచ్చన్నే. దీనితో ఆయన పేరూ, ఆయన కార్యదీక్ష దేశమంతటా తెలిసింది. లచ్చన్న అనేక కిసాన్ ఉద్యమాలు నడిపి ఆ రోజుల్లో జమీందార్ల పక్కల్లో బల్లెంగా తయరైనారు.

1942లో జరిగిన క్విట్ ఇండియా ఉద్యమంలో పాల్గొన్న లచ్చన్నను ప్రభుత్వం అతి ప్రమాదకరమైన వ్యక్తిగా గుర్తించి, ఆయనను పట్టి యిచ్చిన వారికి పదివేల రూపాయల బహుమతిని ప్రకటించింది. చివరకు ప్రభుత్వమే అతనిని బంధించి మూడేళ్ళు జైల్లో ఉంచి 1945 అక్టోబరులో విడుదల చేసింది. ఆనాటి నుంచి లచ్చన్న ఆంధ్ర అగ్రనాయకులలో ఒకరైనారు. 1947లో లచ్చన్న ఇండియన్ నేషనల్ ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ కు రాష్ట్ర శాఖ అధ్యక్షులయ్యారు.



-ఆర్కె సంగనభట్ల

9440595494

1950లో ఆచార్య గోగినేని రంగా కృషి కార్ లోక్ పార్టీని స్థాపించినప్పుడు అందులో లచ్చన్న ప్రధాన పాత్ర పోషించాడు. 1953 అక్టోబరు 1 న ప్రత్యేక ఆంధ్ర రాష్ట్రం ఏర్పడింది. మద్రాసు ప్రభుత్వం నుంచి ఆంధ్రులకు రావలసిన ఆస్తుల విభజనను పరిశీలించడానికై ఏర్పడిన ఆంధ్రసంఘంలో కాంగ్రెస్ నుంచి నీలం సంజీవరెడ్డి, ప్రజా పార్టీ నుంచి తెన్నేటి విశ్వనాథం, కృషి కార్ లోక్ పార్టీనుంచి లచ్చన్న సభ్యులు. ప్రకాశం పంతులు మంత్రివర్గంలో, బెజవాడ గోపాలరెడ్డి మంత్రివర్గం లోనూ, లచ్చన్న మంత్రిగా పనిచేశారు.

1961లో రాజాజీ ఏర్పాటు చేసిన స్వతంత్ర పార్టీకి ఆంధ్రప్రదేశ్ శాఖకు సర్దార్ గౌతు లచ్చన్న అధ్యక్షుడు. 1978లో లచ్చన్న ఆంధ్రప్రదేశ్ శాసనసభలో అధికార ప్రతిపక్ష నాయకుడుగా ఉన్నాడు. పబ్లిక్ అక్కౌంట్స్ ఛైర్మన్‌గా ఆ రోజుల్లో పనిచేశారు. కొంతకాలం బహుజన పార్టీలో పనిచేసిన లచ్చన్న ఆ తరువాత అన్ని రాజకీయ పార్టీలతో తెగతెంపులు చేసుకుని, పార్టీలకు అతీతంగా బడుగు వర్గాల సంక్షేమానికి కృషి చేస్తూ వచ్చారు. అణగారిన వర్గాల ఆశాజ్యోతి సర్దార్ గౌతు లచ్చన్న 2006 ఏప్రిల్ 19 న కన్ను మూశారు.

## ఏ కులం గొప్పది కాదు, ఏ కులం చిన్నది కాదు?

**(నిన్నటి సంచిక తరువాయి)**

15(4) ఆర్టికల్ వంటి వాటి ద్వారా కేంద్రంలో, రాష్ట్రాల్లో ప్రత్యేక ఓబీసీ శాఖల ద్వారా విద్యాసంస్థలు నిర్వహించడం ద్వారా 10-12 ఏళ్ళలో వారు ఇతరులతో సమానంగా ఓపెన్ కాంపిటీషన్‌లో కూడా గెలుస్తూ వస్తారు. ఆర్టికల్ 43 అనుసరించి మంచి జీవన ప్రమాణాలకు, ఇలాంటి ఎన్నో అమల్లోకి తేవల్సి ఉంది. భారత రాజ్యాంగంలోని 4వ భాగం రాజ్య విధానపు ఆదర్శ సూత్రాలు కూడా ఇందుకు అనుకూలంగా అన్వయించడం అవసరం. కేశవానంద భారతి కేసులో సుప్రీంకోర్టు ప్రాథమిక హక్కులు, ఆదేశిక సూత్రాలు పరస్పర అనుపూర్వకాలుగా ప్రకటించింది. ఆదేశిక సూత్రాలు లక్ష్యాలను నిర్ణయించగా, ప్రాథమిక హక్కులు ఆ లక్ష్య సాధనకు మార్గాలుగా వర్ణించింది. అందువల్ల ఆదేశిక సూత్రాలకు భిన్నంగా ప్రాథమిక హక్కుల పేరిట వ్యాజ్యాలు వేసినప్పుడు ఆదేశిక సూత్రాలు అనుసరించినప్పుడే సామాజిక న్యాయం జరుగుతుంది.

### వర్తమాన కర్తవ్యాలు

15వ ఆర్టికల్ ద్వారా సామాజిక, వర్ణ, కుల, ప్రాంత, భాష, లింగ ప్రాతిపధికలపై అసమానతలను తొలగించి సమానత్వాన్ని ప్రతిపాదిస్తుంది. ప్రతి మనిషికీ ఒకే విలువ, ఏ కులం గొప్పది కాదు, ఏ కులం చిన్నది కాదు. మనుషులంతా ఒక్కటే అనే మానవీయ సమాజ నిర్మాణం భారత రాజ్యాంగ మౌలిక లక్ష్యం. అందుకు ఆర్టికల్ 13, 14, 15, 16, 17, 23, 31బి, 32, 368 ఆర్టికల్స్ రక్షణ కల్పిస్తాయి. స్వేచ్ఛా, సమానత్వం, సౌభ్రాతృత్వం, ఆత్మ విశ్వాసం, ఆత్మ గౌరవం, అందరికీ సమాన అవకాశాలు, సమాన అవకాశాలను అందుకోలేకపోతున్నవారికి ప్రత్యేకంగా రెసిడెన్షియల్ స్కూళ్ళు, కాలేజీల, స్కాలర్ షిప్‌లు, విశ్వవిద్యాలయాలు, శిక్షణలు, రక్షణలు, రిజర్వేషన్లు మొదలైనవి ఏర్పాటు చేయబడ్డాయి. ఇవన్నీ ఈ ఆర్టికల్స్‌లో పొందుపర్చబడ్డాయి. అందువల్ల 13, 14, 15, 16, 17, 23, 31బి, 368, 9వ షెడ్యూల్ బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలు, బలహీన వర్గాలకు అత్యంత ముఖ్యమైనవి.

4. భారత రాజ్యాంగం ఆర్టికల్ 16
ప్రభుత్వ ఉద్యోగ అవకాశాల్లో సమానావకాశాలు


1.ఆర్టికల్ 16 ద్వారా పబ్లిక్ ఎంప్లాయిమెంట్ అవకాశాల్లో సమాన అవకాశాలను కల్పిస్తుంది.

1) There shall be equality of opportunity for all citizens in matters relating to employment or appointment to any office under the State.

2) No citizen shall, on grounds only of religion, race, caste, sex, descent, place of birth, residence or any of them, be ineligible for, or discriminated against in respect of, any employment or office under the State.

1.రాజ్యంలోని అన్ని ప్రభుత్వ ఉద్యోగాల్లో ప్రభుత్వ ఉద్యోగ వసతుల్లో పౌరులందరికీ ఈ సమానావకాశాలు ఉండాలి.

2. మత, జాతి, కుల, లింగ, జన్మస్థానాలలో అన్నింటిని గాని లేక ఏ ఒక్కటిని గాని కారణంగా, ఉద్దేశించి ప్రభుత్వోద్యోగ అర్హతలలోనూ, ప్రభుత్వోద్యోగములలోనూ చేర్చుకొనుటలోనూ పౌరులమధ్య వివక్షత చూపరాదు.



బీసీ, ఎస్సీ, ఎస్టీల కోసం ప్రత్యేక కేంద్ర, రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్‌లు

**వివరణ:** బీసీ, ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్ల అమలుకు ప్రత్యేక పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఏర్పాటు చేసినప్పుడే ఆయా రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వ, ప్రభుత్వరంగ ఉద్యోగాల్లో 50 శాతం మేరకు గల రిజర్వేషన్లు సమర్ధవంతంగా అమలు జరుగుతాయి.

3. అయినా జన్మస్థానాన్ని బట్టి రాష్ట్ర మరియు కేంద్రపాలిత ప్రాంతాల ప్రభుత్వోద్యోగాలలోని స్థానిక సంస్థలలోని మరియు స్వాధికార సంస్థలలోని ఉద్యోగాలను స్థానికులకు కేటాయించు విధంగా చట్టాలు చేయు అధికారం పార్లమెంటుకు ఉన్నది. ఈ కేటాయింపు ఏదైనా ఒక తరగతికి లేక కొన్ని తరగతుల ఉద్యోగాలకు పరిమితమయి వుండాలి. ఈ కేటాయింపు ఉద్యోగుల నియామకం కంటే ముందు నిర్ణయించబడినవై ఉండాలి.

ఆర్టికల్ 16(4) ప్రాధాన్యత

4. అయినప్పటికీ, వెనుకబడిన తరగతుల వారికి ప్రభుత్వ ఉద్యోగాలలో, అవకాశాలలో ప్రత్యేక కేటాయింపులను ఏర్పరచు అధికారం రాజ్యానికి ఉంది. వెనుకబడిన తరగతుల వారు ప్రభుత్వ ఉద్యోగాల్లో తగినంతమంది లేనట్లు రాజ్యం అభిప్రాయ పడినపుడు మాత్రమే తదుచితమైన కేటాయింపులను చేయవచ్చు.

4ఎ. అయినప్పటికీ, షెడ్యూల్ తెగలు, షెడ్యూల్ కులములకు చెందిన వారికి ప్రభుత్వోద్యోగాల్లో ప్రమోషన్‌లలో కూడా ప్రత్యేక కేటాయింపులను ఏర్పరచు అధికారం రాజ్యానికి ఉంది. ఉన్నత పదవులలో వారికి సీనియారిటి ప్రసాదించు అధికారము కూడా రాజ్యానికి ఉంది. షెడ్యూల్ తెగలు, షెడ్యూల్ కులాల వారు తగినంత మంది ప్రభుత్వోద్యోగాల్లో లేనట్లు రాజ్యం అభిప్రాయపడినచో తదుచితమైన పదోన్నతులకు అనువైన కేటాయింపులను చేయవచ్చు.

4బి. పైన ఉదహరించిన 4, 4(ఎ)లను అనుసరించి ప్రత్యేకంగా కేటాయించిన స్థానాలు ఏ సంవత్సరము లోనైనా భర్తీ కానిచో వాటిని తదుపరి సంవత్సరాల్లో భర్తీ చేయవచ్చు. అట్టి స్థానాల్లో ఏ సంవత్సరములోనైనా భర్తీ చేయవలసిన స్థానాలు కలిపి రిజర్వేషన్ అయ్యే స్థానాలు 50 శాతంకు మించితే ఆ విధంగా పరిగణించుటకు వీలులేదు.

5. అయినప్పటికీ, మతపరమైన సంస్థల నిర్వహణ కొరకు నియమితమయ్యే ఉద్యోగులూ యాజమాన్య హోదాలో ఉందు వారందరూ అదే మతమునకు చెందిన వారై ఉండవలెననుటకు అభ్యంతరము ఉండరాదు.

(ఈ ఆర్టికల్, లేదా 19వ ఆర్టికల్‌లోని క్లాజు (1) లోని సబ్ క్లాజు (జి)లో ఏమి పేర్కొనబడినప్పటికి, సామాజికంగా మరియు విద్యా పరంగా వెనుకబడిన వర్గాలకు చెందిన పౌరుల అభ్యున్నతి కోసం వారు (టశీతీ ్త్రవ ఖఎఝఅవవవత్ శీట ఖఅఎ ంశీఎఝశ్రీశ్రీఎ ఖఅఎ వఎబఝ్ఝఅశీఝశ్రీశ్రీఎ ఝఎఎఝతీఎ ఎశ్రీఖంంవం శీట ఎఱఅఓవఅం) లేక షెడ్యూల్డు కులాల మరియు షెడ్యూల్డు తెగల వారి అభ్యున్నతి కోసం ప్రయివేటు విద్యా సంస్థలతో సహా అన్ని విద్యా సంస్థలలో వారి ప్రవేశానికి సంబంధించి చట్ట పూర్వకంగా ప్రత్యేకమైన నిబంధనలను ప్రభుత్వం జారీ చేయవచ్చు. (సదరు విద్యా సంస్థ ప్రభుత్వం నుండి ఆర్థిక సహాయం పొందుతున్నా, పొందక పోయినా, ఈ నియమం వర్తిస్తుంది). అయితే, 30వ అధికరణంలో ఉదహరింపబడిన అల్ప సంఖ్యాకుల విద్యా సంస్థలకు ఈ క్లాజు వర్తించదు.

(ఇంకా ఉంది)



- బి ఎస్ రాములు

బీసీ కమిషన్ మాజీ చైర్మన్

8331966987



## యాదాద్రిని దర్శించుకున్న మంచు ఫ్యామిలీ

**యాదగిరిగుట్ట,ఏప్రిల్18, (ప్రజా మంటలు) :** తెలంగాణ ఇలవేల్పు యాదాద్రి లక్ష్మి నరసింహ స్వామి ఆలయాన్ని నవ దంపతులు మంచు మనోజ్ , భౌమ మౌనిక సందర్శించారు. పెళ్లయిన అనంతరం ఆలయానికి రావాలని మొక్కుకున్నట్లు.. అందుకే వచ్చామని ఆ జంట తెలిపింది. ఈ జంటతో పాటు మనోజ్ సోదరి మంచు లక్ష్మి ప్రసన్న కూడా వచ్చారు. అంతకుముందు మంచు లక్ష్మి గొప్ప హృదయం చాటుకుంది. యాదాద్రి భువనగిరి జిల్లాలోని 50 ప్రభుత్వ పాఠశాలలను దత్తత తీసుకుంటున్నట్లు ప్రకటించారు. యాదాద్రి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో లక్ష్మి, మనోజ్, భూమిక .. కలెక్టర్ పమేలా సత్పతి, జిల్లా విద్యాశాఖ అధికారులతో సమావేశమయ్యారు. ప్రైవేటు పాఠశాలలకు తగ్గట్టు స్మార్ట్ క్లాసెస్‌ను ప్రభుత్వ పాఠశాలల్లో ప్రారంభిస్తామని మంచు లక్ష్మి తెలిపారు. 1 నుంచి 5వ తరగతుల వరకు మూడేళ్ల పాటు స్మార్ట్ క్లాసెస్ నిర్వహిస్తామని, విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు. అనంతరం యాదాద్రి క్షేత్రాన్ని సందర్శించారు. సతీసమేతంగా హాజరైన మనోజ్ దంప తులతో పాటు లక్ష్మి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అధికారులు వారికి ప్రత్యేక దర్శనం చేయించారు. అనంతరం తీర్థ ప్రసాదాలు అందించారు. యాదాద్రి ఆలయాన్ని అద్భుతంగా నిర్మించిన సీఎం కేసీఆర్ కు మనోజ్ ధన్యవాదాలు తెలిపారు. ఆలయం అందంగా ఉందని పేర్కొన్నారు. ప్రస్తుతం మనోజ్ 'వాట్ ది ఫిష్' , 'మనం మనం బరంపురం' సినిమాలతో పాటు మరో సినిమా కూడా చేస్తున్నాడు.

## కెసిఆర్‌కు రోజులు దగ్గరపడ్డాయి

### మాజీ ఐఎఎస్ ఆకునూరి మురళి విమర్శలు

**హైదరాబాద్,ఏప్రిల్18, (ప్రజా మంటలు) :** సీఎం కేసీఆర్‌కు రోజులు దగ్గర పడ్డాయని రిటైర్డ్ ఐఏఎస్ ఆకూనూరి మురళీ ఆరోపించారు. ఇంటికో ఉద్యోగం అని చెప్పి.. 20, 30 వేల ఉద్యోగాలు భర్తీ చేశామని కేసీఆర్ సర్కార్



నిరుద్యోగులను మోసం చేసిందని ఆయన మండిపడ్డారు. అధికారంలో నుండి దిగగానే కేసీఅర్ అయిన కుంటుబ సభ్యులు చంచల్ గూడా.. చర్ల పల్లి జైల్ లో ఉండాల్సిన పరిస్థితి వస్తుందని అన్నారు. రైతుల భూములు లాక్కుంటూ విదేశాల్లో కేసీఆర్ కుటుంబం అక్రమంగా పెట్టుబడులు పెడుతుందని విమర్శించారు. కోట్లు ఖర్చు చేసి గడిలాగా ప్రగతి భవన్ ను నిర్మించారని..కేసీఆర్ గద్దె దిగాక..ప్రగతి భవన్ ఆసుపత్రి అవుతుందన్నారు. పేపర్ల లీకేజిని నిరసిస్తూ.. అఖిల పక్ష భరోసా పేరుతో హైదరాబాద్ ఇందిర పార్క్ ధర్నా చౌక్ వద్ద నిరసన దీక్ష చేపట్టారు. అందులో ఆకూనూరి మురళీ పాల్గొన్నారు. ఈ దీక్షకు కాంగ్రెస్, బీఎస్పీ, జనసమితి, న్యూ డెమోక్రసీ పార్టీల నేతలు, వివిధ యూనివర్సిటీల విద్యార్థులు, నిరుద్యోగులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. టిపిఎస్‌సి చైర్మన్, కార్యదర్శి, బోర్డు సభ్యులను వెంటనే తొలగించాలని వారు డిమాండ్ చేశారు. పేపర్ లీకేజీ కేసును వెంటనే సీబీఐకి అప్పగించాలని కోరారు.

## బలంగా బిఆర్ఎస్ వ్యతిరేక గాలి

### పొత్తులకు అవకాశం లేదన్న షబ్బీర్ అలీ

**కామారెడ్డి,ఏప్రిల్18, (ప్రజా మంటలు) :** వచ్చే ఎన్నికల్లో తాము బిఆర్ఎస్‌తో పొత్తు పెట్టుకునే ప్రసక్తే లేదని కాంగ్రెస్ నేత, మాజీమంత్రి షబ్బీర్ అలీ చేశారు. బిఆర్ఎస్‌కు వ్యతిరేక గాలి వీస్తోందని అన్నారు. తెలంగాణలో కాంగ్రెస్ దూసుకు పోవడం ఖాయమని అన్నారు. రాహుల్ గాంధీపై కేంద్రం కక్షపూరితంగా వ్యవహరించడంతో కాంగ్రెస్‌కు మరింత ఆదరణ పెరిగిందన్నారు. అలాగే మోడీ



వ్యతిరేక గాలి బలంగా వీస్తోందన్నారు.

బిఆర్ఎస్‌తో పొత్తుల విషయంలో వస్తున్న వార్తలపై ఇప్పటికే పార్టీవివరణ ఇచ్చిందని అన్నారు. పొత్తు విషయంలో వస్తున్న వార్తలు పూర్తిగా తప్పుడు ప్రచారమని ఆయన చెప్పారు. బిఆర్ఎస్, బీజేపీపై పోరులో తమ వైఖరి మారదని స్పష్టం చేశారు. ఆ రెండు పార్టీల నుంచి తెలంగాణను రక్షించేందుకు తాము కృషి చేస్తామని గుర్తు చేశారు. వచ్చే ఎన్నికల్లో గెలుపు లక్ష్యంగా సన్నద్ధమవుదామని పార్టీ శ్రేణులకు పిలుపు నిచ్చారు. ఇటీవలి కాలంలో కేంద్ర ప్రభుత్వ నిర్ణయాలపై ఆయా రాష్ట్రాల ముఖ్య మంత్రులు మండిపడుతు న్నారు. మమతా బెనర్జీ మళ్లీ కాలుదువ్వుతున్నా అందుకు తగ్గ పరిస్థితులు లేవు. ఈ క్రమంలో తెలుగు రాష్ట్రాల్లో రాజకీయ సమీకరణాలు ఎలా ఉంటాయన్నది చూడాలి. కర్నాటకలో కాంగ్రెస్ అనుకూల వాతావరణం ఉందన్నారు. అక్కడ బిజెపికి బుద్ధి చెప్పేందుకు ప్రజలు సిద్దంగా ఉన్నారని షబ్బీర్ అన్నారు.

## బెంగాల్లో మండుతున్నెండలు

### ఇంటి టెర్రస్ పెనంపై ఆమ్లెట్ వేసిన వ్యక్తి

**కోల్‌కతా,ఏప్రిల్18, (ప్రజామంటలు):** దేశవ్యాప్తంగా ఎండలు మండిపోతు న్నాయి. భానుడి భగభగతో జనం ఇండ్లకే పరిమితమవుతున్నారు. కొబ్బరి నీళ్లు, ద్రవపదార్థాలు తీసుకుంటూ డీహైడ్రేట్ కాకుండా చూసుకుం టున్నారు. ఇక పశ్చిమ బెంగాల్‌లో ఓ వ్యక్తి తన ఇంటి టెర్రేస్‌లో పెనంపై ఆమ్లెట్ వేసిన వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. వీడియోలో వ్యక్తి టెర్రేస్‌పై పెనం మీద కోడిగుడ్డును పగలగొట్టి ఆమ్లెట్ వేస్తుండటం కనిపిస్తుంది. ఎండ వేడికి గుడ్డు ఉడికి ఆమ్లెట్‌గా మారడం ఆశ్చర్యానికి లోనుచేస్తుంది. ఆపై ఫ్రైడ్ ఎగ్‌ను ఆ వ్యక్తి టేస్ట్ చేయడం చూడొచ్చు. ఈ వీడియోకు 15 లక్షల పైగా వ్యూస్ రాగా, నెటిజన్లు పెద్దసంఖ్యలో రియాక్టయ్యారు. దీన్ని నమ్మలేకపోతున్నామని ఓ యూజర్ కామెంట్ చేయగా, అమేజింగ్ అని మరో యూజర్ రాసుకొచ్చారు.

# దేశవ్యాప్తంగా మండుతున్న ఎండలు

### 40 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదు

### అప్రమత్తంగా ఉండాలంటూ వైద్యుల హెచ్చరిక



**న్యూఢిల్లీ,ఏప్రిల్18, (ప్రజా మంటలు) :** దేశ వ్యాప్తంగా ఎండలు మండి పోతున్నాయి. అనేక రాష్ట్రాల్లో 40 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. పొద్దున 8 గంటలకే భానుడు తన ప్రతాపాన్ని చూపిస్తున్నాడు. అటు బీహార్‌లో ఎండలు దంచికొడుతున్నాయి. ఎండల తీవ్రతతో జనం ఇబ్బందులు పడుతున్నారు. పాట్నా ఎయిర్ పోర్టులో రికార్డు స్థాయిలో 44 డిగ్రీల ఉష్ణగ్రతలు నమోదయ్యాయి. పాట్నాలో వేడిగాలులకు జనం ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. పగటిపూట ఉష్ణోగ్రతలు పెరిగిపోతుండటంతో పనిచేయడం కష్టంగా మారింది.

కేరళ రాష్ట్రంలోనూ ఉష్ణోగ్రతలు రోజురోజుకు పెరిగిపోతున్నాయి. ఏప్రిల్ 18వ తేదీన కొట్టాయంలో రికార్డు స్థాయిలో 38 డిగ్రీల ఉష్ణోగత్రలు నమోదయ్యాయి. అయితే రోజు రోజుకు ఉష్ణోగ్రతలు పెరగడానికి కారణం గ్లోబల్ వార్మింగే కారణమని ట్రాపికల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఎకలాజికల్ సైన్స్ డైరెక్టర్ డాక్టర్ పున్నమ్ కురియన్ తెలిపారు. దీనికి చెట్లు నాటడమే పరిష్కారమని తెలిపారు. బీహార్ తోపాటు.. జమ్ము కశ్మీర్, పంజాబ్,హర్యానా, ఢిల్లీ, ఉత్తరాఖండ్, హిమాచల్ ప్రదేశ్, గుజరాత్, రాజస్థాన్, మధ్యప్రదేశ్‌లో భారీగా ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఏప్రిల్ నెలలోనే ఈ విధంగా ఎండలు మండిపోతుంటే మే నెలలో మరింత అధికంగా ఉండే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. ఎండల పట్ల ప్రజలు జాగ్రతగా ఉండాలని సూచిస్తున్నారు. అటు ఎండలతో తీవ్ర ఉక్కిరిబిక్కిరి అవుతున్న ప్రజలు..శీతల పానియాలను ఆశ్రయిస్తు?న్నారు. కొబ్బరిబొండాలు, చెరుకురసాలు, నిమ్మరసాలను ఎక్కువగా తాగుతు న్నారు. దీంతో ప్రస్తుతం వీటికి మార్కెట్లో డిమాండ్ ఏర్పడింది. దేశ వ్యాప్తంగా ఎండలు మండిపోతున్న నేపథ్యంలో జాగ్రత్తగా ఉండాలని డాక్టర్లు సూచిస్తు న్నారు. అవసరం అయితే తప్ప బయటకు వెళ్లొద్దని చెప్తున్నారు. బయటకు వెళ్తే టోపి లేదా రూమాలు కట్టువాలంటున్నారు. దాహం వేయకపోయిన తరుచుగా నీటిని తాగాలని..ఉప్పుకలిపిన మజ్జిగ, గ్లూకోజు, ఓ ఆర్ యస్ కలిపిన నీటిని తాగుతుండాలని తెలిపారు. వడదెబ్బకు గురైన వారు సాధారణ స్థితికి రాకపోతే వెంటనే దగ్గర్లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించాలి. ఎండలో నుంచి వచ్చిన వెంటనే నీరు లేదా నిమ్మరసం, కొబ్బరి నీరు తాగాలి. తీవ్రమైన ఎండలో బయటికి వెళ్లినప్పుడు తలతిరగడం, వాంతులు ఇతర అనారోగ్య సమస్యలు ఏర్పడితే వెంటనే దగ్గరల్లోని వైద్యున్ని సంప్రదించాలి. ఎండలో గొడుగు లేకుండా తిరగరాదు. మధ్యాహ్నం తరువాత అంటే 12గంటల నుంచి సాయంత్రం 3గంటల మధ్యకాలంలో బయట ఎక్కువ శారీరక శ్రమతో కూడిన పనిచేయకూడదు. బాలింతలు,చిన్నపిల్లలు, వృద్ధులు ఎండ ఎక్కువగా ఉన్నప్పుడు బయట తిరగొద్దు. శరీరాన్ని డీహైడ్రేట్ చేసే ఆల్కహాల్, టీ, కాఫీ, కూల్ డ్రింక్స్ జోలికి వెళ్లకండి. అధిక ప్రోటీన్, ఉప్పు, కారం, నూనె ఉండే పదార్థాలకు దూరంగా ఉండండి.

# 12 క్లాస్ గ్రాడ్యుయేషన్ పట్టాను అందుకున్న హిమాన్షు

### మనవడు హిమాన్షుకు కెసిఆర్ దంపతుల ఆశీర్వాదం

**హైదరాబాద్,ఏప్రిల్18, (ప్రజా మంటలు) :** ఉన్నత చదువులు చదివి.. జీవి తంలో మరింతగా ఎదగాలని, సమాజానికి గొప్పగా సేవ చేయాలని 12 క్లాస్ గ్రాడ్యుయేషన్ పట్టాను అందుకున్న తమ మనుమడు హిమాన్షు రావును ముఖ్యమంత్రి కేసీఆర్ దంపతులు ఆశీర్వదించారు. మంత్రి కేటీఆర్ తనయుడు కల్వకుంట్ల హిమాన్షు రావు గచ్చిబౌలిలోని ఓక్రిడ్జ్ ఇంటర్నేషనల్ స్కూల్ నుంచి 12వ క్లాస్ ను పూర్తి చేసి గ్రాడ్యుయేషన్ పట్టా అందుకున్నారు. ఈ సందర్భంగా తాను చదువుతున్న స్కూల్ లో '12 క్లాస్ గ్రాడ్యుయేషన్ డే'వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హిమాన్షు తాత, నాయనమ్మలైన సీఎం కేసీఆర్, శోభమ్మ దంపతులు, తల్లిదండ్రులు కేటీఆర్, శైలిమ, చెలెలు అలేఖ్యతో పాటు ఇతర కుటుంబ సభ్యులు హాజరయ్యారు. 'గ్రాడ్యుయేషన్ డే' సందర్భంగా 12వ తరగతిని విజయవంతంగా పూర్తి చేసిన విద్యార్థులకు ఓక్రిడ్జ్ స్కూలు యాజమాన్యం గ్రాడ్యుయేషన్ పట్టాలను అందజేశారు. విద్యనభ్యసిస్తూనే క్రీడలు, సాంస్కృతిక రంగం, సామాజిక సేవ వంటి రంగాల్లో అత్యంత ప్రతిభ కనబర్చిన విద్యార్థినీ, విద్యార్థులకు స్కూల్ యాజమాన్యం ప్రతిభా పురస్కారాలు అందజేసింది. ఇందులో భాగంగా.. హిమాన్షు 'కమ్యూనిటి యాక్టివిటీ సర్వీసెస్' (సిఎఎస్) విభాగంలో గొప్ప ప్రతిభను ప్రదర్శించారు. దాంతో హిమాన్షును సీఎఎస్ విభాగంలో ఎక్స్ లెన్స్ అవార్డు అందజేశారు. గ్రాడ్యుయేషన్ పట్టాను అందుకున్న హిమాన్షు.. స్టేజీ దిగివచ్చి తమ తాత సీఎం కేసీఆర్ చేతుల్లో గ్రాడ్యుయేషన్ పట్టాను పెట్టి పాదాలకు నమస్కరించారు. కేసీఆర్ ఆశీర్వాదం తీసుకున్నారు. చిన్నతనం



నుంచి తమ చేతుల్లో పెరిగి ఇవాళ పట్టభద్రుడిగా ఎదిగిన మనువడిని హృదయపూర్వకంగా అభినందించారు సీఎం కేసీఆర్. భవిష్యత్తులో మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహిం చాలని మనుమడిని కేసీఆర్ ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో హిమాన్షు అమ్మమ్మ, మేన



మామలు, ఇతర కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. హిమాన్షురావుతో పాటు గ్రాడ్యుయేషన్ పట్టాను పొందిన క్లాస్ మేట్ ఆద్విత్ బిగాల తండ్రి, బీఆర్ఎస్ ఎన్నారై సెల్ గ్లోబల్ కో ఆర్డినేటర్ మహేశ్ బిగాల, వారి పెదనాన్న ఎమ్మెల్యే గణెశిష్ బిగాల కూడా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. గ్రాడ్యుయేషన్ డే సంద్భంగా పట్టాలు అందుకున్న విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులతో సమావేశ మందిరం కిక్కిరిసింది. విద్యార్థుల హర్షధ్వానాలతో ప్రాంగణం మారు మోగింది.

# కర్నాటకలో పెరిగిన ఎన్నికల నిఘా

### ఎన్నికల ఖర్చులపై ప్రత్యేక దృష్టి

### నీడలా వెన్నాడుతున్న పరిశీలకులు

### డబ్బు రవాణాపైనా డేగకన్ను

**బెంగళూరు,మార్చి18, (ప్రజా మంటలు) :** కర్నాకటలో మరోమారు అధికారం లక్ష్యంగా బిజెపి ప్రణాళికలు సిద్దం చేస్తోంది. అయితే పార్టీలో సీనియర్లు కొందరు పార్టీని వీడడం దానికి మింగుడుపడడం లేదు. మరోవైపు ఎన్నికల సంఘంకూడా పటిష్ట ఏర్పాట్లతో ముందుకు సాగుతోంది. గతంకన్నా భిన్నంగా ఇప్పుడు జిల్లాల్లో అధికారులు నిఘా కట్టుదిట్టం చేశారు. ప్రధానంగా ఎన్నికల ఖర్చుపై ప్రత్యేక దృష్టి సారించారు. నగదు ప్రవాహంపై ఆరా తీస్తున్నారు. అభ్యర్థుల ప్రచారం, నగదు వ్యవహారాలపై ఎన్నికల ప్రత్యేక దృష్టి సారిస్తున్నాయి. ఎప్పటికప్పుడు జిల్లాలకు, అక్కడి నుంచి రాష్ట్రానికి నివేదికలు వెళుతున్నాయి. ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు పోటీ చేస్తున్న అభ్యర్థి రూ.70లక్షలకు మించి ఖర్చు చేయడానికి వీలు లేదు. ఈ నేపథ్యంలో నిత్యం నిఘా ఏర్పాటు చేస్తున్నారు. ఎన్నికల్లో పోటీ చేస్తున్న అభ్యర్థి ఖర్చు వివరాలపై ఈసారి ఎన్నికల కమిషన్ ప్రత్యేక దృష్టి సారించింది. డబ్బు చేరవేతపై గట్టి నిఘా పెట్టామని ఎన్నికల అధికారి మనోజ్ కుమార్ మీనా చెప్పారు. రశీదులు, రుజువులు దగ్గర పెట్టుకోవాలని సూచించారు. విధించిన పరిమితికి మించి ఖర్చు పెడితే చర్యలు తీసుకునేందుకు ఏర్పాటు చేస్తున్నారు. మరోవైపు అభ్యర్థుల లెక్కలు తప్పుగా చూపే అవకాశం ఉన్న నేప థ్యంలో ప్రత్యేక బృందాల ద్వారా ర్యాలీలు, బహిరంగ సభలతోపాటు ఇతర కార్యక్రమాలను వీడియో ద్వారా చిత్రీకరించనున్నారు. ర్యాలీలు, సభల్లో ఎమ్మెల్యే ఫొటోలు వాడితే ఆ సభకు అయ్యే ఖర్చును అభ్యర్థి ఖాతాలోనే లెక్కిస్తారు. ప్రచారానికి సంబంధించిన వివరాలను నమోదు చేసేందుకు ఎన్నికల అధికారులు ఎంపి అభ్య ర్థులకు ప్రత్యేక రిజిష్టర్‌ను అందజేస్తున్నారు. ఈ రిజిష్టర్‌లో అభ్యర్థులు తమ ఎన్నికల ఖర్చు వివరాలను నమోదు చేయాల్సి ఉంటుంది. సామాన్య పౌరులు తమతో రూ.50 వేలకు మించి నగదు తీసుకెళ్లవద్దని, అంతకు మించి తరలిస్తే వాటిని సీజ్ చేసి ఆ దాయపు పన్నుల శాఖకు అప్పగించనున్నారు. నగదుకు సంబంధించిన రశీదు, ధ్రువ పత్రాలను చూపించాల్సి ఉంటుంది. కాగా జీరో అకౌంట్స్ ఖాతాలతోపాటు, బ్యాంకుల లావాదేవీలపై కూడా అధికారులు కన్నేశారు. అనుమానిత వ్యక్తులపై కూడా నిఘా ఉంచేందుకు ప్రజలతో భాగ్యస్వామ్యం అవుతున్నారు. సమాచార వ్యవస్థను మరింత పెంచుకుంటున్నారు. ఈసారి నూతనంగా ప్రతీ పోలింగ్ స్టేషన్‌ను జియో ట్యాగింగ్‌తో అనుసంధానం చేస్తున్నారు. ప్రస్తుతం అత్యధునిక సాంకేతికతతో కూడిన జియో ట్యాగింగ్ సిస్టమ్‌ను పోలీస్ యంత్రాంగం వినియోగిస్తోంది. ఎన్నికల నేపథ్యంలో పోలీసులు జిల్లాలో నిరంతరం నిఘా ఏర్పాటు చేశారు. ఎన్నికల కార్యకలాపాలపై దృష్టి సారించేందుకు ప్రత్యేక నిఘా బృందాలను నియమించారు. ఈ బృందాలు ఎప్పటికప్పుడు జిల్లాలను జల్లెడ పడుతున్నాయి.



జిల్లాలో సంఘ వ్యతిరేక శక్తులు ప్రవేశించకుండా సరిహద్దు ప్రాంతాల్లో తనిఖీలు చేస్తున్నారు. జిల్లాల్లోని సరిహద్దు రాష్ట్రాల్లో గట్టి నిఘాను ఏర్పాటు చేసి ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నామని పోలీసులు తెలిపారు. జిల్లా మహారాష్ట్ర సరిహద్దు, కేరళ, తమిళనాడు, ఆంధ్రా, తెలంగాణను ఆనుకుని ఉన్నందున అన్ని ప్రాంతాల్లో నిఘా పెంచామన్నారు. పరీవాహక ప్రాంతం వెంట కూంబింగ్ ముమ్మరం చేశామని, సంఘ వ్యతిరేక శక్తులు జిల్లాలో ప్రవేశించకుండా కట్టుదిట్టమైన చర్యలు చేపట్టామన్నారు. ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో జరిగేలా పోలీసు సిబ్బందిని అప్రమత్తం చేయడంతో పాటు సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించి ఎన్నికలు శాంతియుతంగా జరిగేలా ప్రణాళికలు రూపొందించా మన్నారు. ఎన్నికల్లో మద్యం, నగదు పంపిణీని అరికట్టడానికి చర్యలు తీసుకుంటున్నారు. గ్రామాల్లో నాటుసార కేంద్రాలు, బెల్టు దుకాణాలను అరికట్టడంతో పాటు విక్రయాలు జరిపే వారిపై కేసులు నమోదు చేస్తామన్నారు. ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున ఇత రులను కించపరిచేలా మాట్లాడటం, సోషల్ మీడియాలో అభ్యంతకర పోస్టులు పెట్టినా కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. గ్రామాల్లో శాంతి భద్రతల పరిరక్షణకు ప్రతీ ఒక్కరు సహకరించాలని కోరారు.

గ్రామాల్లో అపరిచిత వ్యక్తులు సంచరిస్తే సమాచారం ఇవ్వాలని సూచించారు. ఎన్నికల నేపథ్యంలో మద్యం, డబ్బు అక్రమ రవాణాను నివారించేం దుకు నిఘా మరింత పెంచారు. అక్రమంగా మద్యం సరఫరా కాకుండా చర్యలు తీసుకుంటు న్నారు. అలాగే మద్యం తరలిం పుపైనా ఎక్సైజ్ అధికారులు నిఘా పెట్టారు. ఎన్ని కలకు ముందు ఏరులై పారే మద్యం అమ్మకాలు, సరఫరాపై ప్రత్యేక దృష్టి సారించాయి. ఇతర ప్రాంతల నుంచి అక్రమంగా మద్యం తరలి పోకుండా ప్రత్యేక తనిఖీలపై సైతం చేపడుతున్నారు.

# ఎన్‌సిపిని చీల్చే ప్రయత్నాలు బూటకం

### అజిత్ పవార్ ఎలాంటి కుట్రలు చేయడం లేదు

### మీడియా కథనాలను తోసిపుచ్చిన శరద పవార్

**న్యూఢిల్లీ,ఏప్రిల్18, (ప్రజా మంటలు) :** నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ ని అజిత్ పవార్ చీల్చబోతున్నట్లు వస్తున్న మీడియా కథనాలపై ఆ పార్టీ చీఫ్ శరద్ పవార్ మంగళవారం తోసిపుచ్చారు. ఎన్‌సీపీ ఎమ్మెల్యేల సమావేశాన్ని ఎవరూ ఏర్పాటు చేయలేదని స్పష్టం చేశారు. ఎమ్మెల్యేల సమావేశాన్ని తాను ఏర్పాటు చేశానని వచ్చిన వార్తలను అజిత్ పవార్ కూడా ఖండించారు. అజిత్ పవార్ బీజేపీతో సన్నిహితంగా మెలగుతున్నారని, ఎన్‌సీపీ ఎమ్మెల్యేల్లో మూడింట రెండొంతుల మంది ఆయన వెంట ఉన్నారని మీడియా కథనాలు చెప్తున్న సంగతి తెలిసిందే. మహారాష్ట్ర రాజకీయ వర్గాల్లో కూడా ఈ చర్చ జరుగుతోంది. మహారాష్ట్రలో శివసేన పార్టీ చీలిపోయినట్లుగానే ఎన్‌సీపీ కూడా ముక్కలవుతుందని చాలా మంది భావిస్తున్నారు. ఈ నేపథ్యంలో శరద్ పవార్ విలేకర్లతో మాట్లాడుతూ, మీడియా మదిలో చక్కర్లు కొడుతున్న అంశాలు మా మనసుల్లో లేవన్నారు. ఈ చర్చలకు ఎటువంటి ప్రాధాన్యం లేదన్నారు. ఈ కథనాలకు అర్థం లేదన్నారు. పార్టీని ఎలా బలోపేతం చేయాలన్నదాని గురించే తమ ఎమ్మెల్యేలంతా ఆలోచిస్తారని తాను చెప్పగలనని తెలిపారు. ఎవరి మనసులోనూ ఇతర ఆలోచనలేవీ లేవన్నారు. అంతకుముందు ఓ ప్రముఖ పత్రికలో వచ్చిన కథనం ప్రకారం, అజిత్ పవార్ మహారాష్ట్ర తదుపరి ముఖ్యమంత్రి కావాలని కలలు కంటున్నారు. బీజేపీ మద్దతుతో ఏక్‌నాథ్ షిండే వారసునిగా ముఖ్యమంత్రి పదవిని చేపట్టేందుకు ఆయన తీవ్రంగా ప్రయత్నిస్తున్నట్లు ఈ కథనం తెలిపింది. ఎన్‌సీపీ ఎమ్మెల్యేల మద్దతును ఆయన కూడగడుతున్నారని తెలిపింది. ఎన్‌సీపీకి ప్రస్తుతం 53 మంది ఎమ్మెల్యేలు ఉన్నారు. వీరిలో సుమారు 40 మంది అజిత్ పవార్ వైపు ఉన్నట్లు ఈ కథనం తెలిపింది. వీరందరూ సంతకాలు చేసిన మద్దతు లేఖను సమయం వచ్చినపుడు గవర్నర్‌కు సమర్పించాలని నిర్ణయించారని తెలిపింది. ఈ వివరాలను ఎన్‌సీపీ ముఖ్య నేతలు చెప్పినట్లు వివరించింది. 2019లో అజిత్ పవార్ తిరుగుబాటు చేసి, బీజేపీతో కలిసి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసినపుడు శరద్ పవార్



ఎన్‌సీపీ ఎమ్మెల్యేలకు ఫోన్లు చేసి, పార్టీని ముక్కలు కాకుండా అడ్డుకోగలిగారు. శివసేన (ఉద్ధవ్ బాల్ థాకరే) వర్గం నేత, రాజ్యసభ సభ్యుడు సంజయ్ రౌత్ మాట్లాడుతూ, అజిత్ పవార్ తిరుగుబాటు చేస్తున్నట్లు వచ్చిన వార్తలు నిరాధారమైనవని చెప్పారు. తాను మంగళవారం ఉదయం అజిత్ పవార్‌తోనూ, ఇతర ఎన్‌సీపీ నేతలతోనూ మాట్లాడానని తెలిపారు. మహావికాస్ అగాడీ కూటమిని బలహీనపరచాలనే ఉద్దేశంతోనే ఇటువంటి పుకార్లను ప్రచారం చేస్తున్నారన్నారు. తమను బలహీనపరచగలమనుకోవడం పొరపాటు అని స్పష్టం చేశారు.

# కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్, సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ చేసిన ఎం.ఎల్.ఏ.

**అక్కన్నపేట 18 ఏప్రిల్ (ప్రజామంటలు):** అక్కన్నపేట మండల పరిధిలోని 71 మంది లబ్ధిదారులకు కళ్యాణ లక్ష్మి పథకం కింద 71 లక్షల 8 వేల 236 రూపాయల విలువ గల కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను అందజేశారు. అనంతరం 30



మందికి ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా మంజూరైనా 8 లక్షల 90 వేల రూపాయల విలువ గల చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పేద ప్రజల సంక్షేమం కోసం పని చేస్తుందని ఎమ్మెల్యే సతీష్ కుమార్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సిద్దిపేట వైస్.జడ్పీ చైర్ పర్సన్ రాయి రెడ్డి, అక్కన్నపేట్ ఎంపీపీ మలోతు లక్ష్మిబీ నాయక్, అక్కన్నపెట్ జడ్పిటిసి భూక్యా మంగా శ్రీనివాస్, బిఆర్ఎస్ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# జనగామ జిల్లా దివంగత కవుల క్యాలెండర్

## డిసిపి సీతారాంకు అందజేత

**జనగామ ఏప్రిల్ 18 (ప్రజామంటలు):** కవులు కళాకారుల ఐక్యవేదిక ఆద్వర్యంలో కల్నల్ డాక్టర్ మాచర్ల భిక్షపతి ముద్రించిన జనగామ జిల్లా దివంగత కవుల క్యాలెండర్ ను మంగళవారం జనగామ డిసిపి పి. సీతారాం కు అందజేశారు. ఈ సందర్భంగా డిసిపి సీతారాం మాట్లాడుతూ మరుగున పడిన కవులకు వెలికి తీసి ఒక



కాలమానిని ముద్రించడం సంతోషంగా ఉందని అంటూ సంపాదకవర్గాన్ని అభినందించారు. ఈ కార్యక్రమంలో ఐక్యవేదిక కన్వీనర్, కాలమానిని ప్రధాన సంపాదకులు జి. కృష్ణ, జనగామ రచయితల సంఘం (జరసం) అధ్యక్షులు అయిలా సోమనర్సింహచారి, శ్రీశ్రీ కళావేదిక అధ్యక్షులు లగిశెట్టి ప్రభాకర్, కవి మల్యాల జనార్ధన చారి పాల్గొన్నారు.

# ఉద్యోగం ఇస్తామని ఇవ్వలేదని ఎస్.ఇ. కి వినతిపత్రం

**జనగామ ఏప్రిల్ 18 (ప్రజామంటలు):** జనగామ జిల్లా దేవరుప్పుల మండలం కడవెండి గ్రామంలో 33/11 కె.వి. సబ్ స్టేషన్ నిర్మాణానికి స్వంత వ్యవసాయ భూమి సర్వే నెం 472/ఏ1 లో విస్తీర్ణం 1-00 ఎకరం భూమిని ఎన్.పి.డి.సి.ఎల్



జనగామ తరుపున నాటి అసిస్టెంట్ ఇంజనీర్ ఎ.ఈ. బోయిని సత్తయ్య 2011 సంవత్సరం సెప్టెంబర్ 5వ తేదీన తీసుకొని నష్ట పరిహారం డబ్బులు గాని, కుటుంబంలో ఒకరికి ఉద్యోగం గాని ఇస్తామని ఇవ్వలేదని, ఈ విషయంలో న్యాయం చేయాలని ఎస్.ఇ. కి వినతిపత్రం అందజేశారు.

# మల్లయ్య పార్థివదేహానికి కాంగ్రెస్ నాయకుల నివాళులు

**లింగాల ఘనపురం ఏప్రిల్ 18 (ప్రజామంటలు):** జనగామ జిల్లా లింగాల ఘణపురం మండలం కేంద్రంలోని కొత్తపెల్లి గ్రామంలో అనారోగ్యంతో మృతి



చెందిన జాగిర్లపురం మల్లయ్య వారి పార్థివదేహానికి జనగామ జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకులు పోరెడ్డి మల్లారెడ్డి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో సాంస్కృతిక సేన జిల్లా అధ్యక్షుడు బోయిని శ్రీనివాస్, సాంస్కృతిక సేన రాష్ట్ర కార్యదర్శి, నేలపోగుల ఎంపిటిసి గుగ్గిల నర్సయ్య, ఒబిసి మండల అధ్యక్షుడు బర్ల మాధవి కుమార్, కొత్తపల్లి గ్రామ శాఖ అధ్యక్షుడు జనగామ ఉపేందర్, కంచర్ల రవి, ఆంజనేయులు,రాజు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

# టీబీసీ ఐకాస రాష్ట్ర కార్యవర్గంలో ఉమ్మడి జిల్లాల నాయకులు

**జగిత్యాల ఏప్రిల్ 18 (ప్రజామంటలు):** తెలంగాణ రాష్ట్ర బీసీ సంక్షేమ ఐక్య కార్యచరణ సమితి రాష్ట్ర కార్యవర్గంలో ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని జగిత్యాల,కరీంనగర్,సిరిసిల్ల రాజన్న,పెద్దపల్లి జిల్లాలకు చెందిన బీసీ నాయకులకు పదవులు దక్కాయి.జగిత్యాల జిల్లాలోని పెగడపల్లి మండలం బతికేపెల్లి గ్రామానికి చెందిన న్యాయవాది క్యాస రఘునందన్ రెడ్డిని టీ బీసీ ఐకాస రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శిగా, జిల్లా కేంద్రానికి చెందిన ఎల్లాపి నేత వెలముల ప్రకాష్ ను టీ బీసీ ఐకాస రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా, ఇదే జిల్లాలోని కథలాపూర్ మండలం బొమ్మెన గ్రామానికి చెందిన బీసీ నేత చిందం మనోహర్ ను టీ బీసీ జేఏసీ రాష్ట్ర కార్యదర్శిగా, సిరిసిల్ల రాజన్న జిల్లాలోని వేములవాడకు చెందిన మున్నూరు కాపు సంఘము రాష్ట్ర నేత చిలుక రమేష్ ఆ జిల్లా టీ బీసీ ఐకాస అధ్యక్షుడుగా పని చేస్తుండగా టీబీసీ ఐకాస రాష్ట్ర ఉపాధ్యక్షుడుగా, కరీంనగర్ జిల్లాకు చెందిన టీబీసీ ఐకాస నేత పి. విశ్వముఖ చారిని రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా, పెద్దపల్లి జిల్లాలోని గోదావరిఖని కి చెందిన మున్నూరు కాపు నేత శ్రీనివాస్ ను టీ బీసీ ఐకాస రాష్ట్ర కార్యదర్శిగా హైదరాబాద్ లో టీబీసీ ఐకాస రాష్ట్ర అధ్యక్షుడు హరి ఆశోక్ కుమార్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అనంతరం బీసీల సంక్షేమం, సమస్యల పరిష్కారం కోసం తమ వంతు బాధ్యతలను చిత్తశుద్ధితో నిర్వహిస్తామని ఎన్నికయిన వారితో రాష్ట్ర అధ్యక్షుడు హరి ఆశోక్ కుమార్ ప్రమాణం చేయించారు. ఈ కార్యక్రమంలో జిల్లా నుంచి టీ బీసీ ఐకాస నాయకులు బండారి విజయ్, సింగం భాస్కర్, కస్తూరి శ్రీమంజరి, సింగం పద్మలత, కె. లక్ష్మణ్, ములస్తం






శివప్రసాద్, ఎం. కృష్ణ మూర్తి, రుద్ర రవి, చిందం మనోహర్, రాచర్ల కృష్ణ, పుప్పాల కిషోర్ కుమార్, టీబీసీ ఐకాస సంక్షేమ, యువజన, ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, మహిళా, విద్యార్థి సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

# తొలగించిన 244 మందిని తిరిగి విధుల్లోకి తీసుకోవాలి

- బీఎస్పీ ప్రెసిడెంట్ ఆర్.ఎస్. ప్రవీణ్ కుమార్ డిమాండ్

**సికింద్రాబాద్ ఏప్రిల్ 18 (ప్రజామంటలు):** కరోనా పాండమిక్ లో ప్రాణాలు తెగించి కోవిడ్ పాజిటివ్ పేషంట్లకు సేవలందించిన గాంధీ ఆసుపత్రిలోని 244 మంది కోవిడ్ -19 పేషంట్ కేర్ ఔట్ సోర్సింగ్ సిబ్బందిని తొలగించడం అన్యాయమని, వెంటనే వారిని విధుల్లోకి తీసుకోవాలని బీఎస్పీ చీఫ్ ఆర్.ఎస్. ప్రవీణ్ కుమార్ డిమాండ్ చేశారు. మంగళవారం హైదరాబాద్ ఇందిరాపార్కు వద్ద ఆర్.ఎస్. ప్రవీణ్ కుమార్ ను ఇటీవల గాంధీ ఆసుపత్రి విధుల్లో నుంచి తొలగించబడిన కోవిడ్ -19 పేషంట్ కేర్ సిబ్బంది కలసి తమ గోడు వెల్లబోసుకున్నారు. 2020 లో కోవిడ్ పేషంట్ కేర్ సిబ్బందిగా తమను ప్రభుత్వం గాంధీలో నియమిం చిందని, అప్పుడు తాము ప్రాణాలను తెగించి పాజిటివ్ పేషంట్లకు సపర్యలు చేశామని, కాని ఇప్పుడెమో ప్రభుత్వం కోవిడ్ లేదంటూ, తమను నిర్దాక్షిణ్యంగా విధుల్లో నుంచి తొలగించడంతో నిరుపేద తమ కుటుంబాలు రోడ్డున పడ్డాయని వారు ప్రవీణ్ కుమార్ తో మొరపెట్టుకున్నారు. వాస్తవానికి గాంధీ ఆసుపత్రిలో ఇప్పటికీ వార్డుల్లో పేషంట్ కేర్ సిబ్బంది కొరత ఉందని, కాని ప్రభుత్వం తమను పట్టించుకోవడం లేదన్నారు. స్పందించిన ప్రవీన్ కుమార్ మాట్లాడుతూ.... మీ సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్ళి, తగిన న్యాయం చేయడానికి కృషి చేస్తానని హామినిచ్చారని పేషంట్ కేర్ సిబ్బంది నందిని మీడియాకు తెలిపారు. హెల్త్



మినిస్టర్ హరీష్ రావు, మరో మంత్రి తలసాని శ్రీనివాస యాదవ్ లను కూడ తాము కలిశామని, కాని వారి నుంచి స్పందన రావడం లేదని నందిని వాపోయారు. కార్యక్రమంలో పేషంట్ కేర్ సిబ్బంది తేజ, నందిని, గణేశ్, స్వప్న, దివ్య, బహుజన సమాజ్ పార్టీ సీనియర్ నాయకులు రొంటాల జయపాల్, ఎస్. వినోద్ కుమార్, రుద్రవరం సునీల్, నరేందర్, పిట్ల బాలరాజ్ పాల్గొన్నారు.

# దేశానికే ఆదర్శం కల్యాణ లక్ష్మి షాదీ ముబారక్

- ఎమ్మెల్యే వొడితల సతీష్ కుమార్

**భీమదేవరపల్లి ఏప్రిల్ 18 (ప్రజామంటలు):** అభివృద్ధి సంక్షేమమే ధ్యేయం అని, దేశానికే ఆదర్శం కల్యాణ లక్ష్మి షాదీ ముబారక్ అని హుస్నాబాద్ ఎమ్మెల్యే వొడితల సతీష్ కుమార్ అన్నారు. మంగళవారం మండలంలోని ఐకెపి కార్యాలయంలో ఎంపీపీ జక్కుల అనిత రమేష్ యాదవ్ అధ్యక్షతన ఏర్పాటుచేసిన చెక్కుల పంపిణీ కార్యక్రమానికి ముఖ్యఅతిథి హాజరై చెక్కుల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సతీష్ కుమార్ మాట్లాడుతూ.... 41 మంది లబ్దిదారులకు 41 లక్షల 4వేల 756 రూపాయల కళ్యాణ లక్ష్మి చెక్కులను, 15 మందికి 5 లక్షల 12 వేల రూపాయల విలువగల ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను ఎమ్మెల్యే వొడితల సతీష్ కుమార్ పంపిణీ చేశారు.ఇ ప్పటివరకు భీమదేవరపల్లి మండలంలో 2070 మంది లబ్ధిదారులకు 12 కోట్ల 82 లక్షల 54 వేల 520 రూపాయల విలువగల కళ్యాణలక్ష్మీ చెక్కులను పంపిణీ చేసినట్లు ఎమ్మెల్యే వొడితల సతీష్ కుమార్ తెలిపారు. ఆడబిడ్డల పెళ్ళిల కోసం రాష్ట్ర ప్రభుత్వం ముఖ్యమంత్రి కేసీఆర్ మేనమామ కట్నం కింద లక్ష 116 రూపాయలు ఇస్తుందని తెలిపారు. దేశంలో ఎక్కడా కూడా లేని విధంగా మన తెలంగాణ రాష్ట్రంలో ఇవ్వడం జరుగుతుందని అన్నారు. అదేవిధంగా రంజాన్



పురస్కరించుకొని ముస్లింలకు నూతన బట్టలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జడ్పీ చైర్మన్ డాక్టర్ సుధీర్ కుమార్, జడ్పిటిసి వంగ రవీందర్, ఎంపీడీవో భాస్కర్, తహసిల్దార్ హరికృష్ణ, కో ఆప్షన్ సభ్యులు శరీఫుద్దీన్, మండల బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు మహేందర్ రెడ్డి, వివిధ గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు లబ్ధిదారులు పాల్గొన్నారు.

# టీ.సెర్ప్ ఆధ్వర్యంలో వరిధాన్యం కొనుగోలు

- ప్రారంబించిన ఎమ్మెల్యే

**చిగురుమామిడి ఏప్రిల్ 18 (ప్రజామంటలు):** చిగురుమామిడి గ్రామంలో టీ సెర్ప్ (ఐకేపీ) ఆధ్వర్యంలో మంగళవారం హుస్నాబాద్ ఎమ్మెల్యే వొడితల సతీష్ కుమార్ చేతుల మీదుగా ప్రారంభించడం జరిగింది. ఎంఎల్ఏ మాట్లాడుతూ నాణ్యమైన వరి ధాన్యాన్ని తీసుకువచ్చి ప్రభుత్వ మద్దతు ధర ఏ గ్రేడ్ 2060, కామన్ ధర 2040 పొందాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో గౌరవ ఎంపీపీ కొత్త వినీత శ్రీనివాసరెడ్డి మరియు జడ్పీటీసీ గీకురు రవీందర్,ప్యాక్స్ చైర్మన్ జంగ వెంకట రమణా రెడ్డి, హుస్నాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ రామోజు రజిత కృష్ణమాచారి మరియు స్థానిక సర్పంచు బెజ్జంకి లక్ష్మణ్, ఏఎంసి డైరెక్టర్లు, జిల్లా, మండల, గ్రామరైతు బంధు సమితి అధ్యక్షులు సాంబారి కొమురయ్య, పెనుకుల తిరుపతి, పన్యాల భూపతి రెడ్డి, వివిధ గ్రామాల ప్రజా ప్రతినిధులు, ఏపీఎం మట్టెల సంపత్, సీసీ లు



సత్యనారాయణ, సంపత్ లు, వి.ఓ. అధ్యక్షులు, వి.ఓ.ఏ. లు, రైతులు, హమాలీలు, మహిళలు పాల్గొన్నారు.

# గాంధీ అసిస్టెంట్ డైరెక్టర్ 'ఫ్లోరెన్స్ మెర్లిన్' కు సత్కారం

**సికింద్రాబాద్ ఏప్రిల్ 18 (ప్రజామంటలు):** గాంధీ ఆసుపత్రి అసిస్టెంట్ డైరెక్టర్ ఫ్లోరెన్స్ మెర్లిన్ ను మంగళవారం టీ.ఎన్.జీ.వో. గాంధీ ఆసుపత్రి యూనిట్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఏడీ మెర్లిన్ జన్మదినాన్ని పురస్కరిం చుకొని గాంధీలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కేకు ను కట్ చేసి, ఏడీ కి శుభాకాంక్షలు తెలిపారు. విధి నిర్వహణలో చక్కటి సేవలందిస్తున్న ఏడీ ఫ్లోరెన్స్ మెర్లిన్ భవిష్యత్ లో మరిన్ని పుట్టిన రోజులు జరుపుకోవాలని టీ.ఎన్.జీ.వో ప్రతినిధులు ఆకాంక్షించారు. కార్యక్రమంలో గాంధీ సూపరిం టెండెంట్ ప్రొ.రాజారావు, ఆర్.ఎం.వో. డా. జయకృష్ణ, హైదరాబాద్ తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ కృష్ణ యాదవ్, గాంధీ యూనిట్ రవీందర్, ఏవో సుభాన్ హుస్సెన్, గాంధీ టీ.ఎన్.జీ.వో ప్రెసిడెంట్ జీ.ప్రభాకర్, సెక్రటరీ కే. యాదిలాల్, వైస్ ప్రెసిడెంట్లు ప్రసన్న ఆనంద్, ఖలీమ్, ట్రెజరర్ శ్రవణ్ కుమార్, జనార్ధన్, విజయలక్ష్మీ, భావన, శేఖర్, శైలజ పాల్గొన్నారు.



# కంటి వెలుగు కేంద్రాన్ని ప్రారంభించిన ఎంపీపీ జక్కుల

**భీమదేవరపల్లి ఏప్రిల్ 18 (ప్రజామంటలు):** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కంటి వెలుగు కేంద్రాన్ని మండలంలోని ధర్మారం గ్రామంలో మంగళవారం ఎంపీపీ జక్కుల అనిత రమేష్ యాదవ్ ప్రారంభించారు. ఈ



సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ గ్రామంలో ప్రతి ఒక్కరూ కంటి పరీక్షలు చేయించుకోవాలని అవసరమైన వారికి అద్దాలను ఉచితంగా ప్రభుత్వం అందజేస్తుందని అన్నారు. ధర్మారం గ్రామంలో కంటి వెలుగు వైద్య పరీక్షలు నిర్వహిం చనున్నట్లు వైద్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ఎల్ భాస్కర్ ,సర్పంచ్ రజిత, గ్రామపంచాయతీ కార్యదర్శి రమణ రెడ్డి ,వార్డు సభ్యులు, వైద్యాధికారి డాక్టర్ ఎం మనోహర్, హెచ్ ఈ ఓ చొల్లేటి రాజేశ్వర్ రెడ్డి కంటి నిపుణురాలు రాజశ్రీ, ఎఎన్ ఎం లు, డిఈఓ బి. రామాంజనేయులు, ఏ. శ్రీకాంత్ రెడ్డి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఎంపీ అరవింద్‌కు నాయి బ్రాహ్మణ సమస్యల వినతి

**జగిత్యాల ఏప్రిల్ 18 (ప్రజామంటలు):** జగిత్యాల నాయిబ్రాహ్మణ సంఘం సభ్యులు నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అరవింద్ ను వారి నివాసంలో మర్యాద పూర్వకంగా కలిసి వారి సమస్యలు తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో



వారితో బీజేపీ నాయకులు డా.భోగ.ప్రవీణ్, నాయిబ్రాహ్మణ సంఘం అధ్యక్షులు రాచర్ల విజయ్, కార్యదర్శి సంగిపెల్లి వేణుమాధవ్, రాచమల్ల శ్రీనివాస్, కొదురుపాక నారాయణ, చిట్యాల కిష్టయ్య, భూపతి, అంజయ్య, మధు, గంగ మల్లయ్య, లక్ష్మణ్, పెండెం చిన్న గంగాధర్, గంగిపెల్లి గణేష్, గంగిపెల్లి శేఖర్, నాయి బ్రాహ్మణ సంఘ సభ్యులు పాల్గొన్నారు.

# ట్రాఫిక్ నిబంధనలు పాటించి ప్రమాదాలు నివారించాలి

**హుజురాబాద్ ఏప్రిల్ 18 (ప్రజామంటలు):** వాహన డ్రైవర్లు ట్రాఫిక్ నిబంధనలు పాటించి ప్రమాదాలు నివారించాలని ట్రాఫిక్ డీఎస్పీ చంద్రభాను అన్నారు. హుజరాబాద్ పోలీసు ఆధ్వర్యంలో రోడ్ సేఫ్టీ పై కోర్స్ డ్రైవర్లు, పౌరులకు




అవగాహన సదస్సును స్థానిక సిటీ సెంట్రల్ హాల్ లో నిర్వహించారు. ఈ సదర్భంగా ఆయన మాట్లాడుతూ డ్రైవర్లు ట్రాఫిక్ నిబంధనలు గురించి అవగాహన కలిగి ఉండాలన్నారు. అవి పాటించకపోవడం వల్లనే ప్రమాదాలు జరుగుతున్నాయని చెప్పారు. ప్రమాదం జరిగినప్పుడు వెంటనే పోలసులకు సమాచారం అందించాలన్నారు.108 అంబులెన్స్ సిబ్బంది రక్షక చర్యలు చేదుతారా న్నారు. సీపీఅర్ పై ప్రతి ఒక్కరు అవగాహన పెంచుకోవాలని సూచించారు. గోల్డెన్ హవర్, ప్లాటినం టెన్ మినిట్స్ గురించి వివరించారు. కార్యక్రమంలో సీఐ లు బొల్లం రమేశ్, జమ్మికుంట సీఐ రమేశ్, యస్ ఐ లు జి.రాజన్న, ఆసిఫ్, యూనస్ అలీ, పోలీసు సిబ్బంది, డ్రైవర్లు, స్థానికులు పాల్గొన్నారు.

# రంజాన్ పండుగ ఏర్పాట్లను పరిశీలించిన మున్సిపల్ చైర్పర్సన్ గందె రాధిక

**హుజురాబాద్ ఏప్రిల్ 18 (ప్రజామంటలు):** రంజాన్ పండుగ సందర్భంగా హుజురాబాద్ ఈద్గాలో సానిటరీ పనులను మరియు పండుగ ఏర్పాట్లను



పరిశీలించిన మున్సిపల్ చెర్పర్సన్ గందె రాధిక అధికారులకు తగు సూచనలు చేసారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ ఎస్ సమ్మయ్య, ఇంజనీర్ సాంబరాజు, టిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు కొలిపాక శ్రీనివాస్, మాజీ ఆప్షన్ మెంబర్స్ ఇమ్రాన్ గఫార్, ముస్లిం నాయకులు, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఉరి వేసుకొని వ్యక్తి ఆత్మహత్య

**కొండగట్టు ఏప్రిల్ 18 (ప్రజామంటలు):** జగిత్యాల జిల్లా కొండగట్టు సమీపంలోని బొజ్జ పోతన ఆలయం సమీపంలో చెట్టుకు ఉరి వేసుకొని వ్యక్తి ఆత్మహత్య. కొడిమ్యాల మండల కేంద్రానికి చెందిన రాజేశంగా గుర్తిపు.. మృతదేహం పూర్తిగా కుల్లి పోయిన స్థితిలో లభ్యం. మృతికి గల పూర్తి వివరాలు, కారణాలు తెలియాల్సి ఉంది.

# ప్రముఖ చిత్రకారుడు బాలి కన్నుమూత

## సంతాపం ప్రకటించిన ప్రముకులు

**విశాఖపట్నం,ఏప్రిల్18(ప్రజామంటలు):**ప్రముఖ చిత్రకారుడు, కార్టూనిస్ట్ బాలి కన్నుమూశారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన సోమవారం విశాఖపట్నంలో తుదిశ్వాస విడిచారు. మంగళవారం వైజాగ్‌లో ఆయన అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. బాలి అసలు పేరు మేడిశెట్టి శంకరరావు. 1941 సెప్టెంబర్ 29న అనకాపల్లిలో జన్మించారు. అక్కడే ఆయన విద్యాభ్యాసం పూర్తయింది. చిన్నతనం నుంచి బాలికి చిత్రలేఖనంపై ఆసక్తి ఉండేది. ఇంటి ముందు వాళ్ల అక్క వేసే ముగ్గులను చూసి డ్రాయింగ్స్ వేయడం మొదలుపెట్టారు. సొంతంగానే చిత్రలేఖనంలో ప్రావీణ్యం సాధించాడు. విద్యాభ్యాసం పూర్తయిన తర్వాత హైదరాబాద్‌లో ఇరిగేషన్ డిపార్ట్‌మెంట్‌లో క్లర్క్‌గా చేరారు. కానీ చిత్రలేఖనంపై మక్కువతో ఆ ఉద్యోగానికి రాజీనామా చేశారు. 1970ల్లో అప్‌కమింగ్ ఆర్టిస్టుల కోసం ఆంధ్రపత్రిక నిర్వహించిన పోటీల్లో వరుసగా మూడుసార్లు బహుమతి గెలుచుకున్నారు. 1974లో ఈనాడు న్యూస్ పేపర్‌లో విశాఖపట్నం ఎడిషన్‌లో కార్టూనిస్ట్‌గా చేరారు. 1976లో ఆంధ్రజ్యోతి వారపత్రికలో స్టాఫ్ ఆర్టిస్ట్‌గా చేరిన తర్వాత ఆయన కెరీర్ ఊపందుకుంది. ఆయనలోని ప్రతిభను చూసిన అప్పటి ఆంధ్రజ్యోతి ఎడిటర్ పురాణం సుబ్రహ్మణ్య శర్మ.. మేడిశెట్టి శంకరరావు పేరును బాలిగా మార్చారు. ఆ సమయంలోనే వేలాది కథలకు బొమ్మలను గీశారు. నవలలకు ముఖ చిత్రాలు వేశారు.

# హీట్ స్ట్రోక్ మరణాలపై సిట్టింగ్ జడ్జితో విచార

## సిఎం ఏక్‌నాథ్ షిండేకు అజిత్ పవార్ లేఖ

**ముంబై,ఏప్రిల్18(ప్రజామంటలు):**మహారాష్ట్ర భూషణ్ అవార్డును ప్రదానం చేసే కార్యక్రమంలో 13 మంది హీట్ స్ట్రోక్‌తో మరణించడంపై ఎన్‌సీపీ నేత అజిత్ పవార్, సీఎం ఏక్‌నాథ్ షిండేకు లేఖ రాశారు. ఈ ఘటనపై రిటైర్డ్ జడ్జితో విచారణ జరిపించాలని, బాధ్యులపై హత్యానేరం కింద కేసు నమోదు చేయాలని లేఖలో డిమాండ్ చేశారు. మరణించిన వారి బంధువులకు రూ.20 లక్షలు, బాధితులకు ఉచిత చికిత్సతోపాటు రూ.5 లక్షలు ఇవ్వాలని లేఖలో పేర్కొన్నారు. నవీ ముంబైలోని శాటిలైట్ టౌన్‌సిప్‌లోని ఖార్ఘర్‌లోని కార్పొరేట్ పార్క్‌లో ఇటీవల మహారాష్ట్ర భూషణ్ అవార్డు కార్యక్రమం జరిగింది. కేంద్ర హోం మంత్రి అమిత్ షా అధ్యక్షత వహించిన ఈ ఈవెంట్ కు హాజరైన వారిలో 13మంది వడదెబ్బకు గురై చనిపోయారు. మరో 600పైగా మంది ఆస్పత్రి పాలయ్యారు. దీంతో అస్వస్థతకు గురైన వారికి పిఎం రిలీఫ్ ఫండ్ నుంచి రూ. 2,50,000 ఎక్స్‌గ్రేషియాను అందజేస్తామని ప్రధాని మోడీ ప్రకటించారు. ఈ ఘటనపై పలు రాజకీయ పార్టీల నేతలు మండిపడ్డారు. శివసేన(యుబీటీ) అధినేత, మాజీ ముఖ్యమంత్రి ఉద్ధవ్ థాక్రే తప్పెక్కడ జరిగింది తెలియాలన్నారు. 'ఇది పూర్తిగా నిర్లక్ష్యంగా కారణంగా జరిగిందే' అని ప్రతిపక్ష నాయకుడు అజిత్ పవార్ అన్నారు. ముఖ్యమంత్రి షిండే రాజీనామా చేయాలని ఆప్ జాతీయ కార్యనిర్వాహక సభ్యురాలు ప్రీతి శర్మ డిమాండ్ చేశారు. ప్రజలను ఎండలో కూర్చొబెట్టి ఇబ్బందికి గురిచేయడాన్ని శివసేన(యుబీటీ) రాజ్యసభ సభ్యురాలు ప్రియాంక చతుర్వేది విమర్శించారు.

# జగనన్న కాలనీ ఇళ్లు పూర్తి చేస్తాం

## అధికారులతో మంత్రి జోగు రమేశ్ సమిక్ష

**ఏలూరు,ఏప్రిల్18(ప్రజామంటలు):** ఏలూరు రూరల్ పోణంగి జగనన్న కాలనీలో గృహ నిర్మాణాలను మంత్రి జోగి రమేష్, యంయల్ఏ ఆళ్ల నాని పరిశీలించారు. ఏలూరు కలెక్టరేట్‌లో జగనన్న ఇళ్ల నిర్మాణం పురోగతిపై



అధికారులతో మంత్రి జోగి రమేష్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జోగి రమేష్ మాట్లాడుతూ.. జగనన్న కాలనీల్లో అన్ని ఇళ్లను పూర్తి చేస్తామన్నారు. ప్రతి పేద అక్క చెల్లెమ్మలకు ఇంటి నిర్మాణం పూర్తి చేసి ఇవ్వడమే జగనన్న లక్ష్యమన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 22లక్షల ఇళ్లు పూర్తి చేస్తామన్నారు. టీడీపీ అధినేత చంద్రబాబు కావాలనే జగనన్న కాలనీలపై విమర్శలు చేస్తున్నాడన్నారు. చంద్రబాబు హయాంలో ఒక్క సెంటు భూమి కూడా ఇవ్వలేదుని జోగి రమేష్ విమర్శించారు. అనంతరం ఆళ్ల నాని మాట్లాడుతూ.. చంద్రబాబు పాలనలో టిడ్కో ఇళ్ల నిర్మాణం పేరుతో డబ్బులు వసూలు చేశారన్నారు. టిడ్కో ఇళ్ల కోసం లబ్ధిదారులు కట్టిన డబ్బులు తిరిగి ఇచ్చేస్తామన్నారు. టిడ్కో లబ్దిదారులకు ఇళ్ల స్థలాలు ఇచ్చి ఇళ్లు నిర్మిస్తామన్నారు.

# మార్గదర్శి డిపాజిట్లు బయటపెట్టాల్సిందే

## సుప్రీకోర్టు కీలక వ్యాఖ్య

**న్యూఢిల్లీ,ఏప్రిల్18(ప్రజామంటలు):** మార్గదర్శి కేసులో సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. డిపాజిట్ల వివరాలు బయటపెట్టాలని సుప్రీం ఆదేశించింది. మార్గదర్శిలో ఇన్వెస్ట్‌మెంట్ ఎంత? చెల్లింపులు ఎంత? అనే వివరాలు బయట పెట్టడంలో రహస్యం ఎందుకని ప్రశ్నించింది. మార్గదర్శి ÷నాన్షియర్స్ కేసుపై జస్టిస్ సూర్య కుమార్, జస్టిస్ జె.బి.పర్దీవాలా ధర్మాసనం మంగళవారం విచారణ చేపట్టింది. ఒక వైపు హెచ్‌యుఎఫ్, మరో వైపు ప్రొప్రైటరీ కన్సర్న్ అంటున్నారు. దీంతో డిపాజిటర్లందరికీ చెల్లింపులు చేశామని మార్గదర్శి లాయర్ తెలపగా, చెల్లింపులు చేశాక వివరాలు బయటపెట్టడంలో అభ్యంతరం ఏంటని మాజీ ఎంపీ ఉండవల్లి వాదనతో సుప్రీంకోర్టు ఏకీభవించింది.

# ముగిసిన టెన్త్ పరీక్షలు

## నేటినుంచి మూల్యాంకనం

**అమరావతి,ఏప్రిల్18(ప్రజామంటలు):** ఆంధ్రప్రదేశ్ పదో తరగతి పబ్లిక్ పరీక్షలు-2023 మంగళవారంతో ముగిశాయి. ఎంతమాత్రం ఆలస్యం చేయకుండా జవాబు పత్రాల మూల్యాంకనం బుధవారం నుంచి ప్రారంభం కానుంది. దీంతో పదో తరగతి పరీక్షల మూల్యాంకనం ఏప్రిల్ 19 నుంచి ప్రారంభమవుతుందని.. ఉత్తర్వులు అందుకున్న అందరూ విధులకు తప్పక హాజరు కావాలని డీఈవో పి శైలజ ఓ ప్రకటనలో తెలిపారు. ఉపవిద్యాశాఖాధికారులు, మండల విద్యాశాఖాధికారులు, ప్రధానోపాధ్యాయులు తగు చర్యలు తీసుకోవాలన్నారు. మూల్యాంకన విధులకు గైర్హాజరైన ఉపాధ్యాయులపై నిబంధనల ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ÷ూగా ఈ ఏడాది రాష్ట్ర వ్యాప్తంగా 3,349 కేంద్రాల్లో 6.64లక్షల మంది విద్యార్థులు పదో తరగతి పరీక్షలకు హాజరయ్యారు. 'పది' మూల్యాంకనం ఈ నెల19 నుంచి 26వ తేదీ వరకు జరగనుంది. రాష్ట్రంలోని 23 జిల్లాల్లో ఏర్పాటు చేసిన స్పాట్ వాల్యుయేషన్ కేంద్రాల్లో దాదాపు 30 నుంచి 35 వేల మంది ఉపాధ్యాయులు మూల్యాంకనంలో పాల్గొననున్నారు. ఫలితాలను మే రెండో వారంలో విడుదల చేసేందుకు ప్రణాళిక రూపొందిస్తున్నట్లు రాష్ట్ర ప్రభుత్వ పరీక్షల విభాగం డైరెక్టర్ డి దేవానందరెడ్డి ఇప్పటికే స్పష్టం చేసిన సంగతి విధితమే.

# జగన్ ఆదర్శంగా ఎమ్మెల్యే ఆళ్ల దోపిడీ

- యధేచ్ఛగా మైనింగ్ మాఫియా కార్యక్రమాలు
- ఉండవల్లి కొండను మాయం చేస్తున్న అక్రమార్కులపై చర్య తీసుకోవాలి
- గొర్రెల కాపరులకు అండగా ఉంటామని లోకేశ్ హామీ
- దేవనకొండలో కొనసాగిన యువగళం యాత్ర

**కర్నూలు,ఏప్రిల్18(ప్రజామంటలు):** సహజ వనరుల దోపిడీలో సీఎం జగన్ రెడ్డిని మంగళగిరి ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణా రెడ్డి ఆదర్శంగా తీసుకున్నారని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ అన్నారు. ముఖ్యమంత్రి ఇంటికి కూత వేటు దూరంలో ఆళ్ల మైనింగ్ మాఫియా యధేచ్ఛగా అక్రమాలకు పాల్పడుతుందన్నారు. ఉండవల్లి కొండను మాయం చేస్తున్న అక్రమార్కులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మంగళవారం కర్నూలు జిల్లాలోని దేవనకొండలో యువగళం పాదయాత్ర కొనసాగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగన్మోహన్ రెడ్డి రుషికొండకు గుండు కొడితే.. ఆళ్ల రామకృష్ణారెడ్డి ఏకంగా ఉండవల్లి కొండ ను మింగేశారని అన్నారు. ఆళ్ల రామకృష్ణారెడ్డి మైనింగ్ మాఫియా బెదిరింపులకు భయపడకుండా పోరాడి కొండపై జరుగుతున్న గ్రావెల్ లూటీని బయటపెట్టిన మంగళగిరి టీడీపీ నాయకులు, కార్యకర్తల్ని నారా లోకేష్ అభినందించారు.




ఇదిలావుంటే టీడీపీ యువనేత నారా లోకేష్ యువగళం పాదయాత్రకు జనం నీరాజనాలు పలుకుతున్నారు. ఎక్కడికక్కడ ప్రజలు పెద్ద ఎత్తున లోకేష్ పాదయాత్రకు తరలివస్తున్నారు. యువనేతకు తమ సమస్యలు చెప్పుకుంటున్నారు. పాదయాత్ర చేస్తున్న లోకేష్‌కు మహిళలు హారతులు పడుతూ స్వాగతం పలుకుతున్నారు. జగన్ ప్రభుత్వంలో తాము పడుతున్న బాధలను ప్రజలు లోకేష్‌కు వివరిస్తున్నారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత అందరి సమస్యలు తీర్చుతామంటూ లోకేష్ పాదయాత్రలో హామీలు ఇస్తున్నారు. మంగళవారం ఉదయం పల్లెదొడ్డి క్యాంప్ సైట్ నుంచి 74వ రోజు యువగళం పాదయాత్రను నారా లోకేష్ ప్రారంభించారు. పాదయాత్రలో భాగంగా గ్రామంలో మహిళా రైతు నాగమ్మ నిర్వహిస్తున్న గొర్రెల ఫామ్‌ను పరిశీలించారు. రైతు నాగమ్మ, భర్త కృష్ణన్న గౌడ్‌తో మాట్లాడి గొర్రెల పెంపకంలో వారు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రెండేళ్లుగా షెడ్ ఏర్పాటు చేసుకొని గొర్రెల ఫామ్ నిర్వహిస్తున్నామని, షెడ్ నిర్మాణానికి రెండున్నర లక్షల ఖర్చు అయ్యిందని తెలిపారు. మొదటి ఏడాది 50 గొర్రెలతో ఫామ్ ప్రారంభించామని చెప్పారు. రెండేళ్లలో రెండు లక్షల నష్టం రావడంతో ప్రస్తుతం 30 గొర్రెలు మాత్రమే పెంచుతున్నామని మహిళా రైతు తెలిపారు. ఏడాదికి మేత, దాణా, మందులు, ఇతర ఖర్చులు సుమారుగా రెండు లక్షలు అవుతుందని అన్నారు. ఇంత కష్టం చేస్తే రోజు కూలీ మాత్రమే మిగులుతుందని వాపోయారు. ప్రభుత్వం నుంచి షెడ్ నిర్మాణం, మేత, దాణా, మందులు కొనడానికి ఎటువంటి సహాయం, సబ్సిడీలు రావడం లేదు అంటూ మహిళా రైతు నాగమ్మ కన్నీరు పెట్టుకున్నారు. మహిళా రైతు సమస్యలు విన్న లోకేష్ వారికి అభయమిచ్చారు. అధైర్య పడొద్దు అంటూ నాగమ్మకు ధైర్యం చెప్పారు. అవగాహన లేని ముఖ్యమంత్రి రాష్ట్రానికి ఎంత ప్రమాదమో కళ్లారా చూస్తున్నానన్నారు. గొర్రెల పెంపకం కోసం టీడీపీ పాలనలో అనేక చర్యలు తీసుకున్నామన్నారు. గొర్రెలు కొనడానికి సబ్సిడీ రుణాలు అందించామని... మేత, దాణా, మందులు అన్ని సబ్సిడీ ధరకి అందించామని గుర్తుచేశారు. ఇప్పుడు జగన్ ప్రభుత్వం గొర్రెల పెంపకానికి ఎటువంటి ప్రోత్సాహం ఇవ్వడం లేదన్నారు. టీడీపీ హయాంలో షెడ్ల నిర్మాణానికి సబ్సిడీ రుణాలు అందించామని తెలిపారు. ఉపాధి హామీ పథకాన్ని అనుసంధానం చేసి మినీ గోకులంలు ఏర్పాటు చేశామని చెప్పారు. కనీసం గొర్రెల పెంపకం కోసం తాగునీరు అందించలేని పరిస్థితి నెలకొందన్నారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే సబ్సిడీతో షెడ్ల నిర్మాణం కోసం రుణాలు అందించి గొర్రెల ఫామ్ నిర్వహణకు సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. మందులు, ఫీడ్ అన్ని తక్కువ ధరకు అందించి గొర్రెల పెంపకంలో రైతులకి లాభం వచ్చేలా చేస్తాం అంటూ లోకేశ్ ధైర్యం చెప్పారు.

# శ్రీవారి భక్తులకు శుభవార్త

- ఆర్జిత సేవల క్యాలెండర్‌ను ప్రకటించిన టిటిడి

**తిరుమల,ఏప్రిల్18(ప్రజామంటలు):** కలియుగ ప్రత్యక్ష దైవం వేంకటేశ్వరస్వామి భక్తులకు తిరుమల తిరుపతి దేవస్థానం శుభవార్త చెప్పింది. ఆర్జిత సేవలు, ఎలక్ట్రానిక్ డిప్, ప్రత్యేక ప్రవేశ దర్శనం, వసతి గదుల కోటా విడుదలకు సంబంధించిన షెడ్యూల్‌ను ప్రకటించింది. ఇంతకు ముందు ఆయా సేవలకు సంబంధించి ఎప్పుడు విడుదల చేయనున్నదో.. ఆయా తేదీలను వేర్వేరుగా ప్రకటించేది. తాజాగా ఒకేసారి క్యాలెండర్‌ను ప్రకటించింది. ఈ మేరకు భక్తులు ఆన్‌లైన్‌లో టికెట్లను బుక్ చేసుకొని.. సహకరించాలని విజ్ఞప్తి చేసింది.



**ఎలక్ట్రిక్ డిప్ :** జూలై మాసానికి సంబంధించి ఆర్జిత సేవా టికెట్ల కోటాను ఏప్రిల్ 20వ తేదీ ఉదయం 10 గంటల నుంచి అందుబాటులోకి తీసుకురానున్నట్లు తెలిపింది. రిజిస్ట్రేషన్ 22న ఉదయం 10 గంటల వరకు అందుబాటులో ఉంటుందని పేర్కొంది. అదే రోజు మధ్యాహ్నం 12గంటలకు డిప్ అలాట్‌మెంట్‌ను ప్రకటించ నున్నట్లు పేర్కొంది. జూలై మాసానికి సంబంధించిన కల్యాణం, ఊంజల్ సేవ, ఆర్జిత బ్రహ్మోత్సవం, సహస్ర దీపాలంకరణ సహా తదితర ఆర్జిత సేవా టికెట్ల కోటాను ఈ నెల 20న ఉదయం 11.30 గంటలకు ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంచనున్నట్లు టీటీడీ తెలిపింది. అదే రోజు మధ్యాహ్నం 3 గంటలకు శ్రీవాణి ట్రస్ట్ టికెట్లు విడుదల చేయనున్నట్లు చెప్పింది. జూలై నెలకు సంబంధించిన అంగ ప్రదక్షిణం టోకెన్లను ఈ నెల 21న ఉదయం 10 గంటలకు విడుదల చేయనున్నట్లు చెప్పింది. అదే రోజు మధ్యాహ్నం 3 గంటలకు దివ్యాంగులు, వృద్ధులకు సంబంధించిన ప్రత్యేక ప్రవేశ దర్శనం కోటాను ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంచనున్నట్లు చెప్పింది. వర్చువల్ సేవలు : మే, జూన్ మాసాలకు సంబంధించి వర్చువల్ కల్యాణోత్సవం, ఊంజల్ సేవ, ఆర్జిత బ్రహ్మోత్సవం, సహస్ర దీపాలంకరణ సేవల టికెట్ల కోటాను 24న ఉదయం 10 గంటలకు, మధ్యాహ్నం 3 గంటలకు విడుదల చేయనున్నట్లు తెలిపింది.

**ప్రత్యేక ప్రవేశ దర్శనం :** మే మాసానికి సంబంధించిన ప్రత్యేక ప్రవేశ దర్శనం టికెట్ల కోటాను 25న ఉదయం 10 గంటలకు విడుదల చేయనున్నట్లు టీటీడీ తెలిపింది. మే నెలకు సంబంధించి తిరుమలలో వసతి గదుల కోటాను ఈ నెల 26న ఉదయం 10 గంటలకు విడుదల చేయనున్నట్లు టీడీపీ వెల్లడించింది. 27న తిరుపతిలోని వసతి గదుల కోటాను విడుదల చేయనున్నట్లు తిరుమల తిరుపతి దేవస్థానం వివరించింది.

# చురుకుగా గంగా ఎక్స్‌ప్రస్ వే పనులు

- కుంభమేళా కంటే ముందే పూర్తి చేస్తాం
- ఇక పారిశ్రామిక వేత్తలను ఎవరూ బెదరించలేరు
- యూపి సిఎం యోగి ఆదిత్యనాథ్ వెల్లడి

**లక్నో,ఏప్రిల్18(ప్రజామంటలు):** గంగా ఎక్స్‌ప్రెస్‌వే పనులు కొనసాగుతున్నాయని యూపి సిఎం యోగి ఆదిత్యనాథ్ అన్నారు. యూపీలో జరుగుతున్న అభివృద్ధి పనులపై సీఎం యోగి మాట్లాడుతూ.. 2025 కుంభమేళా కంటే ముందే పూర్తి చేసేందుకు ప్రయత్నిస్తున్నామని చెప్పారు. పారిశ్రామికవేత్తలు, వ్యాపారులకు అన్ని సౌకర్యాలు కల్పించేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోందన్నారు. ఉత్తరప్రదేశ్ ఇప్పుడు 4-లేన్ ఇంటర్‌స్టేట్ కనెక్టివిటీని కలిగి ఉందని యోగి తెలిపారు. బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ పరిస్థితి మారిందని, ఇప్పుడు అన్ని జిల్లాలకు 24/7 విద్యుత్ సరఫరా చేస్తున్నామని చెప్పారు. రైల్వే కారిడార్ ఉత్తరప్రదేశ్ గుండా వెళుతుండగా, రాష్ట్రం నుంచి ఎగుమతులు లక్ష 75 వేల లక్షల కోట్లకు పెరిగాయని సీఎం యోగి తెలిపారు. గగోరఖ్‌పూర్‌లో బాటిలింగ్ ప్లాంట్‌కు భూమి పూజ చేసిన అనంతరం ప్రజలనుద్దేశించి యోగి ఆదిత్యనాథ్ మాట్లాడుతూ.. గతంలో శాంతి భద్రతలను గౌరవించని వారు ఇప్పుడు ప్రాణాల కోసం పరిగెడుతున్నారంటూ.. దీనిని ప్రజలు గమనిస్తున్నారని అన్నారు. వారికి కోర్టులు శిక్ష విధిస్తున్నప్పుడు, గ్యాంగ్‌స్టర్ల ప్యాంట్లు తడిసిపోతున్నాయని సీఎం వ్యాఖ్యానించారు. ఆరేళ్ల క్రితం వరకు మాఫియా ప్రజలను భయభ్రాంతులకు గురిచేసేదని, పారిశ్రామికవేత్తలను బెదిరించడం, వ్యాపారవేత్తలను అపహరించడం చేసేవారని ఆయన గుర్తుచేశారు. గ్యాంగ్‌స్టర్లు ఇప్పుడు ప్యాంట్లు తడుపుకుంటున్నారని వ్యాఖ్యానించారు. ఒకప్పుడు మాఫియా ప్రజలను భయభ్రాంతులకు గురిచేసేదని, పారిశ్రామికవేత్తలను బెదిరించడం, వ్యాపారవేత్తలను అపహరించడం చేసేవారని ఆయన గుర్తుచేశారు. ఉత్తరప్రదేశ్‌లో శాంతి భద్రతలకు సంబంధించి సీఎం యోగి ఆదిత్యనాథ్ కీలక వ్యాఖ్యలు చేశారు. దోపిడీలు, బెదిరింపులతో ప్రజలను భయభ్రాంతులకు గురిచేసిన గ్యాంగ్‌స్టర్లు ఇప్పుడు ప్యాంట్లు తడుపుకుంటున్నారని వ్యాఖ్యానించారు. 2006లో ఉమేష్ పాల్ కిడ్నాప్ కేసులో గ్యాంగ్‌స్టార్ అతిక్ అహ్మద్ మరో ఇద్దరిని దోషులుగా నిర్ధారించి.. వారికి యావజ్జీవ కారాగార శిక్ష విధించిన నేపథ్యంలో సీఎం వ్యాఖ్యలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి.



అహ్మద్‌పై వందకు పైగా కేసులు నమోదైన నేపథ్యంలో అతనికి ఇదే తొలి శిక్ష అన్నారు. 60 ఏళ్ల అతిక్ అహ్మద్‌ను గుజరాత్‌లోని సబర్మతి జైలు నుంచి రోడ్డు మార్గంలో ప్రయాగ్‌రాజ్‌కు తీసుకొచ్చారు యూపీ పోలీసులు. అత్యంత కట్టుదిట్టమైన భద్రత నేపథ్యంలో.. పోలీసులు తనను ఎన్‌కౌంటర్ చేస్తారని అతను ఆరోపించాడు. ఉత్తరప్రదేశ్‌లో ఏ మాఫియా, గ్యాంగ్‌స్టర్‌ల గురించి భయపడాల్సిన అవసరం లేదని, ఇకపై ఏ పారిశ్రామికవేత్తను ఫోన్‌లో బెదిరించలేరని అన్నారు. 2014కు ముందు రాష్ట్రంలో శాంతిభద్రతలు అస్తవ్యస్తంగా ఉండేవంటూ.. గతంలో హింసాత్మక సంఘటనలు నిత్యం ఎక్కడొకచోట జరిగి అల్లర్లు చెలరేగేవని యూపీ సీఎం యోగి అన్నారు. 2017 నుంచి 2023 మధ్య ఉత్తరప్రదేశ్‌లో ఒక్క అల్లర్ల ఘటన కూడా జరగలేదన్నారు.

# ముంబైలో తొలి యాపిల్ స్టోర్

**ముంబై,ఏప్రిల్18(ప్రజామంటలు):**భారత్‌లో యాపిల్ తొలి రిటైల్ స్టోర్ ప్రారంభమైంది. దేశ ఆర్థిక రాజధాని ముంబైలోని బాంద్రా కూర్ల కాంప్లెక్స్‌లో 'యాపిల్ బీకేసీ' పేరిట ఈ స్టోర్‌ను ప్రారంభించారు. యాపిల్ సీఈఓ టిమ్ కుక్ స్వయంగా స్టోర్ తలుపులు తెరిచి కస్టమర్లను ఆహ్వానించారు. ఈ స్టోర్‌లో యాపిల్ ఉత్పత్తులన్నింటినీ కొనుగోలు చేయొచ్చు. ఇండియాలో తన బిజినెస్ కార్యాకలాపాలను శరవేగంగా విస్తరించే ప్రణాళికలో భాగంగా యాపిల్.. రిటైల్ స్టోర్లను అందుబాటులోకి తీసుకువస్తోంది. ఈ నెల 20న ఢిల్లీలో రెండో యాపిల్ స్టోర్‌ను తెరిచేందుకు అన్ని ఏర్పాట్లు చేసుకుంది. 'యాపిల్ సాకేత్' పేరుతో ఢిల్లీలో రెండో యాపిల్ రిటైల్ స్టోర్ తెరవనుంది. ఇక ముంబైలో యాపిల్ రిటైల్ స్టోర్ అందుబాటులోకి రావడంతో స్టోర్‌ను చూడటానికి, అందులోని ఉత్పత్తులను కొనగోలు చేసేందుకు యాపిల్ అభిమానులు 'యాపిల్ బీకేసీ' స్టోర్ ముందు



బారులు తీరారు. అయితే, ఓ అభిమాన మాత్రం ఏకంగా టిమ్ కుక్‌నే సర్‌ప్రైజ్ చేశాడు. 1984లో అందుబాటులోకి తెచ్చి మొదటి యాపిల్ కంప్యూటర్ వెర్షన్ మాకింతోష్ కంప్యూటర్‌ను తీసుకువచ్చాడు. అది చూసిన యాపిల్ బాస్ ఆ కస్టమర్‌ను అప్యాయంగా హత్తుకున్నారు. అభిమాని తెచ్చిన ఆ కంప్యూటర్‌ను చూస్తూ 'వావ్' అంటూ సంభ్రమాశ్చర్యాలకు గురయ్యారు. నేను తొలిసారి 1984 యాపిల్ కంప్యూటర్ కొనుగోలు చేశాను. అప్పటి నుంచి యాపిల్ ఉత్పత్తులనే వాడుతున్నాను. ఇదిగో దీని డిస్కోస్టోరేజ్ కెపాసిటీ 2 మెగాబైట్స్. బ్లాక్ అండ్ వైట్ కలర్ వేరియంట్స్‌లో ఉంది. ఇప్పుడు ఇదే కంప్యూటర్‌ను యాపిల్ 4కే, 8కే రిజల్యూషన్ డిస్‌ప్లేలను తయారు చేస్తోంది' అని ఆ అభిమాని చెప్పుకొచ్చారు. ఇక యాపిల్ ఫ్యాన్ తన వెంట తీసుకొచ్చిన యాపిల్ పాత కంప్యూటర్‌ను టిమ్ కుక్‌కు చూపించడం.. ఆ కంప్యూటర్‌ను చూసి ఆయన ఆశ్చర్యం వ్యక్తం చేసిన వీడియో, ఫొటోలు ప్రస్తుతం నెట్టింట వైరల్ అవుతున్నాయి. దీంతో సినిమా, క్రికెట్ స్టార్లకే కాదు ఎలక్ట్రానిక్స్ వస్తువులకు ఫ్యాన్స్ ఉంటారని నెటిజన్లు కామెంట్స్ చేస్తున్నారు.

# క్రియాశీలక రాజకీయాల్లో రఘువీరా

**శ్రీ సత్యసాయి,ఏప్రిల్18(ప్రజామంటలు):** మాజీ ఏపీసీసీ అధ్యక్షుడు ఎన్ రఘువీరారెడ్డి క్రియాశీల రాజకీయాల్లోకి రానున్నారు. గత కొన్ని సంవత్సరాలుగా రాజకీయ కార్యక్రమాలకు రఘువీరా దూరంగా ఉన్న విషయం తెలిసిందే. కర్ణాటక ఎన్నికల నేపథ్యంలో కీలక బాధ్యతలను రఘువీరాకు అప్పగించినట్టుగా తెలుస్తోంది. బెంగళూరు సిటీ ఎన్నికల ఇన్చార్జిగా రఘువీరారెడ్డి నియమితులైనట్టు సమాచారం. అత్యంత సన్నిహితులు, కాంగ్రెస్ పార్టీ నేతలతో మడకశిరలో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా రఘువీరా మాట్లాడుతూ.. పదిహేను, ఇరవై రోజులుగా మనసు కలచివేసిందన్నారు. ప్రధాని మోదీని ఉద్దేశించి రాహుల్



గాంధీ ఎలాంటి అన్ పార్లమెంటరీ లాంగ్వేజ్ కానీ.. అసభ్యకర వ్యాఖ్యలు కానీ చేయలేదన్నారు. మోదీ అనే పేరు ఉన్న వారందరూ దొంగలని రాహుల్ గాంధీ ఎక్కడ అనలేదన్నారు. పెద్ద పెద్ద దొంగలకి మోదీ అనే పేరు ఉందని మాత్రమే అన్నారని రఘువీరా పేర్కొన్నారు. కొందరు ఆ వ్యాఖ్యలను తప్పుదోవ పట్టించి వక్రీకరించారన్నారు. ఆగ మేఘాల మీద 24 గంటల్లోనే రాహుల్ గాంధీ పార్లమెంటు సభ్యత్వాన్ని రద్దు చేశారన్నారు. కోర్టులో శిక్ష పడి మూడు, నాలుగు సంవత్సరాలయిన వాళ్లు ఎంపీ, ఎమ్మెల్యేలు గానీ కొనసాగుతున్నారన్నారు. వాళ్ల పార్లమెంటు అసెంబ్లీ సభ్యత్వాన్ని రద్దు చేయకుండా ఒక్క రాహుల్ గాంధీకి మాత్రమే నిబంధనలు వర్తిస్తాయా? అని ప్రశ్నించారు. పార్లమెంట్ సభ్యత్వం రద్దు అయిన సాయంత్రానికే రాహుల్ గాంధీ ఇల్లు ఖాళీ చేయించారని.. ఈ బాధను తట్టుకోలేకపోతున్నానని రఘువీరా పేర్కొన్నారు.

# బ్యూటీ పార్లర్‌లో హత్య కలకలం

**చిత్తూరు,ఏప్రిల్18(ప్రజామంటలు):** వేలూరు రోడ్డులోని కొండమిట్ట ప్రాంతంలో ఓ బ్యూటీ పార్లర్ లో జరిగిన హత్య కలకలం రేపుతోంది. దుర్గా ప్రశాంతి అనే యువతి మృతి చెందగా.. చక్రవర్తి అనే యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి. అతని పరిస్థితి విషమంగా ఉంది. ప్రాణాలతో కొట్టుమిట్టాడుతున్నాడు. దీంతో ఆ యువకుడిని చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఆరు మాసాల నుంచి యువతి బ్యూటీ పార్లర్ నడుపుతోంది. లోపల ఏం జరిగిందో తెలియదు. కానీ కత్తులతో దాడి చేసిన పరిస్థితి కనిపించింది. బయట వ్యక్తులు వచ్చి దాడి చేసారా? లేదా లోపలే ఇద్దరు.. యువతి, యువకుడు ఒకరిపై మరొకరు దాడి చేసుకున్న ఘటనలో యువతి మృతి చెందిందా? అన్న అనుమానాలు కలుగుతున్నాయి. కాగా యువతి, యువకుడు ఇద్దరు ప్రేమించుకుంటున్నట్లుగా సమాచారం. మృతి చెందిన యువతి ఓ హెడ్ కానిస్టేబుల్ కుమార్తె. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన ప్రదేశానికి చేరుకుని పోస్టుమార్టం నిమిత్తం యువతి మృత దేహాన్ని ఆస్పత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. పూర్తి సమాచారం అందవలసి ఉంది.

# నామినేషన్ దాఖలు చేసిన డికె శివకుమార్

**బెంగళూరు,ఏప్రిల్18(ప్రజామంటలు):** కర్ణాటక కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు డీకే శివకుమార్ తన ఆస్తుల వివరాలు వెల్లడించారు. అసెంబ్లీ ఎన్నికల కోసం కనకపుర నియోజకవర్గం నుంచి నామినేషన్ దాఖలు చేసిన డీకే.. ఎన్నికల అఫిడవిట్‌లో తనకు ఆస్తుల విలువ రూ.1,214 కోట్లుగా పేర్కొన్నారు. దాంతో కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ తరఫున పోటీపడుతున్న అభ్యర్థులందరిలో ఆయనే టాప్ ప్లేస్‌లో నిలిచారు. కాగా, 2018 అసెంబ్లీ ఎన్నికలప్పుడు సమర్పించిన అఫిడవిట్‌లో డీకే తన ఆస్తుల విలువను రూ.721.56 కోట్లుగా పేర్కొన్నారు. అంటే అప్పటికీ, ఇప్పటికీ ఆయన ఆస్తుల విలువ 68 శాతం పెరిగింది. ఇక తాజా అఫిడవిట్‌లో తెలిపిన రూ.1,214 కోట్ల ఆస్తుల్లో.. స్థిరాస్తుల విలువ రూ.970.01 కోట్లుగా డీకే వెల్లడించారు. చరాస్తులు రూ.244.93 కోట్లుగా తెలిపారు. అదేవిధంగా తనకు ఉన్న అప్పుల వివరాలను కూడా డీకే ఎన్నికల అఫిడవిట్‌లో వెల్లడించారు. లోన్‌లు, ఇతర రుణాలు కలిపి ఆయనకు మొత్తం రూ.244.93 కోట్ల అప్పులు ఉన్నట్లు తెలిపారు. అదేవిధంగా మరో రూ.227.20 కోట్ల వివాదాస్పద రుణాలు కూడా ఉన్నట్లు డీకే పేర్కొన్నారు. కాగా, కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ వచ్చే నెల 10న జరగనుంది. వచ్చే నెల 13న ఫలితాలను వెల్లడించనున్నారు.

## ప్రభాస్ ఆదిపురుష్ కోసం
# అభిమానుల ఎదురుచూపు

### వాలి,సుగ్రీవుల మధ్య పోరాట సన్నివేశాల గ్రాఫిక్స్ సూపర్



ప్రభాస్ మోషన్ గ్రాఫిక్స్ మూవీ ఆదిపురుష్ కోసం దేశ వ్యాప్తంగా ఉన్న సినీ ప్రేమికులతో పాటు ప్రపంచ వ్యాప్తంగా ఉన్న ఇండియన్ ప్రేక్షకులు ఎదురు చూస్తున్నారు. ఇండియన్ సినీ చరిత్రలో అతి పెద్ద మోషన్ గ్రాఫిక్స్ మూవీగా ఆదిపురుష్ రికార్డ్ ను దక్కించుకోబోతుంది. అద్భుతమైన విజువల్స్ ను ఈ సినిమాలో చూపించబోతున్నట్లుగా దర్శకుడు ఓమ్ రౌత్ చెప్పుకొచ్చాడు. తాజాగా ఈ సినిమా గురించి సోషల్ మీడియాలో ప్రచారం జరుగుతున్న ఒక అప్డేట్ సినిమాపై అంచనాలు పెంచుతున్నాయి. ఈ చిత్రంలోని వాలి - సుగ్రీవుల మధ్య పోరాట సన్నివేశం ఉంటుందట. ఆ సన్నివేశం లో గ్రాఫిక్స్ అద్భుతంగా వచ్చాయని యూనిట్ సభ్యులు చెబుతున్నారు. విజువల్ వండర్ గా ఈ సినిమాను రూపొందిస్తున్నట్లుగా చిత్ర యూనిట్ సభ్యులు మొదటి నుండి చెబుతూ వస్తున్నారు. కానీ ఆ మధ్య టీజర్ విడుదల అయిన తర్వాత చిన్న పిల్లల సినిమా అంటూ ట్రోల్స్ రావడంతో గ్రాఫిక్స్ విషయంలో మరింత శ్రద్ధ తీసుకున్నట్లు తెలుస్తోంది. జూన్ 16న ప్రపంచ వ్యాప్తంగా విడుదల కాబోతున్న ఈ సినిమా కథ పూర్తి స్థాయి రామాయణం కాదని.. రామాయణ ఇతివృత్తం నేపథ్యంలో సాగుతుందని అంటున్నారు. ఇప్పటి వరకు యూనిట్ సభ్యులు మాత్రం ఆ విషయంలో క్లారిటీ ఇవ్వలేదు. ప్రభాస్ ను రాముడి పాత్రలో చూడబోతున్న నేపథ్యంలో ఫ్యాన్స్ చాలా ఆసక్తిగా ఉన్నారు. గత ఏడాది నుండి వాయిదా పడుతూ వస్తున్న ఆదిపురుష్ సినిమా ఈ జూన్ లో అయినా విడుదల అవుతుందా అనే అనుమానంతో ప్రభాస్ అభిమానులు ఉన్నారు. ఈసారి కచ్చితంగా విడుదల చేసి తీరుతాం అంటూ ఆదిపురుష్ యూనిట్ సభ్యులు ప్రమోషన్ కార్యక్రమాలను షురూ చేయడం జరిగింది. మే నెలలో దేశ వ్యాప్తంగా యూనిట్ సభ్యులు పర్యటించి ప్రచారం చేయబోతున్నారు.ఈ సినిమా లో ప్రభాస్ కు జోడీగా సీత పాత్రలో కృతి సనన్ నటించింది. రావణుడి పాత్రలో బాలీవుడ్ స్టార్ నటుడు సైఫ్ అలీ ఖాన్ నటించాడు. మొత్తానికి ఈ సినిమా కోసం మొత్తం ఇండియన్ సినీ ప్రేక్షకులు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. పాజిటివ్ రెస్పాన్స్ వస్తే రికార్డులన్నీ కూడా బ్రేక్ అయ్యేలా వెయ్యి కోట్లకు పైగా కలెక్షన్స్ నమోదు అవ్వడం ఖాయం.



# చిత్రాలను పూర్తి చేసే పనిలో పవన్

రానున్న ఎలక్షన్‌లలోపు వీలైనన్ని సినిమాలను పూర్తి చేయాలని పవన్ కళ్యాణ్ తన డేట్స్‌ను పక్కాగా ప్లాన్ చేసుకుంటున్నాడు. గతేడాది కేవలం హరిహర వీరమల్లు ఒకటే చేతిలో ఉందనుకుంటే ఒకేసారి మూడు సినిమాలను అనౌన్స్ చేయడంతో పవన్ అభిమానులు ఫుల్ ఖుషీ అయ్యారు. పవన్‌కళ్యాణ్ లైనప్‌లో కాస్త ఎక్కువ ఎగ్జైట్‌మెంట్ చేస్తున్న సినిమా ఓజీనే. పవన్ అభిమానులే కాదు.. ప్రేక్షకులు సైతం ఈ సినిమాపై ఎంతో ఆసక్తితో ఎదురు చూస్తున్నారు . సుజీత్ దర్శకత్వంలో తెరకెక్కనున్న ఈ సినిమాపై ఇప్పటికే ఎక్కడలేని బజ్ నెలకుంది. ఒక్క ప్రీ లుక్ పోస్టర్‌కే సోషల్ మీడియా షేక్ అయిందంటే ఏ రేంజ్‌లో ఈ సినిమాపై అంచనాలున్నాయో అర్థం చేసుకోవచ్చు. గత వారంఈ సినిమా షూటింగ్ ప్రారంభమైంది. ముంబైలో తొలి ఎపిసోడ్‌ను స్టార్ట్ చేశారు. కాగా తాజాగా పవన్ కళ్యాణ్ ఈ సినిమా షూటింగ్‌లో జాయిన్ అయ్యాడు. ఇదే విషయాన్ని చిత్రబృందం అభిమానులతో పంచుకుంది. పవన్ కళ్యాణ్ ఓజీ సెట్స్‌లోకి అడుగుపెట్టినట్లు ఆయన ఫోటోను సోషల్ మీడియాలో షేర్ చేసింది. ప్రస్తుతం ఈ ఫోటో నెట్టింట తెగ వైరల్ అవుతుంది. గ్యాంగ్‌స్టర్ డ్రామా నేపథ్యంలో తెరకెక్కనున్న ఈ సినిమాకు ఒరిజినల్ గ్యాంగ్‌స్టర్ అనే టైటిల్‌ను ఫిక్స్ చేసినట్లు టాలీవుడ్ వర్గాల సమాచారం. ఆర్‌ఆర్‌ఆర్ వంటి ఇండస్ట్రీ హిట్‌ను నిర్మించిన దానయ్య ఈ సినిమాకు ప్రొడ్యూసర్‌గా వ్యవహరిస్తున్నాడు. ఈ సినిమా కోసం పవన్ 60రోజుల కాల్షీట్లు ఇచ్చాడని తెలుస్తుంది. దీనితో పాటుగా పవన్ హరిహర వీరమల్లు అనే పీరియాడిక్ సినిమా చేస్తున్నాడు. క్రిష్ జాగర్లమూడి దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమా షూటింగ్ చివరి దశలో ఉంది. ఇక మేనల్లుడు సాయిధరమ్‌తో కలిసి నటిస్తున్న వినోదయ్ సిత్తం రీమేక్ కూడా శరవేగంగా షూటింగ్ జరుపుకుంటుంది. ఈ సినిమాకు పి. సముద్రఖని దర్శకత్వం వహిస్తున్నాడు. వీటితో పాటుగా పవన్, హరీష్ శంకర్‌తో ఉస్తాద్ భగత్‌సింగ్‌ను కూడా లైన్లో పెట్టాడు. ప్రస్తుతం ప్రీ ప్రొడక్షన్ పనులు జరుపుకుంటున్న ఈ సినిమా త్వరలోనే షూటింగ్ మొదలుపెట్టనుంది.

## పోస్ట్ ప్రొడక్షన్ పనుల్లో
# హనుమాన్

తేజ సజ్జ హీరోగా అమృతా అయ్యర్ హీరోయిన్ గా రూపొందుతున్న 'హను-మాన్' చిత్రం షూటింగ్ కార్యక్రమాలు పూర్తి చేసుకుని పోస్ట్ ప్రొడక్షన్ వర్క్ జరుపుకుంటున్నట్లుగా చిత్ర యూనిట్ సభ్యులు అధికారికంగా ప్రకటించారు. ప్రశాంత్ వర్మ దర్శకత్వంలో రూపొందుతున్న ఈ సినిమాను పాన్ ఇండియా స్థాయిలోనే కాకుండా విదేశీ భాషల్లో కూడా పెద్ద ఎత్తున విడుదల చేసేందుకు గాను ప్రయత్నాలు చేస్తున్నారు. అన్ని కార్యక్రమాలు పూర్తి చేసుకుని దేశ విదేశాల్లో అనువుగా ఉండే విధంగా ఒక విడుదల తేదీని ప్రకటించే అవకాశాలు ఉన్నాయి అంటూ సమాచారం అందుతోంది. ఇక ఈ సినిమా కథ విషయానికి వస్తే... అంజనాద్రి ని కాపాడేందుకు హీరో రూపంలో హనుమంతుడు వస్తాడు. హీరో తేజ కు అతీత శక్తులు వచ్చిన సమయంలో సినిమా అద్భుతంగా ఉంటుంది అంటూ యూనిట్ సభ్యులు ఆఫ్ ది రికార్డ్ చెబుతున్నారు. అంజనాద్రిని కాపాడేందుకు హీరో రూపంలో ఉన్న హనుమంతుడు చేసే పోరాటాల్లో వీఎఫ్ఎక్స్ విజువల్ వండర్ గా ఉంటాయని కూడా పేర్కొన్నారు. విభిన్న చిత్రాల దర్శకుడిగా పేరున్న దర్శకుడు ప్రశాంత్ వర్మ ఈ కాన్సెప్ట్ తో సినిమాను ఎంపిక చేసుకోవడం పట్ల మొదట్లో కొందరు ట్రోల్స్ చేశారు. కానీ సినిమా యొక్క టీజర్ మరియు పోస్టర్స్ ను విడుదల చేసిన తర్వాత ప్రభాస్ చేసిన ఆదిపురుష్ సినిమాకు ఏమాత్రం తక్కువ లేదనే టాక్ వచ్చింది. కొందరు ఆదిపురుష్ కంటే కూడా హను మాన్ బాగుంటుందనే నమ్మకంతో ఉన్నారు. అతి త్వరలో విడుదల తేదీని ప్రకటించే అవకాశాలు ఉన్నాయి.





# దాస్ కా ధమ్కీకి సీక్వెల్

దాస్ కా ధమ్కీ సినిమా తో విశ్వక్ సేన్ ప్రేక్షకుల ముందుకు వచ్చిన విషయం తెల్సిందే. థియేటర్ రిలీజ్ అయిన ధమ్కీ సినిమాకు కలెక్షన్స్ ఆశించిన స్థాయిలో దక్కలేదు. థియేటర్ రిలీజ్ అయిన మూడు వారాల్లోనే ధమ్కీ చిత్రాన్ని ఆహా ఓటీటీ ద్వారా ప్రేక్షకుల ముందుకు తీసుకు రావడం జరిగింది. ధమ్కీ కి థియేటర్ల ద్వారా పెద్దగా ఆధరణ దక్కలేదు కానీ ఓటీటీ ద్వారా స్ట్రీమింగ్ అయిన వెంటనే భారీ ఎత్తున ప్రేక్షకుల వ్యూవర్ షిప్ ను దక్కించుకుంది. ఓటీటీ లో ధమ్కీ కి మంచి రెస్పాన్స్ వస్తున్న నేపథ్యంలో దర్శక నిర్మాత కమ్ హీరో అయిన విశ్వక్ సేన్ మరియు హీరోయిన్ నివేదా పేతురాజ్ మీడియా ముందుకు వచ్చారు. ఆ సందర్భంగా విశ్వక్ సేన్ మాట్లాడుతూ.. ప్రేక్షకులకు ఓటీటీ ద్వారా ఇంతగా రీచ్ అయ్యేలా ప్రమోట్ చేసిన ఆహా టీమ్ వారికి కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను. ధమ్కీ సినిమాకు వచ్చే ఏడాది సీక్వెల్ ప్లాన్ చేస్తున్నాం. రాబోతున్న సీక్వెల్ మొదటి పార్ట్ కంటే.. మీరు ఊహించేదాని కంటే పది రెట్లు ఎక్కువగా ఉంటుంది... తప్పకుండా ధమ్కీ 1 కంటే కూడా భారీ విజయాన్ని సొంతం చేసుకుంటుందనే నమ్మకాన్ని విశ్వక్ సేన్ వ్యక్తం చేశాడు. ఒక వైపు ధమ్కీ సీక్వెల్ చేయడంతో పాటు మరో వైపు మూడు విభిన్నమైన సినిమాలను కూడా చేస్తున్నట్లుగా పేర్కొన్నాడు. విశ్వక్ సేన్ సొంత బ్యానర్ లో స్వీయ దర్శకత్వంలో సినిమాలను నిర్మించడంతో పాటు బయటి బ్యానర్స్ లో కూడా సినిమాలు చేస్తూ ఉన్నాడు. తక్కువ సమయంలోనే ఎక్కువ సినిమాలు చేస్తూ దూసుకుపోతున్నాడు.

# ఫహాద్ హీరోగా కన్నడలో ధూమమ్



'పుష్ప' చిత్రంలో భన్వర్ సింగ్ షెకావత్‌గా పోలీస్ ఆఫీసర్ పాత్రలో ఇంప్రెస్ చేసిన మలయాళ నటుడు ఫహాద్ ఫాజిల్.. తెలుగులోనూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నాడు. లీడ్ రోల్స్ చేస్తూనే స్టార్ హీరోల చిత్రాల్లో కీలకపాత్రలు పోషిస్తుంటాడు. తాజాగా ఫహాద్ హీరోగా కన్నడ టాప్ ప్రొడక్షన్ హౌస్ హోంబలే ఫిల్మ్స్ సంస్థ కొత్త చిత్రాన్ని అనౌన్స్ చేసింది. 'ధూమమ్' టైటిల్‌తో ఈ మూవీని రూపొందిస్తున్నట్టు తెలియజేస్తూ, ఫహాద్ ఫస్ట్ లుక్ పోస్టర్‌ను రిలీజ్ చేశారు. ఫహద్ నోటికి ప్లాస్టర్ వేసుకొని ఉన్నట్లు డిజైన్ చేసిన పోస్టర్ ఇంటరెస్టింగ్‌గా ఉంది. అలాగే నిప్పు లేకుండా పొగ రాదు అంటూ క్యాప్షన్ ఇవ్వడం సినిమాపై ఆసక్తిని రేపుతోంది. ఈ సినిమాకు 'యూ టర్న్' ఫేమ్ పవన్ కుమార్ దర్శకత్వం వహిస్తున్నాడు. అపర్ణ బాలమురళి హీరోయిన్‌గా నటిస్తోంది. ప్రస్తుతం షూటింగ్ దశలో ఉన్న ఈ సినిమాని వచ్చే ఏడాది రిలీజ్ చేయనున్నట్టు ప్రకటించారు.

# కమెడియన్ అల్లు రమేశ్ మృతి

తెలుగు చిత్రసీమలో మరో విషాదం నెలకొంది. ప్రముఖ రంగస్థల నటుడు, కమెడియన్ అల్లు రమేశ్ మృతి చెందాడు. గుండె ఫెయిల్యూర్ కారణంగా అల్లు రమేశ్ మృతి చెందినట్లు ఆయన కుటుంబ సభ్యులు తెలిపారు. ఆయన మృతి పట్ల పలువురు సినీ ప్రముఖులు, రంగస్థల నటులు సంతాపం ప్రకటిస్తున్నారు. అల్లు రమేశ్ సినిమాలతో పాటు పలు వెబ్ సిరీస్‌లలో కూడా నటించాడు. వైజాగ్‌కు చెందిన అల్లు రమేశ్ నాటక రంగం నుంచి చిత్ర పరిశ్రమకు వచ్చాడు. ఆయన నటించిన తొలి సినిమా సిరిజల్లు. ఈ సినిమాలో నలుగురు హీరోల్లో ఆయన ఒకడు. నెపోలియన్ సినిమా ఆయనకు మంచి పేరు తెచ్చిపెట్టింది. తోలుబొమ్మలాట, మధుర వైన్స్, రావణ దేశం వంటి సినిమాలతో గుర్తింపు తెచ్చుకున్నాడు. కేరింతలు ఆయన చివరి సినిమా. ఇటీవలే ఆయన నటించిన మావిడాకులు వెబ్ సిరీస్ యూట్యూబ్‌లో మిలియన్ల వ్యూస్‌తో దూసుకుపోతుంది. ఈ వెబ్ సిరీస్‌తో రమేశ్‌కు మంచి గుర్తింపు వచ్చింది.



# 'ఏజెంట్' నాకు గొప్ప ధైర్యాన్ని ఇచ్చింది.

యాక్షన్ ఎంటర్టైనర్లకు చక్కగా సరిపోయే అఖిల్ అక్కినేని స్టైలిష్ యాక్షన్ థ్రిల్లర్లను రూపొందించడంలో పేరుపొందిన సురేందర్ రెడ్డి 'ఏజెంట్' తో మునుపెన్నడూ లేని అనుభూతిని అందించడానికి చేతులు కలిపారు. ఎకె ఎంటర్టైన్మెంట్స్ అనిల్ సుంకర ఈ చిత్రాన్ని భారీ ఎత్తున నిర్మించారు. ఇప్పటికే విడుదలైన ఏజెంట్ ప్రమోషనల్ కంటెంట్ కి ట్రెమండస్ రెస్పాన్స్ వచ్చింది. ఈ రోజు కాకినాడలో ఏజెంట్ థియేట్రికల్ ట్రైలర్ లాంచ్ ఈవెంట్ ని గ్రాండ్ గా నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ సినిమాటోగ్రఫీ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాల్ కృష్ణ ట్రైలర్ ని లాంచ్ చేశారు. ట్రైలర్ లో 'ఏజెంట్' ప్లాట్లైన్ గురించి పెద్దగా రివిల్ చేయకుండా క్యూరియాసిటీని పెంచారు. ప్రతి పాత్ర పెర్ఫార్మెన్స్ యాక్షన్ కొరియోగ్రఫీ సినిమాటోగ్రఫీ బీజీఎం ప్రొడక్షన్ వాల్యూస్.. ఇలా అన్నిఎలిమెంట్స్ నెక్స్ట్ లెవల్ లో వున్నాయి. ఈ క్రేజీ కాంబినేషన్ నుంచి ఆశించే అన్నిఅంశాలు ట్రైలర్ లో వున్నాయి. డేరింగ్ డాషింగ్ వైల్డా ఉండే పవర్-ప్యాక్డ్ ఏజెంట్ పాత్రలో కనిపించారు అఖిల్. స్క్రీన్ పై కనిపించిన ప్రతి ఎలిమెంట్ అద్భుతంగా వుంది. అఖిల్ తన స్టంట్స్ వైల్డ్ పెర్ఫార్మెన్స్తో అదరగొట్టారు. అతని పాత్ర హైపర్యాక్టివ్గా వుండి కథనానికి ఫ్రెష్ నెస్ ని తీసుకొచ్చింది. సూపర్ స్టార్ మమ్ముట్టి డినో మోరియా గొప్ప వాల్యుని జోడించారు. ఇందులో సాక్షి వైద్య రొమాంటిక్ ఎపిసోడ్లలో అద్భుతంగా కనిపించింది. రసూల్ ఎల్లోర్ ప్రతి ఫ్రేమ్ని చాలా స్టైలిష్గా క్యాప్చర్ చేసాడు. హిప్ హాప్ తమిళ సంగీతం మరో పెద్ద ఎసెట్. ప్రొడక్షన్ వాల్యూస్ హాలీవుడ్ స్టాండర్డ్ లో ఉన్నాయి. ట్రైలర్ లాంచ్ ఈవెంట్ లో అఖిల్ అక్కినేని మాట్లాడుతూ.. మీరు ఇచ్చిన ప్రేమ అభిమానం ఎనర్జీ .. వచ్చే పదిరోజులు రిలీజ్ వరకూ నాకు ఎంతో ఉపయోగపడుతుంది. మీ అందరికీ కృతజ్ఞతలు. ఏజెంట్ రెండేళ్ళ జర్నీ. ఈ జర్నీని మాటల్లో ఎలా చెప్పాలో అర్ధం కావడం లేదు. ఈ జర్నీలో మానసికంగా చాలా మారాను. నాకు సినిమా అభిమానులు అంటే ఎంత పిచ్చో ఇంకా అర్ధమైయింది. నేను ఇక్కడే వుంటాను మీ కోసం పని చేస్తూనే వుంటాను. మీ అభిమానం గుండెల్లో దాచిపెట్టుకుంటాను. సాక్షి వైద్య ఏజెంట్ లో సర్ ప్రైజ్ ప్యాకేజ్. సినిమా అంటే తనకి ప్రాణం. హిపాప్ తమిళా ప్రాణం పెట్టి మ్యూజిక్ చేశారు. బీజీఎం చాలా వైల్డ్ గా వుంటుంది. అనిల్ సుంకర గారు నా బ్యాక్ బోన్. అభిమానుల కోసం ఇంత పెద్ద సినిమా చెద్దాం అందరికీ పిచ్చెక్కిపోవాలని అన్నారు. అదే మాట మీద నిలబడ్డారు. ఆయన నా సపోర్ట్ సిస్టం. ఏజెంట్ క్రెడిట్ అంతా దర్శకుడు సురేందర్ రెడ్డి గారికే ఇస్తాను. నన్ను ఇలా చూపించాలని ఇమాజిన్ చేసింది ఆయనే. నన్ను ఎప్పుడూ ఇలా ఊహించుకోలేదు. ఈ రోజు ఇంత నమ్మకంగా మాట్లడుతున్నానంటే ఏజెంట్ ఇచ్చిన ధైర్యం. ఏజెంట్ నాకు ధైర్యాన్ని ఇచ్చింది. సురేందర్ రెడ్డి గారికి కృతజ్ఞతలు. అభిమానులు నాపై ఎంత బరువు పెట్టినా దాన్ని మోస్తాను మీ కోసం వైల్డ్ గా వస్తూనే వుంటాను. మమ్మల్ని బ్లెస్ చేయడానికి విచ్చేసిన గౌరవ మంత్రిగా గారికి కృతజ్ఞతలు. అందరికీ కృతజ్ఞతలు. ఏప్రిల్ 28న థియేటర్లో పిచ్చెక్కిపోవాలి" అన్నారు మంత్రి వేణుగోపాల్ కృష్ణ మాట్లాడుతూ.. ఏజెంట్ ట్రైలర్ చూస్తుంటే మనలోని జోష్ పెరిగిపోతుంది. కాకినాడలో ట్రైలర్ లాంచ్ చేయడం ఆనందంగా వుంది. అఖిల్ గారిని మొన్న జంప్ చేసిన విధానం ఈ రోజు ట్రైలర్ కనిపించిన తీరు చూస్తుంటే హాలీవుడ్ సినిమాల్లో చూసిన స్ఫూర్తి వచ్చింది. ఏప్రిల్ 28న తెలుగు సినిమా అభిమానులంతా ఏజెంట్ ని సూపర్ సక్సెస్ చేస్తారని సినిమా రికార్డ్ లెవల్ హిట్ కావాలని కోరుకుంటున్నాను. అనిల్ సుంకర గారికి సురేందర్ రెడ్డి గారికి హీరోయిన్ సాక్షి వైద్యకి టీం అందరికీ ఆల్ ది బెస్ట్' తెలిపారు. నిర్మాత అనిల్ సుంకర మాట్లాడుతూ.. ఏప్రిల్ 28 ప్రేక్షకులు అభిమానులకు ఒక పండగ ఉత్సవం. ఏజెంట్ సినిమా మొదలుపెట్టినప్పుడు ఈ సినిమా తర్వాత ఏజెంట్ అంటే ఒక విగ్రహం గుర్తుకు రావాలని అది అఖిల్ కావాలి అనుకున్నాం. ఇది సురేందర్ రెడ్డి కోరిక . ఈ కోరికని నెరవేర్చాడు అఖిల్. గత రెండేళ్ళు గా చాలా కృషి చేశాడు. కష్టపడ్డాడు. టీం అంతా కష్టపడి చేసిన సినిమా. యాక్షన్ స్పై జోనర్ ఇది ఇది వరకు సినిమాలు వచ్చాయి కానీ ఏజెంట్ చాలా ప్రత్యేకం. ఆరు దేశాల్లో డిఫరెంట్ లోకేషన్స్ లో మంచి యాక్షన్ కొరియోగ్రఫర్స్ స్టంట్స్ తో చేసిన చిత్రమిది. ఈ చిత్రానికి టీం అంతా డే అండ్ నైట్ కష్టపడుతున్నారు. మమ్ముట్టి డినో మోరియా వారి బెస్ట్ ఇచ్చారు. మమ్ముట్టి గారి గొప్పదనం ఈ చిత్రంతో మరోసారి చూస్తారు. మంత్రిగారికి కృతజ్ఞతలు. సక్సెస్ టూర్ కి మళ్ళీ కాకినాడ వస్తాం. ఏప్రిల్ 28 ఒక పండగలా వుంటుంది." అన్నారు సాక్షి వైద్య మాట్లాడుతూ.. కాకినాడ రావడం అనందంగా వుంది. ఏజెంట్ ట్రైలర్ మీ అందరికీ నచ్చిందని అనుకుంటున్నాను.





మీ అందరికీ ఒక వార్నింగ్... ఏప్రిల్ 28న థియేటర్ లో ఏజెంట్ తో వైల్డ్ రైడ్ కి రెడీ అవ్వండి" అన్నారు. ఈ చిత్రానికి కథను వక్కంతం వంశీ అందించారు. హిప్ హాప్ తమిళా సంగీతం సమకూర్చారు. రసూల్ ఎల్లోర్ కెమెరా మెన్ గా పని చేస్తున్నారు. ఎకె ఎంటర్టైన్మెంట్స్ సురేందర్ 2 సినిమా పతాకాలపై రామబ్రహ్మం సుంకర నిర్మిస్తున్న ఈ చిత్రానికి జాతీయ అవార్డు గ్రహీత నవీన్ నూలి ఎడిటర్ అవినాష్ కొల్లా ఆర్ట్ డైరెక్టర్. ఏప్రిల్ 28న విడుదల కానున్న ఈ చిత్రానికి అజయ్ సుంకర దీపా రెడ్డి సహ నిర్మాతలు

PRINTED AND PUBLISHED BY V.NARSINGAM, ON BEHALF OF CH.V. PRABHAKAR RAO AND PRINTED AT SRI SHARADHA OFFSET PRINTERS. H.NO.9-14/8/3, BUGGARAM VILLAGE AND MANDAL, BUGGARAM GRAMAPANCHAYATH- 505454, JAGTIAL DISTRICT, TELANGANA STATE.. PUBLISHED AT 6-6-206,PADMA NAGAR, JAGTIAL - 505327, JAGTIAL DISTRICT, TELANGANA STATE.
EDITOR : CH V. PRABHAKAR RAO, RNI T.C. TELTEL/2021/81092.
PHONE : 9391533339 EMAIL: prajamantalu@gmail.com